శనివారం 28-12-2019

సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 277

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో రాష్ట్రపతి కోవింద్, గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ - 2లో

# కేటీఆరే తర్వాతి ముఖ్యమంత్రి!

- ఆయనకు ఒరిజినాలిటీ ఉంది కాబట్టే ప్రజలు కోరుకుంటారు
- కేసీఆర్ తర్వాత ప్రజాదరణ, నమ్మకం ఉన్న వ్యక్తి కేటీఆర్...
- ప్రజల్ని రెచ్చగొట్టి ఓట్లడగటం కొన్ని పార్టీలకు అలవాటు
- జిల్లా పరిషత్ ఎన్నికల తరహాలో మున్సిపల్ ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తాం
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్

'మా యువ నాయకుడు కేటీఆర్‌లో ఒరిజినాలిటీ ఉంది. ఆయన సీఎం కావాలని అందరూ కోరుకుంటారు. కేసీఆర్ తర్వాత ఐదేళ్లు, పదేళ్లు.. ఎప్పటికైనా సీఎం ఎవరు అంటే.. కేటీఆర్‌నే సహజంగా కోరుకుంటారు. అధికారం కోసం పాకులాడకుండా నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసే వ్యక్తి కేటీఆర్..'అని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహంతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తర్వాత ప్రజాదరణ, నమ్మకం, ముక్కుసూటితనం, మాటకు కట్టుబడి ఉండే నైజం, డబుల్ గేమ్ ఆడకుండా నమ్ముకున్న వారి కోసం పనిచేయడం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే వ్యక్తి మా యువ నాయకుడు కేటీఆర్. తర్వాత సీఎం ఎవరు అనే ప్రశ్న సహజంగానే వస్తుంది. క్లాస్‌లో ఫస్ట్, సెకండ్ వచ్చే విద్యార్థులుంటారు. రేపేదైనా పోటీకి వెళ్తే.. ఫస్ట్ ఎవరొస్తరు అంటే చెప్పగలం.. అంతేకానీ ఫెయిలైన వ్యక్తి, మామూలు మార్కులతో

మిగతా 2వ పేజీలో ▶





## పోటీ చేసే సత్తా లేకే విమర్శలు

**విపక్షాలపై మంత్రి కేటీఆర్ మండిపాటు**

- పథకాలే ఎజెండాగా మున్సిపల్ ఎన్నికల బరిలోకి
- స్థానికంగానే పార్టీ అభ్యర్థుల ఎంపిక
- ఎన్నికలు పూర్తయ్యేదాకా క్షేత్ర స్థాయిలోనే ఎమ్మెల్యేలు
- 'మున్సిపల్'కు సన్నద్ధతపై టీఆర్ఎస్ కార్యవర్గం భేటీ
- ఎన్నికల సన్నద్ధతపై కేటీఆర్ దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: 'మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మా పార్టీలో ఆశావహులు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే సత్తా లేని విపక్షాలు టీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నాయి. ఎన్నికల్లో పోటీకి ఎక్కడైనా అధికార పార్టీ దూరంగా ఉంటుంది కానీ.. ఇక్కడ ప్రతిపక్షాలు దూరంగా ఉంటున్నాయి'అని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. పురపాలక ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో శుక్రవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం పార్టీ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'పార్టీ అభ్యర్థుల ఎంపిక వికేంద్రీకరణ పద్ధతిలో ఎక్కడికక్కడే స్థానికంగా జరుగుతుంది. పార్టీ కూడా ఎప్పటికప్పుడు నివేదికలు

మిగతా 2వ పేజీలో ▶

**శుక్రవారం రాత్రి నిజామాబాద్‌లో ముస్లిం ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ముస్లింలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ**





## బొమ్మా బొరుసు లాంటివే

**ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌పై నిజామాబాద్ బహిరంగ సభలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ**

- ఎన్‌పీఆర్‌ను నిలిపివేయాలని సీఎం కేసీఆర్‌ను కోరాం
- దీనిపై అన్ని పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు
- ఎంఐఎం మద్దతు ఎప్పటికీ కె. చంద్రశేఖర్‌రావుకే
- ఎన్ఆర్‌సీపై మోదీ, అమిత్ షావి అబద్ధపు మాటలు
- జనన ధ్రువీకరణ అడిగితే సామాన్యుల ఆత్మగౌరవం దెబ్బతింటుంది
- ఎన్ఆర్‌సీ వ్యతిరేక ఉద్యమంతో బీజేపీకి కంటి మీద కునుకులేదు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ), జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)లు నాణానికి బొమ్మా బొరుసు లాంటివేనని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ వల్ల ముస్లింలతోపాటు రానున్న రోజుల్లో క్రైస్తవులు, దళితులకు కూడా ఇబ్బందులు తప్పవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నార్సీ, సీఏఏకు వ్యతిరేకంగా ముస్లిం ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిజామాబాద్ నగరంలోని ఈద్గా మైదానంలో జరిగిన

మిగతా 2వ పేజీలో ▶

## మెడికల్ కాలేజీలకు విజిటింగ్ ఫ్యాకల్టీ

- ప్రముఖ ప్రైవేటు వైద్యులను నియమించుకునే వీలు
- మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయం
- విదేశీ డాక్టర్లనూ తీసుకునే వెసులుబాటు
- ఇటు వైద్య విద్యలో నాణ్యత.. అటు కాలేజీలకు ప్రతిష్ట

- డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి.. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఏఐజీ) చైర్మన్‌గా ఉన్నారు. అనేక అంతర్జాతీయ మెడికల్ సంస్థల్లో సభ్యులుగా, డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. నిత్యం అంతర్జాతీయ వైద్య వేదికలపై ప్రసంగిస్తుంటారు. అధునాతన వైద్య రంగంలో నూతన పంథాలను ప్రవేశపెట్టారు.
- డాక్టర్ సోమరాజు.. కేర్ వ్యవస్థాపకుడు. వైద్య రంగంలో ఎంతో అనుభవం గడించారు. ప్రొఫెసర్‌గా సేవలు అందించారు. అధునాతన వైద్య పరిజ్ఞానాన్ని అందించారు. అంతర్జాతీయస్థాయిలో వైద్య వేదికలపై సెమినార్లు ఇచ్చారు.
- డాక్టర్ గురువారెడ్డి.. సన్‌షైన్ వ్యవస్థాపకుడు. వైద్యరంగంలో వచ్చిన అనేక మార్పులను అందిపుచ్చుకొని ఆసుపత్రిని తీర్చిదిద్దారు. దేశవిదేశాల్లో వైద్యరంగంలో వచ్చిన మార్పులు ఒడిసిపట్టుకున్నారు.

**రాష్ట్రంలోని ఇలాంటి ప్రముఖులతో పాటు దేశ విదేశాలకు చెందిన వైద్యులు కొత్తగా వచ్చే ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులకు విజిటింగ్ ఫ్యాకల్టీగా బోధిస్తే ఎలా ఉంటుంది?** - 2లో





## మాటల యుద్ధం

- వివరాలు 5లో





## రైతు సంతకంతోనే రుణమాఫీ!

- తనకు అప్పుందని రైతు ధ్రువీకరించాల్సిందే.. ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదన
- కొత్త విధానంపై వ్యవసాయశాఖ, బ్యాంకర్ల చర్చలు - వివరాలు 3లో



## క్యూలో నిల్చుని.. నేలపై కూర్చుని

- ప్రభుత్వాస్పత్రిలో నిజామాబాద్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- వైద్య సేవలపై ఆరా
- విధులకు గైర్హాజరైన 111 మందికి మెమోలు
- సైకిల్‌పై సాదాసీదాగా ఆస్పత్రికి వచ్చిన కలెక్టర్

- వివరాలు 13లో

## ఇంటర్నెట్ షట్ డౌన్ @100

- కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వివిధ సందర్భాల్లో 100 సార్లకుపైగా ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా గురువారం ఉత్తరప్రదేశ్‌లో 21 జిల్లాల్లో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేయడం చర్చకు దారితీస్తోంది.

**కార్గిల్‌లో 145 రోజుల తర్వాత మొబైల్ ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణ**

- వివరాలు 5లో









# రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోమ్'

## హాజరైన గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ • రాష్ట్రపతితో మర్యాదపూర్వకంగా భేటీ

సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది కోసం ఈ నెల 20న హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో గవర్నర్ తమిళిసై, సీఎం కె.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. ఎట్‌హోం కార్యక్రమానికి వచ్చిన అతిథులకు రాష్ట్రపతి కోవింద్ దంపతులు అభివాదం చేసి పేరుపేరునా పలకరించారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులను సీఎం కేసీఆర్ రాష్ట్రపతి కోవింద్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారంతా రాష్ట్రపతి దంపతులతో గ్రూప్ ఫొటో దిగారు.

## రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: కోమోరిన్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు 0.9 కి.మీ. ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనపడటంతో పాటు ఆగ్నేయ, తూర్పు దిశల నుంచి గాలులు వీస్తుండటంతో రాష్ట్రంలో శనివారం పొడి వాతావరణం నెలకొని ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే ఆదివారం కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు పేర్కొన్నారు. తేమ గాలుల కారణంగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో నిజామాబాద్‌లో సాధారణం కంటే 7.3 డిగ్రీలు అధికంగా 21.4 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. రామగుండంలో సాధారణం కంటే 6.2 డిగ్రీలు అధికంగా 20.6 డిగ్రీలు, నల్లగొండలో సాధారణం కంటే 1.2 డిగ్రీలు తక్కువగా 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తర భారతంలో చలి తీవ్రంగా నమోదవుతుంటే రాష్ట్రంలో మాత్రం ఈశాన్యం నుంచి వచ్చే చలి గాలుల తీవ్రత భూమిని తాకే పరిస్థితి లేకపోవడంతో చలి అంతగా లేదని వాతావరణ కేంద్రం వివరించింది.

# మెడికల్ కాలేజీలకు విజిటింగ్ ఫ్యాకల్టీ

## మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు రంగంలో సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులను ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు 'విజిటింగ్ ఫ్యాకల్టీ'గా నియమించుకునే వెసులుబాటు కల్పిస్తూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ (బీవోజీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. విదేశాల్లో ఉండే ప్రముఖ వైద్యులను కూడా నియమించుకోవడానికి అనుమతించింది. ప్రస్తుతం దేశంలో మెడికల్ కాలేజీల్లో విజిటింగ్ ఫ్యాకల్టీ అనే అంశం లేదు. 30 ఏళ్ల క్రితం విజిటింగ్ ఫ్యాకల్టీ వ్యవస్థ ఉండగా, దాన్ని ఇప్పుడు తిరిగి ప్రవేశపెట్టారు. ప్రైవేట్ లేదా ప్రభుత్వ మెడికల్ కాలేజీ విజిటింగ్ ఫ్యాకల్టీని నియమించుకోవచ్చు, కానీ ఈ నియామకం ప్రస్తుతం ఉన్న అధ్యాపకుల సంఖ్యలో 50 శాతానికి మించకూడదు.



### పెరగనున్న ప్రతిష్ట..

రాష్ట్రంలో 21 ప్రైవేటు మెడికల్ కాలేజీలు, 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. వాటిల్లో ఎంబీబీఎస్ సీట్లు 4,790 ఉండగా, పీజీ మెడికల్ సీట్లు 1,400 ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 2,358 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా, 1,051 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 1,307 ఖాళీలున్నాయి. ఇక ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. మరో వైపు ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో చాలాచోట్ల బోధనా సిబ్బంది సామర్థ్యంపై విమర్శలున్నాయి. రోజువారీ వైద్యరంగంలో వస్తున్న మార్పులను, అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవట్లేదన్న విమర్శలున్నాయి. దీంతో వైద్య విద్య నాసిరకంగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి. దీంతో కొన్ని మెడికల్ కాలేజీల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపట్లేదు. దీంతో ప్రముఖ ప్రైవేటు వైద్యులను విజిటింగ్ ఫ్యాకల్టీగా తీసుకుంటే ఆయా కాలేజీల్లో వైద్య బోధన మెరుగుపడుతుందని ఎంసీఐ ఉద్దేశంగా చెబుతున్నారు. ప్రముఖ వైద్యుల పేర్లను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పెట్టడం ద్వారా వాటి ప్రతిష్ట పెరుగుతుందని భావిస్తున్నారు. నెలకు నాలుగు క్లాసులు, ఒక్కో క్లాసు మూడు గంటలు ఉండేలా చేయాలని బీవోజీ నిర్ణయించింది. విజిటింగ్ ఫ్యాకల్టీకి ఎంత పారితోషికం ఇవ్వాలనేది ఆయా కాలేజీల ఇష్టానికే వదిలేశారు. విజిటింగ్ ఫ్యాకల్టీ తప్పనిసరిగా పీజీ పూర్తి చేసి, సంబంధిత స్పెషాలిటీలో కనీసం 8 ఏళ్ల అనుభవం కలిగి ఉండాలి. గరిష్ట వయోపరిమితి 70 సంవత్సరాలుగా నిర్ధారించారు. విజిటింగ్ ఫ్యాకల్టీని మొదట ఏడాది కాలానికి నియమిస్తారు. తర్వాత మరో ఏడాది పొడిగించుకోవచ్చు. మెడికల్ కాలేజీ సీట్లను కాపాడుకోవడంలో విజిటింగ్ ఫ్యాకల్టీని పరిగణనలోకి తీసుకోరు.

**వైద్యవిద్య ప్రమాణాలు పెరుగుతాయి**

ప్రైవేటు రంగంలో ప్రముఖులైన దేశ విదేశీ వైద్యులను మెడికల్ కాలేజీల్లో విజిటింగ్ ఫ్యాకల్టీగా నియమించడం వల్ల వైద్యవిద్య నాణ్యత పెరుగుతుంది. అధునాతన పరిజ్ఞానాన్ని విద్యార్థులు, రెగ్యులర్ ఫ్యాకల్టీకి కూడా అందించడానికి వీలవుతుంది. ఆయా మెడికల్ కాలేజీల ప్రతిష్ట కూడా పెరుగుతుంది. – డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, వీసీ, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం

**ఎంతోమంది ప్రముఖులున్నారు**

ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో వైద్య విద్య నాణ్యత మరింత పెరుగుతుంది. డాక్టర్ సోమరాజు, డాక్టర్ శాంతారాం, డాక్టర్ మానస్ పాణిగ్రహి, డాక్టర్ బాలాంబ వంటి ప్రముఖ వైద్యులు విజిటింగ్ ఫ్యాకల్టీగా వస్తే ఆయా స్పెషాలిటీల్లో విద్యార్థులకు అత్యంత నాణ్యమైన వైద్య విద్య అందించడానికి వీలు కలుగుతుంది. – డాక్టర్ పుట్టా శ్రీనివాస్, డైరెక్టర్, మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ

## డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీల కాల పరిమితి పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ విభాగాల అధిపతులు (నాన్ కేడర్), ప్రభుత్వ అదనపు, సంయుక్త కార్యదర్శుల (నాన్ కేడర్)తో పాటు మూడో శ్రేణి గెజిటెడ్, ఆపై స్థాయి పోస్టుల డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31తో కాల పరిమితి ముగియనుండటంతో పొడిగిస్తున్నట్లు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఈ కమిటీల కాల పరిమితి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బొమ్మా బొరుసు లాంటివే

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభలో అసదుద్దీన్ ప్రసంగించారు. ఎన్‌పీఆర్‌ను ఆపాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా త్వరలో అన్ని పార్టీల అభిప్రాయాలను సేకరించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని అసదుద్దీన్ పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందికరమైన చట్టాలను వ్యతిరేకిస్తామని కేసీఆర్ చెప్పారన్నారు. ఆయనకు ముస్లిం సమాజం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై అసద్ ప్రసంశల జల్లు కురిపించారు. ఎంఐఎం ఎప్పటికీ కేసీఆర్‌కు మద్దతుగా నిలుస్తుందని ప్రకటించారు. సీఎం కేసీఆర్‌కు, ప్రధాని మోదీకి ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉందని.. ఇద్దరూ హిందువులే అయినప్పటికీ కేసీఆర్ లౌకిక భావాలున్న నాయకుడని కొనియాడారు. నిజామాబాద్ సభకు మద్దతివ్వాలని కాంగ్రెస్‌ను రెండుసార్లు ఆహ్వానించినా ఆ పార్టీ స్పందించలేదన్నారు.

### ఆ రెండు ఎన్‌పీఆర్‌లకు ఎంతో తేడా..

యూపీఏ హయాంలో 2010లో జరిగిన ఎన్‌పీఆర్‌కు, మోదీ ప్రభుత్వం 2020లో నిర్వహించనున్న ఎన్‌పీఆర్‌కు చాలా తేడా ఉందని అసదుద్దీన్ తెలిపారు. తాజా ఎన్‌పీఆర్‌లో కొత్తగా తల్లిదండ్రుల పేర్లు, వారు పుట్టిన ప్రాంతం, ఫోన్ నంబర్‌ను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ అధికారులకు సందేహం వస్తే అలాంటి వారి పేర్లను పక్కనబెట్టి వారికి నోటీసులు జారీ చేస్తారని, మూడు నెలల్లో ఆధారాలు చూపకపోతే పౌరసత్వం నిరాకరించే అవకాశాలున్నాయని అసద్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 29 శాతం మంది మాత్రమే జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని, మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జనన ధ్రువీకరణ పత్రాన్ని అడిగితే సామాన్యుల ఆత్మగౌరవం దెబ్బతింటుందన్నారు. తామంతా ఇక్కడే పుట్టామని, ఇక్కడే మరణిస్తామని వ్యాఖ్యానించారు. పౌరసత్వ సవరణ బిల్లుపై పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రతులను తాను చింపేయడాన్ని కొందరు ప్రశ్నించారన్న అసద్... మతప్రాతిపదికన తెచ్చే బిల్లులను చింపేస్తానని స్పష్టం చేశారు.

### మోదీ, అమిత్ షావి అబద్ధపు మాటలు..

ఎన్నార్సీ, సీఏఏల విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షావి అబద్ధపు మాటలని అసదుద్దీన్ విమర్శించారు. ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాన్ని చూసి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు కంటి మీద కునుకు కరువైందన్నారు. మతం పేరుతో దేశాన్ని విభజించాలని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్, గాంధీజీ కలలు కన్న రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ చదివిన ఎంటైర్ పొలిటికల్ సైన్స్ అనే డిగ్రీ ప్రపంచంలో ఎక్కడా లేదని ఎద్దేవా చేశారు.

### ఆర్‌ఎస్‌ఎస్‌పైనా ఘాటు వ్యాఖ్యలు..

దేశ రాజ్యాంగంలో తలదూర్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తోందని అసదుద్దీన్ మండిపడ్డారు. 90 ఏళ్లపాటు చెడ్డీ వేసుకున్న ఆర్‌ఎస్‌ఎస్... ఇప్పుడు ప్యాంటు ధరిస్తోందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు ఇలాంటి సభలను నిర్వహిస్తున్నామన్న ఎంఐఎం అధినేత... రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం దేశంలో అన్ని మతాలకు సమాన హక్కుందని గుర్తుచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో ముస్లిం వీరులు త్యాగాలు చేశారన్నారు. అస్సాం పునరావాస కేంద్రాల్లో 19 లక్షల మంది ఉన్నారని, వారిలో 5.40 లక్షల మంది ముస్లింలని పేర్కొన్నారు. 'మిగతా వారికి పౌరసత్వం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మరి 5.40 లక్షల మంది ముస్లింలు పౌరసత్వం కోసం ఎవరిని ఆశ్రయించాలి?'అని అసద్ ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల నుంచి ఉన్న వారిలో 28 మంది మరణించారని, మిగిలిన వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సి వస్తోందన్నారు. రాజ్యాంగంలోని ముందుమాటను సభకు హాజరైన వారితో అసదుద్దీన్ చదివించారు. ఈ సభలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు షకీల్ అమేర్ (బోధన్), నల్లమడుగు సురేందర్ (ఎల్లారెడ్డి), జెడ్పీ చైర్‌పర్సన్ దాదన్నగారి విఠల్‌రావు, న్యూడెమోక్రసీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సభలో సెల్‌ఫోన్ లైట్లు ప్రదర్శిస్తున్న ముస్లింలు

# కేటీఆరే తర్వాతి ముఖ్యమంత్రి!

▶ మొదటి పేజీ తరువాయి

పాసైన వ్యక్తి పేర్లు చెప్తామా?'అని ప్రశ్నించారు. తర్వాతి ముఖ్యమంత్రి ఎవరు అనే అంశాన్ని తమ అధినేత, పార్టీ చూసుకుంటుందని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

### కార్యకర్తలా పనిచేసిండు..

'వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తొలుత సీఎం కేసీఆర్‌ను తర్వాత కేటీఆర్‌ను కలుసుకుని రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి తెలుసుకుంటారు. కేటీఆర్ ఎవరినీ తన వద్దకు పిలిపించుకోడు. ఊర్లోకి వెళ్లి చిన్న పిల్లలను అడిగినా తర్వాతి సీఎం ఎవరు అని అడిగితే కేటీఆర్ పేరే చెప్తారు. ఆయన నేరుగా రాజకీయాల్లోకి రాలేదు. ఉద్యమంలో పాల్గొనడంతో పాటు నిమ్స్ ఆసుపత్రిలో కేసీఆర్‌ను కాపాడుకోవడంలో మాతో పాటు కార్యకర్తలా పనిచేసిండు. ఈర్ష్యాద్వేషాలతో చెడగొట్టేవాళ్లు మాత్రమే విమర్శలు చేస్తారు'అని శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

### వారిని ప్రజలు ఆదరించరు..

'కొన్ని పార్టీలకు ఎన్నికల్లో రెచ్చగొట్టి ఓట్లు అడగటం అలవాటుగా మారింది. కులం మతం ప్రాతిపదికన ఓట్లు అడిగే వారిని ప్రజలు ఆదరించరు. ఎంఐఎం నేత అసదుద్దీన్‌తో కలవడాన్ని బీజేపీ రాజకీయం చేస్తోంది. సీఎంను ఏ పార్టీ వారైనా కలవొచ్చు. టీఆర్‌ఎస్ అసలైన సెక్యులర్ పార్టీ. యాదాద్రి దేవాలయాన్ని అభివృద్ధి చేయడం టీఆర్‌ఎస్ ఘనత కాదా? మత కలహాలు సృష్టించి ఓట్లు దండుకోవాలనే కొందరి ప్రయత్నాలను అడ్డుకుంటాం. తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ కుటుంబం ప్రాణాలను కూడా పణంగా పెట్టింది. ఎన్నికలంటేనే యుద్ధం. యుద్ధానికి సిద్ధం కాకుండా కొందరు మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌పై విమర్శలు చేస్తున్నారు'అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

**ఉత్తమ్ హుందాగా మాట్లాడాలి**

'హుజూర్‌నగర్‌లో తన సతీమణిని గెలిపించుకోలేకపోయిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ హుందాగా మాట్లాడాలి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గొడవలు జరుగుతున్నా, తెలంగాణ మాత్రం ప్రశాంతంగా ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వ అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లేస్తారు. జిల్లా పరిషత్‌ల తరహాలో మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం. రాష్ట్రాన్ని కాపాడుకునే సత్తా కేసీఆర్, కేటీఆర్‌కు ఉంది. ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉంటే పోటీకి దూరంగా ఉండాలనే నిబంధనను ఎంఐఎం కోసమే ఎత్తివేశారనే ఆరోపణ అర్థరహితం'అని శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

## 3న జూనియర్ అసిస్టెంట్ ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి నాలుగో దశ ధ్రువపత్రాల పరిశీలనను వచ్చే నెల 3న నాంపల్లిలోని తమ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు స్థానికత ఆధారంగా జనవరి 2న వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని పేర్కొంది. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే సమయంలో అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లను తమ వెంట తెచ్చుకోవాలని వివరించింది. అలాగే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపింది. వివరాలకు www.tspsc. gov.in ను సంప్రదించాలని సూచించింది.

## నుమాయిష్‌కు అగ్నిమాపకశాఖ ఎన్వోసీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నుమాయిష్ (ఎగ్జిబిషన్)కు అగ్నిమాపకశాఖ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) జారీ చేసింది. ఈ ఏడాది జనవరి 30న నుమాయిష్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో దాదాపు 130 దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో కోట్లాది రూపాయల సామగ్రి బుగ్గిపాలైంది. కొన్ని షాపులకు ఇన్సూరెన్స్ ఉన్నా.. నుమాయిష్‌కు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్వోసీ సర్టిఫికెట్ లేకపోవడంతో చాలా మంది వ్యాపారులు చేసుకున్న క్లెయిమ్‌లను బీమా సంస్థలు తిరస్కరించాయి. గతేడాది జరిగిన పొరబాటుతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా నుమాయిష్ నిర్వాహకులు ఈ ఏడాది ముందుగానే ఫైర్ ఎన్వోసీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# పోటీ చేసే సత్తా లేకే విమర్శలు

▶ మొదటి పేజీ తరువాయి

తెప్పించుకుని సూచనలు చేస్తుంది. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు అప్రమత్తంగా ఉండటంతో పాటు, ప్రచార, సమన్వయ బాధ్యతలు తీసుకోవాలి'అని కేటీఆర్ స్పష్టం చేశారు. తమకు ఎంఐఎంతో గతంలో కూడా ఎలాంటి పొత్తుల్లేవని, 42 శాతం జనాభా పట్టణాల్లోనే ఉన్నందున ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. సామాజిక మాధ్యమాలు, ఇతర మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు.

### ప్రభుత్వ పనితీరే అస్త్రం!

'తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వానికి మద్దతు పలుకుతున్నారు. 2014లో 63 అసెంబ్లీ స్థానాలు గెలుపొందగా, 2018లో 88 స్థానాలతో పాటు, ఆ తర్వాత జరిగిన హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలోనూ విజయం సాధించాం. అయినా ప్రజలు కోరుకున్న మౌలిక సదుపాయాల కల్పన, సేవలపై దృష్టి పెట్టాం. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించి విధుల పట్ల నిర్లక్ష్యం చూపే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు, గ్రామ పంచాయతీలకు నెలా రూ.339 కోట్లు ఇస్తున్నాం. గతంలో 73 మున్సిపాలిటీలు ఉండగా, ప్రస్తుతం 141 మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. పల్లె ప్రగతి తరహాలో పట్టణ ప్రగతి కోరుకుంటున్నారు. కొత్త పాలకవర్గాలు ఏర్పాటైన తర్వాత నిధులు ఇచ్చి పట్టణాలను బాగు చేస్తాం. ప్రభుత్వ పనితీరే మాకు పెద్ద అస్త్రం. 60 లక్షల మంది పార్టీ కార్యకర్తల ద్వారా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తాం. 21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేలా టీఎస్ఐపాస్ తరహాలో టీఎస్‌బీపాస్ విధానం అమల్లోకి తెస్తాం'అని కేటీఆర్ వివరించారు.

### సీఏఏపై మా వైఖరి ప్రకటించాం

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై తమ పార్టీ అభిప్రాయాన్ని పార్లమెంటులో వినిపించామని కేటీఆర్ తెలిపారు. ముస్లింలు అనే పదాన్ని తొలగించాలని కోరినా స్పందన లేకపోవడంతో విప్ జారీ చేసి వ్యతిరేకంగా ఓటేసినట్లు గుర్తుచేశారు. ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లపై ప్రభుత్వపరంగా సీఎం కేసీఆర్ కేబినెట్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. సమావేశంలో మంత్రులు సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు మాలోతు కవిత, బడుగుల లింగయ్యయాదవ్, ప్రకాశ్‌ముదిరాజ్, రాములు పాల్గొన్నారు.

**జనవరి 2న కేసీఆర్ కీలక సమావేశం**

మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ యంత్రాంగం సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, సమన్వయం తదితరాలకు సంబంధించి జనవరి 2న పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన టీఆర్‌ఎస్ కీలక సమావేశం జరగనుంది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొంటారని సమాచారం. కాగా, ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని నేతలకు కేటీఆర్ సూచించారు. మున్సిపాలిటీల వారీగా పార్టీ పరిస్థితి, నేతల పనితీరు, ఎమ్మెల్యేలకు, స్థానిక నేతలకు మధ్య సమన్వయం, ఇతర పార్టీల బలాబలాలు తదితరాలకు సంబంధించి డిసెంబర్ 31లోగా మరోసారి నివేదిక ఇవ్వాల్సిందిగా కేటీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. 'కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు. గతేడాది ఆయనపై గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రస్తుతం టీఆర్‌ఎస్‌లో ఉన్నారు. అదే తరహాలో తాండూరులోనూ మాజీ మంత్రి మహేందర్‌రెడ్డిపై గెలుపొందిన రోహిత్‌రెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఇలాంటి చోట ఇద్దరు నేతల నడుమ సమన్వయంతో పాటు, గెలుపును ప్రాతిపదికగా తీసుకుని అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరగాలి'అని కేటీఆర్ ఇన్‌చార్జులకు సూచించినట్లు తెలిసింది. ఇతర పార్టీల్లో ఉండే బలమైన అభ్యర్థులతో పాటు, తటస్థులను కూడా పార్టీలో చేర్చుకోవడంపై దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు.



.. ప్రతిపక్షాల సంగతి తనకు వదిలేయమంటున్నార్సార్ ఆర్మీ చీఫ్ రావత్!

# పకడ్బందీగా మొబైల్ ఫిష్ ఔట్‌లెట్‌లు

**మత్స్య శాఖ అధికారులకు మంత్రి తలసాని సూచన**


మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నమూనాను మంత్రికి చూపిస్తున్న కమిషనర్ సువర్ణ

**సాక్షి, హైదరాబాద్:** మొబైల్ ఫిష్ ఔట్‌లెట్‌లలో అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ఔట్‌లెట్‌లను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలోని తన చాంబర్‌లో మత్స్యశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నమూనాను మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ.. మంత్రికి అందజేసి వివరించారు. ఉదయం పూట చేపల విక్రయంతో పాటు సాయంత్రం సమయంలో చేప వంటకాలు విక్రయించుకునేలా ఔట్‌లెట్‌లలో ఫ్రిజ్, ఐస్‌బాక్స్, ఫిష్ కటింగ్ టేబుల్, చేపల వంటకాల కోసం స్టౌ లాంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ ఔట్‌లెట్‌లను మల్టీపర్పస్ విధానంలో డిజైన్ చేయాలని, లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

**శుక్రవారం 11,164 మెగావాట్లకు చేరుకున్న వినియోగం**



**సాక్షి, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తొలిసారి విద్యుత్ డిమాండ్ రికార్డులను నమోదు చేసింది. శుక్రవారం ఉదయం 8.11 గంటల సమయంలో 11,164 మెగావాట్లుగా డిమాండ్ రికార్డైంది. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ ఇదే. రబీ నాట్లు ఊపందుకోవడం, ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ అవసరం పెరిగిపోవడంతో వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. గతేడాది ఇదే సమయానికి 8,659 మెగావాట్ల వినియోగం ఉండగా, శుక్రవారం 11,164 మెగావాట్లకు చేరింది. మూడు వారాలుగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల్లో నీటిని ఎత్తిపోస్తున్నారు. ఫిబ్రవరి–మార్చిలో విద్యుత్ వినియోగం 13 వేల మెగావాట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా గృహ వినియోగం పెరిగింది. విద్యుత్ డిమాండ్ తీర్చడానికి 1,076 మెగావాట్ల కరెంట్‌ను తెలంగాణ విద్యుత్ సంస్థలు బయట నుంచి కొనుగోలు చేశాయి.

**అధిక విద్యుత్ వినియోగం వివరాలు**

| తేదీ | మెగావాట్లు |
|---|---|
| 21-08-2018 | 10,818 |
| 27-12-2019 | 11,164 |

# రైతు సంతకంతోనే.. రుణమాఫీకి కొత్త ప్రతిపాదన

- తనకు అప్పుందని రైతు ధ్రువీకరించాల్సిందే
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదన
- రుణమాఫీ అమలులో కొత్త విధానంపై వ్యవసాయశాఖ, బ్యాంకర్ల చర్చలు
- గతంలో అమలు తీరుపై కాగ్ అభ్యంతరం
- ఈ నేపథ్యంలోనే తెరపైకి కొత్త ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్

రైతు రుణమాఫీపై కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. రైతులు తమ సంతకంతో స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తేనే రుణమాఫీ అమలు చేయాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. బ్యాంకుల వద్ద ఉన్న రైతు రుణాలు, వడ్డీ సమాచారంతో ఆ ధ్రువీకరణ పత్రం ఉండాలని అధికారులు అంటున్నారు. ఒకవేళ అలా లేకుంటే ఆయా రైతులకు రుణమాఫీ అమలు చేయడం కుదరదని చెబుతున్నారు. గతంలో రుణమాఫీ అమలు చేసినప్పుడు పారదర్శకతపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అభ్యంతరాలు వ్యక్తం చేసినందున ఈసారి రైతు స్వీయ ధ్రువీకరణ చేయాలని ఆలోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లేకుంటే గ్రామ సభలు పెట్టి అర్హులైన రైతుల సంఖ్య తేల్చాలన్న నిబంధనను కూడా తెరపైకి తెస్తున్నారు. 2014లో రుణమాఫీ అమలు సమయంలో అర్హులైన రైతుల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించినా కొందరు అర్హులకు రుణమాఫీ జరగలేదన్న విమర్శలు వచ్చాయి. రుణమాఫీ అందని కొందరు రైతులు ఉన్నతస్థాయి వరకు వెళ్లి పోరాడారు. అలాగే ఆడిట్ అభ్యంతరాలు కూడా వ్యక్తమయ్యాయి. రుణమాఫీ పొందిన వారంతా రైతులనే గ్యారంటీ ఏమిటంటూ కాగ్ ప్రశ్నించింది. గ్రామాల్లో జాబితాలు ప్రదర్శించామని వ్యవసాయశాఖ ఇచ్చిన వివరణతో కాగ్ ఏమాత్రం సంతృప్తి చెందలేదని అధికారులు అంటున్నారు. గ్రామ సభలు ఎందుకు నిర్వహించలేదని, రుణమాఫీ లబ్ధిదారులంతా రైతులేనని ఎవరు ధ్రువీకరించారని కాగ్ నిలదీసింది. ఈ నేపథ్యంలోనే రైతుల స్వీయ ధ్రువీకరణ అంశాన్ని వ్యవసాయశాఖ తెరపైకి తీసుకొచ్చింది. దీనివల్ల ఎక్కడైనా అక్రమాలు జరిగితే అప్పుడు రైతునే బాధ్యుడిని చేసే అవకాశముందని అంటున్నారు. దీనిపై ఇప్పుడు ప్రభుత్వంలో చర్చ జరుగుతోంది.

**మాఫీ సొమ్ము నేరుగా మాకే బదిలీ చేయాలి...**

రుణమాఫీపై బ్యాంకర్లు, అధికారులకు మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంత మంది రైతులకు రుణమాఫీ చేయాలి? ఎంత చేయాలి? వడ్డీ వివరాలు ఎలా అమలు చేయాలన్న దానిపై స్పష్టత ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం బ్యాంకర్లను కోరింది. అధికార టీఆర్‌ఎస్ రూ. లక్ష లోపు రైతు రుణమాఫీ అమలుకు గతేడాది డిసెంబర్ 11ను కట్ ఆఫ్ తేదీగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అంటే అప్పటి వరకు రైతులు తీసుకున్న సొమ్ములో రూ. లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని సర్కారు ప్రకటించింది. అంటే ఏడాదిగా అనేక మంది రైతుల బకాయిలకు వడ్డీ కూడా తోడు కానుంది. దీనిపై ఏం చేయాలన్న దానిపైనా చర్చ జరుగుతోంది. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. లక్ష రుణమాఫీ ప్రకటించి అమలు చేసింది. అప్పుడు 35.29 లక్షల మంది రైతులకు రూ. 16,138 కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఆ సొమ్మును ప్రభుత్వం నాలుగు విడతలుగా నాలుగు బడ్జెట్లలో నిధులు కేటాయించి మాఫీ చేసింది. ఈసారి రుణమాఫీ సొమ్ము మరింత పెరిగే అవకాశముందని అంటున్నారు. వ్యవసాయ వర్గాల సమాచారం ప్రకారం రూ. 26 వేల కోట్ల నుంచి రూ. 36 వేల కోట్ల వరకు ఉండొచ్చని అంటున్నారు. రుణమాఫీ సొమ్మును నేరుగా రైతులకే ఇస్తామని స్వయానా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించగా బ్యాంకర్లు మాత్రం అలా చేయవద్దని, గతంలోలాగా తమకే అందజేయాలని కోరుతున్నారు. ఎలక్ట్రానిక్ కార్డుల పద్ధతి లేదా రైతుబంధు నిధులను నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లోకి వేసినట్లుగా ఏదో ఒక పద్ధతిలో రుణమాఫీ సొమ్మును జమ చేస్తామని అధికారులు చెబుతుండగా అలా చేస్తే రైతులు బకాయిలు చెల్లించరని బ్యాంకర్లు అంటున్నారు. రైతులు ఇతర బ్యాంకు ఖాతాలు చూపించి వాటిల్లో జమ చేసుకునే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

**బంగారంపై తీసుకున్న రుణాలపై తర్జనభర్జన...**

రైతులు బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న పంట రుణాల మాఫీపై తర్జనభర్జన జరుగుతోంది. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి బంగారంపై తీసుకున్న రుణాలను పంట రుణాలుగా పరిగణించబోమని రిజర్వు బ్యాంకు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బంగారంపై తీసుకున్న పంట రుణాలకు మాఫీ వర్తింపజేయాలా వద్దా? అనే చర్చ జరుగుతోంది. దీనిపై బ్యాంకర్ల మధ్యే భిన్నాభిప్రాయాలున్నాయి. ఆర్‌బీఐ నిబంధన ప్రకారం మాఫీ చేయొద్దని కొందరు అంటుంటే మాఫీ చేయాలని మరికొందరు అంటున్నారు. ఆ ప్రకారం బ్యాంకర్లు వేర్వేరుగా జాబితాలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం 5.56 లక్షల మంది రైతులు బంగారం తాకట్టు పెట్టి రూ. 5,253 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు. ఈ బకాయిలు మాఫీ చేస్తారా లేదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. 2014లో రుణమాఫీ చేసినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో బంగారంపై తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసి పట్టణాల్లో గోల్డు లోన్లు తీసుకున్న రైతులకు మాఫీ చేయలేదు.

**కుటుంబమే యూనిట్‌గా?**

2014లో రుణమాఫీ చేసినప్పుడు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని రుణమాఫీ చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలు ఉంటే తల్లిదండ్రులతో కలిపి ఒక కుటుంబంగా పరిగణించారు. అంతకుమించి వయసుంటే మరో కుటుంబంగా గుర్తించారు. ఇప్పుడెలాంటి నిర్ణయం తీసుకుంటారనేది స్పష్టత లేదు. ఈసారి కూడా కుటుంబం యూనిట్‌గానే రుణమాఫీ చేస్తారని అంటున్నారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటే సర్కారు ఆర్థిక భారం తగ్గుతుంది. దీనిపై పెద్దగా అభ్యంతరాలు లేవు. కుటుంబమే యూనిట్‌గా రుణమాఫీ జరగవచ్చని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి.




# 'మిలియన్ మార్చ్'కు లభించని అనుమతి

- సీఏఏ, ఎన్ఆర్‌సీల వ్యతిరేక ర్యాలీకి ఉత్తర్వులివ్వని హైకోర్టు
- సీఏఏ, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లు
- మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరణ
- అనుబంధ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచన

**సాక్షి, హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ)లకు వ్యతిరేకంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించాలని భావించిన మిలియన్ మార్చ్‌కు అనుమతిచ్చేలా పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఈ నెల 28న శనివారం నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించి, సమావేశం జరుపుకొనేందుకు అనుమతి ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే పోలీసులు అనుమతి నిరాకరించారని, దీన్ని పిటిషన్‌లో సవాల్ చేయలేదని తప్పుపట్టింది. ఆవిధంగా పిటిషన్‌ను సవరించి అనుబంధ రిట్ వేసుకోవచ్చని సూచించింది. ప్రధాన రిట్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. ఈ మేరకు శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మిలియన్ మార్చ్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఈ నెల 21న సెంట్రల్ జోన్ డీసీపీకి దరఖాస్తు చేసుకుంటే ఏ నిర్ణయాన్నీ వెల్లడించలేదని, మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇచ్చేలా పోలీసులకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఎన్ఆర్‌సీ, సీఏఏ తెలుగు రాష్ట్రాల జేఏసీ కన్వీనర్ మహ్మద్ మాలిక్ హైకోర్టులో రిట్ వేశారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. మిలియన్ మార్చ్ దరఖాస్తును పోలీసులు తిరస్కరించడాన్ని రిట్‌లో సవాల్ చేయలేదని చెప్పారు. కాగా, మిలియన్ మార్చ్‌కు అనుమతి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఖలీలుల్లా హుస్సేనీ మెమోరియల్ ఫౌండేషన్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ అజీమ్ శుక్రవారం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌లోనూ న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్ ఉత్తర్వుల జారీకి నిరాకరించారు. పిటిషనర్ పేర్కొన్న సంస్థ మిలియన్ మార్చ్‌కు దరఖాస్తు చేసుకోలేదని హైకోర్టు పేర్కొంది. మాలిక్ దరఖాస్తుపై పోలీసులు ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా అజీమ్ హైకోర్టును ఎలా ఆశ్రయిస్తారంటూ వీరి రిట్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది.



## ర్యాలీకి నిరాకరిస్తే 'సత్యాగ్రహ దీక్ష'

**సాక్షి, హైదరాబాద్:** 'సేవ్ ఇండియా–సేవ్ కాన్‌స్టిట్యూషన్'పేరుతో ఎన్నార్సీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన నిరసన ర్యాలీని కొనసాగించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ ర్యాలీకి పోలీసులు అనుమతినివ్వకపోయినా శాంతియుతంగా ర్యాలీ చేయాలని శుక్రవారం గాంధీ భవన్‌లో కుంతియా, ఉత్తమ్‌ల సమక్షంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ 135వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించాలని ఏఐసీసీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ర్యాలీకి వెళ్లాలని, పోలీసులు అడ్డుకుంటే నిరసిస్తూ గాంధీ భవన్‌లోనే 'సత్యాగ్రహ దీక్ష' చేపట్టాలని నిర్ణయించారు. కాగా, పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ గాంధీ భవన్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

## యాదవ, కురుమ భవనాలను సకాలంలో పూర్తి చేయాలి: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ శివారులోని కోకాపేటలో ప్రభుత్వం చేపట్టిన యాదవ, కురుమ సంక్షేమ భవనాల నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఇతర సంక్షేమ భవనాల నిర్మాణానికి ఇవి ఆదర్శం కావాలని, విద్యను అభ్యసించేందుకు వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే యాదవ, కురుమ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. సమీక్షలో భాగంగా భవనాల నిర్మాణ నమూనాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చీఫ్ ఇంజనీర్ మల్లేశ్, ఎస్‌ఈ నందకుమార్, ఈఈ శైలేందర్ తదితరులు ఉన్నారు.

## తాటి, అనుబంధ ఉత్పత్తులపై అధ్యయన కేంద్రం: శ్రీనివాస్‌గౌడ్



**సాక్షి, హైదరాబాద్:** హార్టికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో తాటి, దాని అనుబంధ ఉత్పత్తుల అధ్యయన సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. నీరాను రాష్ట్రంలో వీలైనంత త్వరలో తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించి ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని సూచించారు. శుక్రవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నీరా ప్రాజెక్టు, గీత కార్మికుల సమస్యలపై, గుర్తింపు కార్డుల పంపిణీ, ఎక్స్‌గ్రేషియా అమలుపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్ గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మక నీరా పాలసీని ప్రకటించారన్నారు. నీరాను హైదరాబాద్‌తో పాటు త్వరలోనే జిల్లా కేంద్రాలకు విస్తరించే విధంగా ప్రణాళికలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాజమండ్రిలోని వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో నీరా అధ్యయన కమిటీ స్టడీ టూర్‌లో అధ్యయనం చేసిన వివరాలను గీత కార్మికుల సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలోక్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశంగౌడ్‌లతో పాటు ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్, స్పోర్ట్స్ ఎండీ దినకర్ బాబు, ఆబ్కారీశాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, టూరిజం ఎండీ మనోహర్, ఆబ్కారీశాఖ అధికారులు అజయ్‌రావు, హరికిషన్, దత్తరాజ్, చంద్రయ్య, రవీందర్ కుమార్, అరుణ్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర గీత వృత్తిదారుల సహకార సొసైటీ ఆలోక్ కుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లోకి పీఎం-కిసాన్ నిధులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం–కిసాన్)కి సంబంధించిన నిధులు విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఇప్పటికే మూడు విడతల్లో జమ కాగా, తాజాగా నాలుగో విడత నిధులు రైతుల ఖాతాలకు చేరుతున్నాయి. తాజాగా విడుదల చేసిన వాటితో కలిపి ఇప్పటివరకు నాలుగు విడతల్లో రాష్ట్రానికి రూ. 2,444 కోట్లు విడుదలయ్యాయి. ప్రస్తుత నాలుగో విడతలో 22 లక్షల మంది రైతులకు రూ. 2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మొదటి విడతలో గత డిసెంబర్ నుంచి మార్చి వరకు 34.63 లక్షల మంది రైతులకు రూ. 693 కోట్లు కేంద్రం అందించింది. రెండో విడతలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు 34.03 లక్షల మంది రైతులకు రూ. 681 కోట్ల నిధులు అందజేసింది. మూడో విడతలో ఈ ఏడాది ఆగస్ట్ నుంచి నవంబర్ నాటికి 31.16 లక్షల మంది రైతులకు రూ. 623 కోట్లు అందాయి. కేంద్రం తాజాగా నాలుగో విడతలో 22.36 లక్షల మందికి రూ. 447 కోట్ల నిధులు విడుదల చేసింది. వీటిని రైతుల ఖాతాల్లో వేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. తాజాగా విడుదలైన నిధులు ప్రస్తుత డిసెంబర్ నుంచి మార్చి వరకు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ ఇంజనీర్ కార్యాలయం, PIU డివిజన్, వికారాబాద్
టెండరు ప్రకటన
NIT No.:T2/73 to 82/2019-20 తేది: 23.12.2019
పనుల సంఖ్య: (10), పనుల పేర్లు: సంగంకలాన్, కరన్‌కోటె, పర్వతాపూర్, గౌతాపూర్, కోటెబాస్పల్లి, అంతారం, గుంటబాస్పల్లి, బిజ్వార్, చందరవంచ, ఖాంజాపూర్ గ్రామాలలో దహనవాటికల నిర్మాణం కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 1.00 కోటి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను 27.12.2019 నుండి పొందవచ్చును మరియు చివరి తేది 04.01.2020. తదుపరి వివరాలను కార్యాలయం నుండి పొందవచ్చును. ఇ-మెయిల్ ఐడి: ee_pri_vkb@telangana.gov.in
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, PIU డివిజన్, వికారాబాద్
DIPR RO.No.2074-DP/CL/Advt/1/2019-20, Dt: 27.12.2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
డిస్ట్రిక్ట్ పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం, (PIU): మంచిర్యాల
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. DPRE-MNCL/1 TO 68/2019-20 తేది: 18.12.2019
పనుల సంఖ్య (68), పనుల పేరు: HP గ్యాస్ గోడౌన్ నుండి CC రోడ్డు నిర్మాణం, BC కాలనీ బిట్ 1 & 2 లో CC రోడ్డు వేయుట, రోడ్డు ఫార్మేషన్ & మెటలింగ్, 2BHK ఇళ్ళు 08 నం.లు నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV రూ. 21.17 కోట్లు, బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది, సమయం మరియు ముగింపు తేది, సమయం: 31.12.2019న మ. 3.00 గం॥ నుండి 06.01.2020న మ. 3.00 గం॥ వరకు, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది, సమయం: 06.01.2020న మ. 3.30 గం॥, ధర బిడ్ తెరుచు తేది, సమయం: 06.01.2020న సా. 5.00 గం॥. తదుపరి వివరాలను దిగువ తెలిపిన వెబ్‌సైట్ https://tender.telangana.gov.in/ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఫోన్ నం. 9246894930.
సం/- డిస్ట్రిక్ట్ పంచాయతీరాజ్ ఇంజనీర్, PIU మంచిర్యాల
DIPR Ro.No. 2073-DP/CL/ADVT/1/2019-20, Dt : 27/12/2019

MSME Skill India
ఔత్సాహిక యువత కోసం
భారత ప్రభుత్వం MSME మంత్రిత్వ శాఖ, ATI పథకం క్రింద స్పాన్సర్ చేసిన
ఉచిత శిక్షణా కోర్సులు
❖ యానిమేషన్ ❖ లైనక్స్ అడ్మినిస్ట్రేషన్
❖ గ్రాఫిక్ డిజైనర్ ❖ అకౌంట్ ఎగ్జిక్యూటివ్ (Tally)
❖ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ❖ ఫొటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ
❖ ఐటీ హార్డ్‌వేర్ ❖ బ్యూటీషియన్
❖ టూల్ డిజైనింగ్ CAD / CAM Pro-E ❖ ఫుడ్ ప్రాసెసింగ్
అర్హత : పదవ తరగతి, ఇంటర్, గ్రాడ్యుయేషన్
పత్రాలు : విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, 3 ఫోటోలు
వయస్సు : 18 - 40 సంవత్సరాలు.
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ni-msme)
(భారత ప్రభుత్వ MSME మంత్రిత్వ శాఖ యొక్క సంస్థ)
యూసఫ్ గూడ, హైదరాబాద్ - 500045
సంప్రదించండి :040-23633244, 211, 9121336262, 9121336565

# రాష్ట్రంలో 'కల్వకుంట్ల పోలీస్'

- గుర్రాలు, కర్రలతో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ ర్యాలీకి అనుమతిస్తారు
- మేం జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తామంటే అనుమతివ్వరా?
- కేసీఆర్ ఏం చెప్తే పోలీసులు అదే చేస్తున్నారు..: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్
- కోడ్ అమల్లో ఉంటే ఎంఐఎం సభకు ఎలా అనుమతించారు: వీహెచ్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇండియన్ పోలీస్ సర్వీస్ పనిచేయడం లేదని, కల్వకుంట్ల పోలీస్ సర్వీస్ పనిచేస్తోందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ ఏది చెబితే దాన్ని మాత్రమే రాష్ట్రంలోని పోలీసులు అమలు పరుస్తున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, హైదరాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్‌లతో కలసి ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ తాము నిర్వహించనున్న ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం విచిత్రంగా ఉందన్నారు.

### సీఎం సమాధానమివ్వాలి..

తాము ర్యాలీకి అనుమతి అడిగితే శాంతి భద్రతల గురించి చెబుతున్నారని, రెండ్రోజుల క్రితం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నుంచి సరూర్‌నగర్ వరకు ఒక భయంకర వాతావరణంలో, గుర్రాలపై కర్రలు పట్టుకుని నిర్వహించిన కవాతుకు ఎలా అనుమతించారని ఉత్తమ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భాగవత్ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న 130 కోట్ల మంది ప్రజలూ హిందువులేనని రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని, అయినా ఆ సభకు పోలీసులు బందోబస్తు నిర్వహించారని చెప్పారు. దీన్నిబట్టి ఆర్ఎస్ఎస్ లాంటి మత సంస్థలకు సీఎం కేసీఆర్ సహాయ, సహకారాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. తాము జాతీయ జెండాలు పట్టుకుని 'సేవ్ ఇండియా–సేవ్ కానిస్టిట్యూషన్' పేరుతో శాంతియుతంగా ర్యాలీ తీస్తామంటే అనుమతి ఇవ్వకపోవడం దారుణమని, దీనికి సీఎం కేసీఆర్ జవాబివ్వాలని డిమాండ్ చేశారు.

### శాంతియుతంగా ర్యాలీ తీసి తీరుతాం: వీహెచ్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే నిజామాబాద్‌లో ఎంఐఎం సభకు ఎలా అనుమతి ఇచ్చారని వీహెచ్ ప్రశ్నించారు. కేసీఆర్ లోపాయికారిగా ఆర్ఎస్ఎస్‌తో అవగాహన పెట్టుకున్నారని, ఎంఐఎంతో కూడా అదే ధోరణితో వెళ్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు పెట్టినా తాము శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో భాగంగా ఆర్ఎస్ఎస్ ర్యాలీ నిర్వహించిన తీరుతో కూడిన వీడియో క్లిప్పింగ్‌లను ప్రదర్శించారు.

### డీజీపీకి మరోమారు విజ్ఞప్తి..

కాంగ్రెస్ శనివారం నిర్వహించ తలపెట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆ పార్టీ నేతలు డీజీపీ మహేందర్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. తాము ఎలాంటి నినాదాలు చేయకుండా, మౌనంగా ర్యాలీ చేస్తామని, తాము అడిగిన రూట్‌లో కాకపోయినా ఇతర రూట్లలో అయినా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం దాకా ర్యాలీకి అనుమతినివ్వాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కలు డీజీపీని మరోమారు లేఖలో కోరారు.



శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న లక్ష్మణ్, పక్కన రాజాసింగ్

# మజ్లిస్ మత రాజకీయాలకు కేసీఆర్ వత్తాసు

- సీఏఏ భారత ముస్లింలకు వ్యతిరేకమని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తాం
- లేదంటే మీరు ఆ పని చేస్తారా.. కేసీఆర్, ఒవైసీలకు లక్ష్మణ్ సవాల్
- టీఆర్ఎస్, మజ్లిస్, కాంగ్రెస్ కలసి అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి
- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 30న సభలు, ర్యాలీలు..

**సాక్షి, హైదరాబాద్:** మజ్లిస్ మత రాజకీయాలకు సీఎం కేసీఆర్ వత్తాసు పలుకుతున్నారని, దేశహితం కోసం తీసుకున్న నిర్ణయాలకు మతం రంగు పులుముతారా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. దేశహితాన్ని కాంక్షిస్తారో లేక దేశద్రోహం తలపెడతారో సీఎం కేసీఆర్ తేల్చుకోవాలని స్పష్టంచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పౌరసత్వ సవరణ చట్టాని (సీఏఏ)కి వ్యతిరేకంగా నిజామాబాద్‌లో నిర్వహించనున్న ఒవైసీ సభకు కేసీఆర్ మద్దతు తెలుపడాన్ని, టీఆర్ఎస్ ప్రతినిధిని పంపించడంతోపాటు కాంగ్రెస్, కమ్యూనిస్టులను కూడా ఆహ్వానించాలని కోరడాన్ని తప్పుబట్టారు.

### వాటిపై చర్చకు సిద్ధం

ప్రజలు, ప్రతిపక్షాలకే కాదు.. ఎమ్మెల్యేలు, మంత్రులకు కూడా సమయమివ్వని కేసీఆర్ మతోన్మాద రాజకీయాలు నెరిపే ఎంఐఎం అధినేత అసదుద్దీన్‌తో 3 గంటల పాటు సమావేశం కావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. సీఏఏపై కొన్ని పార్టీలు ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇప్పుడు తాజాగా నేషనల్ పాపులేషన్ రిజిస్టర్‌పై పెడబొబ్బలు పెడుతున్నాయన్నారు. ఎన్పీఆర్ మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, ఎవరికి వారే తమ సాధారణ విషయాలు నమోదు చేయొచ్చని కూడా చెప్పిందన్నారు. అయినా టీఆర్ఎస్, మజ్లిస్, కాంగ్రెస్ కలసి అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎన్పీఆర్ అమలు చేస్తే ముస్లింలంతా భారత పౌరసత్వాన్ని కోల్పోతారన్నట్లు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సీఏఏ భారత ముస్లింలకు వ్యతిరేకమని నిరూపిస్తే తాము ముక్కును నేలకు రాస్తామని, లేకపోతే కేసీఆర్, అసదుద్దీన్ ఒవైసీ కలసి చార్మినార్ సాక్షిగా ముక్కు నేలకు రాస్తారా? దీనిపై చర్చకు సిద్ధమేనా? అని ప్రశ్నించారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ చట్టాలపై చర్చించడానికి బీజేపీ సిద్ధంగా ఉందని, ఎవరిని పంపుతారో చర్చకు పంపాలన్నారు.

### తాత్కాలిక అశాంతిని సృష్టించడానికే..

ముస్లిం దేశాల్లోని మెజారిటీ వర్గమైన ముస్లింలకు భారత్‌లో పౌరసత్వం ఇస్తారా? ఇది మెడ మీద తలకాయ ఉన్నవాడు మాట్లాడే మాటలేనా? అని లక్ష్మణ్ మండిపడ్డారు. ముస్లింలలోనూ మోదీకి ఆదరణ పెరుగుతుంటే టీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ జీర్ణించుకోలేకపోతున్నాయని, ఆందోళనలను రెచ్చగొట్టి తాత్కాలిక అశాంతిని సృష్టించడానికి కుట్రలు చేస్తున్నాయన్నారు. సీఏఏపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, వారి కుట్రలను భగ్నం చేసేందుకు ఈ నెల 30న హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో సభలు, ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. తర్వాత మేధావులు, విద్యావంతులతో సదస్సులు నిర్వహించి కేసీఆర్, ఒవైసీ, కాంగ్రెస్, కమ్యూనిస్టుల నిజ స్వరూపాన్ని ప్రజల ముందు బయటపెడతామన్నారు. అనంతరం పట్టణాలు, గ్రామాల్లో ఇంటింటి కీ వెళ్లి సీఏఏపై ప్రజలను జాగృతం చేస్తామని లక్ష్మణ్ చెప్పారు.



శుక్రవారం శామీర్‌పేటలో ఆర్టీసీ ఉద్యోగులతో వనభోజనాల్లో మంత్రులు పువ్వాడ, మల్లారెడ్డి

# నంబర్‌వన్‌గా ఆర్టీసీ

- అభివృద్ధి చెందబోతోందన్న రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్
- శామీర్‌పేటలో వనభోజనాలు.. ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం
- మొబైల్ టాయిలెట్ బస్సులను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

**శామీర్‌పేట్:** తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే నంబర్ వన్ సంస్థగా అభివృద్ధి చెందబోతోందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలో కుషాయిగూడ ఆర్టీసీ డివిజన్ ఆధ్వర్యంలో వనభోజనాలు (ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డితో కలసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొంతకాలంగా ఆర్టీసీ కార్మికులకు, ప్రభుత్వానికి మధ్య చోటుచేసుకున్న ప్రతిష్టంభనను పక్కనబెట్టి ఆర్టీసీ అభివృద్ధి దిశగా కార్మికులు కృషి చేయాలని మంత్రి పువ్వాడ అన్నారు. సీఎం కేసీఆర్ ఆకాంక్ష కూడా అదేనని చెప్పారు. ఆర్టీసీకి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, కొన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వంపైన బురద జల్లేందుకే కార్మికులను రెచ్చగొట్టి ఆర్టీసీని భ్రష్టు పట్టించేందుకు ప్రయత్నించాయని ఆరోపించారు. ఆర్టీసీలో విధులు నిర్వహించే 50 వేల మందికి లబ్ధి చేకూరేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్మికులందరూ కృషి చేసి సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలని సూచించారు.

### బస్సుల్లో ప్రయాణించాలని లేఖలు..

స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి పరిధిలో ఉన్న డిపోలోని బస్సుల్లో ప్రయాణించి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి పువ్వాడ అన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు లేఖలు రాసినట్లు చెప్పారు. అలాగే మహిళా కండక్టర్‌లు పగటిపూట మాత్రమే విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మహిళా కండక్టర్లకు ప్రత్యేక (మెరూన్ కలర్) యాప్రాన్‌ను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఉత్సాహంతో కార్మికులు విధులు నిర్వహించి ఏడాదిలోపు బోనస్‌లు అందుకునేలా కృషి చేయాలని కోరారు. త్వరలోనే కార్గో బస్సు సర్వీసులు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు.

### చరిత్రలో నిలుస్తుంది: మంత్రి మల్లారెడ్డి

ఆర్టీసీ కార్మికులు ధర్నాలు నిర్వహించినా, సుదీర్ఘ సమ్మె చేసినా సీఎం కేసీఆర్ ఎంతో ఉదాత్తంగా వ్యవహరించారని, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. ధర్నా చేసినపుడు కార్మికులు పడిన కష్టం ప్రభుత్వానికి తెలుసని అన్నారు. ఉద్యమ స్థాయిలో పనిచేసి నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలని కోరారు. అనంతరం మొబైల్ బయో టాయిలెట్ బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ పాల్గొన్నారు.

### జేబీఎస్‌లో మంత్రులు..

**మారేడుపల్లి:** ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముందు సికింద్రాబాద్ జేబీఎస్ బస్టాండ్‌ను ఇరువురు మంత్రులు సందర్శించారు. నూతనంగా ప్రవేశపెట్టబోతున్న ఆర్టీసీ కార్గో బస్సు, సంచార బయోటాయిలెట్ బస్సులను పరిశీలించారు. అనంతరం వారు వనభోజనానికి బస్సులో బయలుదేరి వెళ్లారు.

## 34% రిజర్వేషన్లు కొనసాగించాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు బీసీ విద్యార్థి సంఘం విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** సుప్రీంకోర్టు తీర్పు సాకుతో బీసీల రిజర్వేషన్లను కుదించే ప్రయత్నం చేయకుండా మున్సిపల్ ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను కొనసాగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు బీసీ విద్యార్థి సంఘం విజ్ఞప్తి చేసింది. 2013 మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలని కోరింది. రిజర్వేషన్లు ప్రకటించకుండానే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంది. శుక్రవారం ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డితోపాటు ఎస్‌ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్‌కు సంఘం ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్, టి.విక్రమ్‌గౌడ్, వి.మధు, జి.భాస్కర్‌లతో కూడిన ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది.

## 'దిశ' నిందితుడి తండ్రికి రోడ్డుప్రమాదంలో గాయాలు

**సోమాజిగూడ:** దిశ కేసులో ఎన్‌కౌంటర్‌కు గురైన నిందితుడు చెన్నకేశవులు తండ్రి చింతకుంట కుర్మన్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆయనను పోలీసులు నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వివరాలు.. నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం గుడిగండ్లకు చెందిన కుర్మన్న గురువారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా జక్లేర్ గ్రామం సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న ఇన్నోవా వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కుర్మన్న తలకు, కాలుకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం పోలీసులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రమాదం కారణంగా కుర్మన్న తలలో రక్తం గడ్డ కట్టడంతో అత్యవసర చికిత్సా విభాగం న్యూరో సర్జరీ వైద్యులు ఆయనకు చికిత్స నిర్వహించారు.

## ఏ ఆధారాల్లేవు.. ఉన్నది కక్ష సాధింపే

### వరవరరావు, ఇతర మేధావులను తక్షణం విడుదల చేయాలి: విరసం

**సాక్షి, హైదరాబాద్:** విప్లవ రచయితల సంఘం (విరసం) వ్యవస్థాపక సభ్యుడు వరవరరావుతో సహా తొమ్మిది మంది మేధావులపై కుట్ర కేసు పెట్టి ఏ ఆధారాలు లేకున్నా చట్ట వ్యతిరేకంగా ఏడాదికి పైగా ఎరవాడ జైల్లో నిర్బంధించిన పుణే పోలీసులు ఇప్పుడు మరో డ్రామాకు తెర తీస్తున్నారని విరసం ఒక ప్రకటనలో ఆరోపించింది. బెయిల్ వాదనలు వినడానికే సంవత్సర కాలం తీసుకున్నారంటే వీలైనంత ఎక్కువ కాలం ప్రజా మేధావులను జైల్లో పెట్టాలనే వ్యూహమే ఇందుకు కారణమని విరసం కార్యదర్శి పాణి అభిప్రాయపడ్డారు. ఎల్గార్ పరిషత్ కేసు దగ్గరి నుంచి ప్రధాని హత్యకు కుట్ర జరిగిందనే ఆరోపణ దాకా ఏ ఒక్క దానికీ ఒక్క ఆధారం కాదు కదా కనీస హేతుబద్ధత కూడా లేదన్నారు. ఇంతకాలం పరిశోధన జరిపి ఇప్పుడు వరవరరావు ఇంట్లోంచి స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్క్ నుంచి సమాచారం రాబట్టలేకపోయామని దాన్ని అమెరికాకు పంపిస్తున్నామంటున్నారని విమర్శించారు. దేశంలోని నాలుగు ఫోరెన్సిక్ పరిశోధన కేంద్రాలకు పంపినా ఎలాంటి డేటా రాబట్టలేకపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు అమెరికా ఎఫ్‌బీఐ సహకారం తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయని, పోలీసులు రాసిన మావోయిస్టు లేఖల్లాంటివి సృష్టిస్తే తప్ప లేనిది ఉన్నట్లు చూపడం ఏ ప్రయోగశాలకూ సాధ్యం కాదని ఆయన ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షమైన ఎన్సీపీ కోరుతున్నట్లుగా ఈ తప్పుడు కేసులపై వెంటనే సిట్ ఏర్పాటు చేయాలని, బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని విరసం డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

# ఎన్నార్సీకి ఒప్పుకునేది లేదు

- సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- ఇప్పటికే 14 మంది సీఎంలు వ్యతిరేకం
- సీఐఐ,ఎన్ఆర్సీ,ఎన్పీఆర్ ఇంటర్‌లింక్ అంశాలు
- సీపీఐ(మార్క్సిస్ట్) పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరి



శుక్రవారం సమావేశంలో మట్లాడుతున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

**రాయదుర్గం/యాకుత్‌పురా:** ఎన్నార్సీ, ఎన్పీఆర్, సీఏఏలకు వ్యతిరేకంగా విద్యార్థులతోపాటు సమాజంలోని అందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం స్టూడెంట్స్ యూనియన్ 2019–20 ఆధ్వర్యంలో 'ఎన్నార్సీ, సీఏఏ, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు'అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఏఏ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని లౌకికత్వ పునాదుల మీద ఏర్పడిన దేశం మనదని పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాలకు సమాన హక్కులుంటాయని, ఒక వర్గాన్ని లక్ష్యం చేసుకుంటూ నిర్ణయాలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అస్సోంలో ఎన్నార్సీకి తమకు అభ్యంతరం లేదని, దేశవ్యాప్తంగా దాన్ని అమలు చేయాలని చూస్తే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. దేశంలోని 14 రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు అనేక రాజకీయ పార్టీలు కూడా ఎన్నార్సీకి వ్యతిరేకమని ఆయన వివరించారు. భవిష్యత్తులో మరింత మద్దతు పెరిగే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్ ఒకదానితో మరొకటి సంబంధం ఉన్న అంశాలని పేర్కొన్నారు.

### ఎన్పీఆర్‌ను సీఎం కేసీఆర్ వ్యతిరేకించాలి

దేశంలోని పౌరుల మధ్య కేంద్రం మత విద్వేషాలు రేపేందుకు ప్రయత్నిస్తుందని, ఎన్పీఆర్ బిల్లును తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకించాలని సీతారాం ఏచూరి కోరారు. సీఏఏ, ఎన్నార్సీ బిల్లులను వ్యతిరేకిస్తూ ఢిల్లీ బెనారస్ యూనివర్సిటీలో విద్యార్థులు చేపట్టిన నిరసనపై దాడులు జరపడం శోచనీయమన్నారు. రోజు రోజుకు దేశంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఓవైపు దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రమై అనేక మంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతుంటే కేంద్రం మాత్రం లౌకిక దేశాన్ని హిందూత్వ దేశంగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. సమావేశంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, దళిత నాయకులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, మాజీ ఎమ్మెల్సీ సీహెచ్.సీతారాములు, సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు డి.జి.నర్సింహారావు, ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లా ఖాన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలీ మస్కతీ, సీపీఎం నగర కార్యదర్శి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డులకూ సొసైటీ

### ఆవిష్కరించిన సీపీ సజ్జనార్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోనే తొలిసారిగా సైబరాబాద్ పోలీసులు హోంగార్డుల సంక్షేమం కోసం ఓ సొసైటీని ఏర్పాటు చేశారు. 'సైబరాబాద్ హోంగార్డ్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్'పేరుతో ఏర్పాటైన దీన్ని కమిషనర్ వీసీ సజ్జనార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సొసైటీ హోంగార్డులకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా పోలీసు విభాగంలో వారు ఒక భాగమైన భావన పెంచుతుందని కమిషనర్ అన్నారు. దీని ఏర్పాటుతో కమిషనరేట్‌లో పని చేస్తున్న 1,049 మంది హోంగార్డులు లబ్ధిపొందుతారని, సాలీనా 6 శాతం వడ్డీకి ఒక్కో హోంగార్డుకు రూ.50 వేల వరకు రుణం మంజూరవుతుందని పేర్కొన్నారు. సొసైటీ 3 నెలల తర్వాత నుంచి రుణాలు అందిస్తుందని, ఆ మొత్తాన్ని నాలుగేళ్లల్లో 50 వాయిదాల్లో తిరిగి చెల్లించే వెసులుబాటు ఉందని ఆయన వివరించారు. ప్రతి హోంగార్డు నుంచి నెల నెలా రూ. 1,000 థ్రిఫ్ట్ మొత్తంగా, మరో రూ.50 సంక్షేమ నిధికి వసూలు చేస్తారు. మొదటి నెల మాత్రం రూ.50 రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హోం గార్డుల జీతం ఆధారంగా ఎక్కువ మొత్తం రుణం పొందే ఆస్కారముంటుందని సీపీ వివరించారు.

# రైల్వే మరణాలు 0

## 2019లో రైళ్ల ప్రమాదాలపై రైల్వే ప్రకటన



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది రైలు ప్రమాదాల వల్ల ఒక్క ప్రయాణికుడు కూడా మరణించలేదని భారత రైల్వే ప్రకటించింది. దీంతో రైల్వే చరిత్రలోనే ఈ ఏడాది చాలా సురక్షితమైనదిగా నమోదైందని అధికారులు వెల్లడించారు. సిబ్బంది చనిపోయారని, ప్రయాణికులు చనిపోలేదని తెలిపారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో 16 మరణాలు, 2017–18లో 28, 2016–17 మధ్య కాలంలో 195 మరణాలు సంభవించాయి. అదే 1990–95 మధ్య కాలంలో సరాసరి ఏటా 500 రైల్వే ప్రమాదాలు జరిగేవి. ఈ ఐదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో 2,400 మరణాలు సంభవించగా, 4,300 మంది గాయపడ్డారు. 2013–18 మధ్య కాలంలో ఏటా 110 ప్రమాదాలు జరగ్గా, ఈ ఐదేళ్లలో 990 మంది చనిపోగా, 1,500 మంది గాయపడ్డారని సమాచారం. కొన్నేళ్లుగా రైల్వేలో యాక్సిడెంట్లు తగ్గుముఖం పడుతూ ఉన్నాయి.


# నిరుద్యోగమే పెద్ద సమస్య

## నగరాల యువత అంతరంగమిదే



**న్యూఢిల్లీ:** నిరుద్యోగమొక్కటే తాము ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అని దేశంలోని నగరాల యువతలో సగం మంది అభిప్రాయపడుతున్నారు. దేశం సరైన దారిలోనే వెళ్తోందని నగర యువతలో 69 శాతం మంది తెలిపినట్లు ఇప్సోస్ అనే సంస్థ తెలిపింది. 'వాట్ వర్రీస్ ద వరల్డ్' పేరుతో నిర్వహించిన ఈ సర్వేలో ఆర్థిక, రాజకీయ అవినీతి, నేరాలు, హింస, పేదరికం, సామాజిక అసమతౌల్యత, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై భారతీయులు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఇప్సోస్ తెలిపింది. 'పట్టణాల్లో ఉన్న వారిని అక్టోబరులో ప్రశ్నించినప్పుడు సుమారు 46 శాతం మంది నిరుద్యోగం లేదా ఉపాధి లేకపోవడమన్నది అతిపెద్ద సమస్యగా చెప్పుకొచ్చారు. నవంబరులో ఈ సంఖ్య మరో మూడు శాతం పెరిగింది'అని సర్వే తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో పౌరులు అతిపెద్ద సమస్యలుగా పేదరికం, సామాజిక అసమతౌల్యతగా గుర్తించారని, తరువాతి స్థానాల్లో నిరుద్యోగం, నేరాలు, హింస, ఆర్థిక, రాజకీయ అవినీతి, ఆరోగ్యం వంటి అంశాలు ఉన్నాయని తెలిపింది.

# మాజీ సైంటిస్ట్‌కు 1.3 కోట్ల పరిహారం



**తిరువనంతపురం:** గూఢచర్యం కేసులో నిరపరాధిగా విడుదలైన ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్‌కు రూ.1.3కోట్ల పరిహారం ఇవ్వాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. 1994లో దేశ రహస్యాలను ఇతరులకు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై నారాయణన్‌పై కేసు నమోదు కాగా.. విచారణలో ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు. తనను అన్యాయంగా కేసులో ఇరికించిన కారణంగా నష్టపరిహారం చెల్లించాలని 77 ఏళ్ల నారాయణన్ కేసు దాఖలు చేయగా కోర్టు అనుకూల తీర్పునిచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం, మానవ హక్కుల కమిషన్ ఈ కేసులో ఇస్రో మాజీ శాస్త్రవేత్తకు రూ.50 లక్షలు, రూ. పది లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పివ్వడం తెల్సిందే. తాజాగా ప్రభుత్వం నిర్ణయించిన రూ.1.3 కోట్లు సుప్రీంకోర్టు పరిహారానికి అదనం. నారాయణన్ లేవనెత్తిన అంశాల పరిశీలనకు ప్రభుత్వం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జయకుమార్‌కు బాధ్యతలు అప్పగించగా ఆయన రూ.1.3 కోట్ల పరిహారం చెల్లించాలని సిఫారసు చేశారు.

### నాకు సెక్యూరిటీ వద్దు: అన్నా హజారే

**పుణే:** ప్రభుత్వం తనకు కల్పించిన భద్రతకు ఉపసంహరించుకోవాలని సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేకు లేఖ రాశారు. తనకు భద్రత కల్పించడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్నారు. తనకు గతంలో బెదిరింపులు వచ్చినా లెక్కచేయలేదన్నారు. ఇటీవల చాలామందికి భద్రతను తగ్గించడం లేదా తొలగించిన ప్రభుత్వం తను కోరినా స్పందించలేదన్నారు. అందుకే మరోసారి లేఖ రాశానని హజారే పేర్కొన్నారు.

### ముస్లింల ఆందోళనలపై బీజేపీ సమావేశం

**న్యూఢిల్లీ:** కొత్త పౌరసత్వ చట్టానికి సంబంధించి ముస్లింల ఆందోళనలపై జనవరిలో జాతీయ స్థాయి సమావేశం నిర్వహించాలని బీజేపీ భావిస్తోంది. ఈ మేరకు మైనార్టీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ నఖ్వీ శుక్రవారం ఓ సమావేశం నిర్వహించారని, దీనికి జాతీయ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఘయోరుల్ హసన్ రిజ్వీ సహా పలువురు బీజేపీ ముస్లిం నేతలు హాజరయ్యారని సమాచారం. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ల గురించి కొన్ని రాజకీయ పక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని బీజేపీ భావిస్తోంది.

### కర్ణాటకలో క్రీస్తు విగ్రహం ఏర్పాటుపై వివాదం

**బెంగళూరు:** కర్ణాటకలో 114 అడుగుల ఎత్తైన ఏసుక్రీస్తు విగ్రహం నెలకొల్పేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ చేస్తున్న యత్నాలపై వివాదం తలెత్తింది. శివకుమార్ తన సొంత నియోజకవర్గం కనకపురలోని హారొబెళలో త్వరలో 101 అడుగుల ఎత్తైన ఏసుక్రీస్తు విగ్రహం ప్రతిష్టిస్తానని చెప్పారు. ఇందుకు పదెకరాల భూమిని కొని, సొంత డబ్బును వెచ్చిస్తున్నారు. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద ఏసుక్రీస్తు ఏకశిలా విగ్రహం కానుందన్నారు. అయితే, విగ్రహం ఏర్పాటు చేయనున్న భూమి శివకుమార్ సొంతం కాదని, అది సామాజిక అవసరాలకు ఉద్దేశించిందని ప్రభుత్వం పేర్కొంది. ఈ భూమిని శివకుమార్ కొనుగోలు చేయడంపై విచారణ జరపాల్సిందిగా ఆదేశించింది.

### దిగిరాని ఉల్లి



**న్యూఢిల్లీ:** దేశంలో ఉల్లి ధరలు ఇంకా కన్నీళ్లను తెప్పిస్తూనే ఉన్నాయి. ఇతర దేశాల నుంచి భారీగా ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నప్పటికీ ధరలు దిగిరావట్లేదు. శుక్రవారం ఉల్లి ధర కిలో రూ.150 వరకు పలికింది. కోల్‌కతాలో కిలో ఉల్లి రూ.120 ఉండగా.. ఢిల్లీ, ముంబైలో రూ.102గా ఉంది. ఇక చెన్నైలో కిలో రూ.80 వరకు ఉన్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరాల మేరకు తెలుస్తోంది. దేశంలోని అనేక నగరాల్లో ఉల్లి ధరలు రూ.వందకు అటూఇటుగా ఉన్నాయి.

### వాతావరణ రక్షణకు సరికొత్త వ్యూహం

**బోస్టన్:** ప్రపంచ వాతావరణాన్ని కాపాడుతూ 2050 నాటికి వంద శాతం శుభ్రమైన పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సరికొత్త మార్గాన్ని రూపొందించారు. ప్రపంచంలోని సుమారు 143 దేశాలు ఈ మార్గాన్ని ఉపయోగించి పర్యావరణ రక్షణకు పాటుపడవచ్చని వారు చెబుతున్నారు. తాము రూపొందించిన కొత్త మార్గాన్ని ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి అవసరాన్ని 57 శాతం వరకు తగ్గించవచ్చని తెలిపారు. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ ఖర్చును 91 శాతం తగ్గించవచ్చని వెల్లడించారు.

### నేడు కాంగ్రెస్ దేశవ్యాప్త ప్రదర్శనలు


**న్యూఢిల్లీ:** ఒకవైపు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతూండగానే 'రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడండి' సందేశంతో కాంగ్రెస్ పార్టీ శనివారం దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించనుంది. పార్టీ 134వ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమాచారం. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ శనివారం పార్టీ జెండాను ఎగురవేయనున్నారు.

# మాటల యుద్ధం

## ఎన్పీఆర్, ఎన్నార్సీ, సీఏఏలపై అధికార, విపక్ష నేతల పరస్పర విమర్శలు

- నేను బతికుండగా సీఏఏను అమలు కానివ్వను: మమత
- పేదల డబ్బు గుంజే యత్నం: రాహుల్
- 'ఈ ఏడాది అబద్ధాల కోరు' అంటూ రాహుల్‌పై ప్రకాశ్ జవదేకర్ ధ్వజం





**న్యూఢిల్లీ/రాయ్‌పూర్/కోల్‌కతా/ముంబై/సిమ్లా:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్) దేశవ్యాప్త అమలు ప్రతిపాదనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రమైంది. సీఏఏను జీవించి ఉండగా అమలు కానివ్వనంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రతినబూనగా ఎన్పీఆర్, ఎన్నార్సీలను పేదల జేబులు గుల్లచేయడానికే ప్రభుత్వం తీసుకువచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్ అనే మూడింటిని త్రిశూలంగా మార్చి బీజేపీ ప్రభుత్వం ప్రజలపై దాడికి పూనుకుందని సీపీఎం నేత బృందా కారత్ విమర్శించారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. కాగా, సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీల అమలును వ్యతిరేకంగాదేశంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు కొనసాగాయి.

#### ఇవి పన్ను భారం వంటివే

'దేశ ప్రజల హక్కులను ఎవరూ లాగేసుకోలేరు. నేను బతికి ఉన్నంత కాలం రాష్ట్రంలో సీఏఏను అమలు కానివ్వను. బెంగాల్‌లో ఎలాంటి నిర్బంధ కేంద్రాలు లేవు' అని నైహాటిలో జరిగిన ర్యాలీలో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఎన్పీఆర్, ఎన్నార్సీలు ప్రజలపై పన్ను భారం వంటివేనన్నారు. 'నోట్ల రద్దు సమయంలో ప్రజల వద్ద డబ్బును బ్యాంకులు లాగేసుకున్నాయి. అదంతా మోదీకి సన్నిహితులైన 15, 20 మంది పారిశ్రామిక వేత్తల జేబుల్లోకి వెళ్లింది. తాజాగా ఎన్పీఆర్, ఎన్నార్సీలు అమలైతే పేద ప్రజలు వివిధ పత్రాల కోసం అధికారులకు లంచాల రూపంలో మరోసారి డబ్బు ముట్టజెప్పే పరిస్థితి రానుంది' అని వ్యాఖ్యానించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సామూహిక కృషి, ఐక్యతతోనే దేశం ముందుకు వెళ్తుందన్నారు.

#### రాహుల్ అబద్ధాలు మానలేదు

రాహుల్ ఆరోపణలపై కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ స్పందించారు. 'ఎన్పీఆర్ ధ్రువీకరణల కోసం ప్రజలు ఎవరికీ డబ్బు చెల్లించాల్సిన పనిలేదు. సర్వేలో సేకరించిన సమాచారంతో నిజమైన పేదలను గుర్తించి సంక్షేమ పథకాలను వారికే అందేలా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి కార్యక్రమం కాంగ్రెస్ హయాంలో 2010లో జరిగింది' అని చెప్పారు. 'కాంగ్రెస్ చీఫ్‌గా ఉండగా రాహుల్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఆ పదవి లేకున్నా ఆయన అబద్ధాలు ఆపట్లేరు. 'ఈ ఏడాది అబద్ధాల కోరు ఎవరైనా ఉన్నారూ అంటే.. అతడు రాహుల్ గాంధీయే' అని ఢిల్లీలో మీడియాతో అన్నారు. సీఏఏ విషయంలో కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, పౌరసత్వం కోల్పోతారంటూ ముస్లింల్లో వదంతులు రేపుతున్నాయని సిమ్లాలో హోం మంత్రి అమిత్‌షాఆరోపించారు. 'సీఏఏలో పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు సంబంధించి ఏవైనా నిబంధనలు ఉంటే చూపించాలని రాహుల్ బాబాకు సవాల్ చేస్తున్నా' అని అన్నారు.

#### ప్రతిపక్షాలవి ఓటు బ్యాంకు రాజకీయాలు

ముంబై మహా నగరం పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)లపై అనుకూల, వ్యతిరేక ప్రదర్శనలకు శుక్రవారం వేదికగా మారింది. బీజేపీకి చెందిన సంవిధాన్ సమ్మాన్ మంచ్ నేతృత్వంలో చారిత్రక క్రాంతి మైదాన్‌లో చేపట్టిన ర్యాలీలో బీజేపీ నేత, మాజీ సీఎం ఫడ్నవీస్ పాల్గొని ప్రసంగించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రతిపక్షాలు ఎన్నార్సీ, సీఏఏలపై వదంతులు, దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

#### భీమ్ ఆర్మీ ర్యాలీ అడ్డగింత

భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేతులను బంధించుకుని ప్రధాని మోదీ నివాసం వైపు ర్యాలీగా తరలివస్తున్న ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. జోర్‌బాగ్‌లోని దర్గా షా–ఇ–మర్దన్ నుంచి శుక్రవారం ప్రార్థనల అనంతరం చేతులను బంధించుకుని కొందరు ప్రధాని నివాసం లోక్‌కల్యాణ్ మార్గ్ వైపుగా ర్యాలీగా కదలివచ్చారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు.

# ఇంటర్నెట్ షట్‌డౌన్ @ 100



కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రికార్డు స్థాయిలో వివిధ సందర్భాల్లో 100 సార్లకుపైగా ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా తాజాగా ఉత్తరప్రదేశ్‌లో 21 జిల్లాల్లో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేయడం చర్చకు దారి తీస్తోంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికే అస్సాం సహా ఇతర ఈశాన్య రాష్ట్రాలు పశ్చిమబెంగాల్‌లో ఇప్పటికే చాలాసార్లు ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు.

- డిసెంబర్ 19న రాజధాని ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయాన్ని నిలిపివేశారు.
- జమ్మూ, కశ్మీర్ రాష్ట్రానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్370ని కేంద్రప్రభుత్వం రద్దు చేసినపుడు అంటే ఆగస్టు 5న నిలిపేసిన ఇంటర్నెట్ సేవల్ని ఇప్పటివరకు చాలాచోట్ల పునరుద్ధరించలేదు.
- ఇటీవల వివాదాస్పద బాబ్రీమసీదు స్థల వివాదం కేసులో సుప్రీం కోర్టు తుదితీర్పు వెలువడ్డానికి ముందు ఉత్తర ప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ఆపేశారు.
- 2012 నాటికి కశ్మీర్‌లో ఒకట్రెండు జిల్లాలకే పరిమితమైన ఇంటర్నెట్ షట్ డౌన్ అనేది 2019 వచ్చేసరికి 14 రాష్ట్రాలకు చేరుకుంది.
- నిరసనలు, ఆందోళనలు జరిగిన ప్రతీసారి తప్పుడు సమాచారం వ్యాప్తిని అరికట్టడానికే ఇంటర్నెట్‌ను నిలిపివేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, పౌరులకు ఉండే ఒక సదుపాయాన్ని రద్దు చేయడం ప్రాథమిక హక్కుని కాలరాయడమేనన్న అభిప్రాయాలు ఉన్నాయి.
- అంతేకాదు ఇలా ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేయడం వల్ల భారత్‌కి 2012–2017 మధ్య 300 కోట్ల డాలర్లకు పైగా నష్టం వాటిల్లిందని ఓ అంచనా.

| ఏ ఏడాది ఎన్నిసార్లు షట్‌డౌన్ | |
|---|---|
| 2017 | 79 |
| 2018 | 134 |
| 2019 | 100 |

2012 నుంచి చూస్తే 370 సార్లకు పైగా దేశంలో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం ఆపేసింది.

#### గతంలోనూ..

- భారత్‌లో తొలిసారిగా 2010లో గణతంత్ర వేడుకకు ముందు కశ్మీర్ లోయ ప్రాంతంలో ఇంటర్నెట్, ఫోన్ సేవలను ప్రభుత్వం ఆపేసింది.
- 2016లో హిజ్‌బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీని సైన్యం మట్టుబెట్టాక కశ్మీర్‌తో బయట ప్రపంచానికి 133 రోజుల పాటు సంబంధాలు తెగిపోయాయి.
- 2016లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్‌లో ప్రత్యేక గూర్ఖాల్యాండ్ ఆందోళనలు ఉధృతంగా ఉన్నపుడు 100 రోజులు ఇంటర్నెట్ సేవలను స్తంభింపజేశారు.
- 2015లో గుజరాత్‌లో పటీదార్‌ల 'రిజర్వేషన్'ల ఉద్యమ సమయంలో రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.

# లోయలో ఇంటర్నెట్ ఎప్పుడు?

## కార్గిల్‌లో 145 రోజుల తర్వాత మొబైల్ ఇంటర్‌నెట్ సేవల పునరుద్ధరణ

**శ్రీనగర్:** లద్దాఖ్‌లోని కార్గిల్ జిల్లాలో 145 రోజుల తర్వాత శుక్రవారం మొబైల్ ఇంటర్నెట్ సేవలు పునఃప్రారంభం కాగా కశ్మీర్ లోయలో ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మోదీ నేతృత్వంలోని కేంద్రసర్కారు ఆర్టికల్ 370ని రద్దు చేసి ఇప్పటికే 145 రోజులవుతోంది. గత నాలుగు నెలల నుంచి కార్గిల్‌లో ఎటువంటి అవాంఛిత సంఘటనలు జరగనందున అక్కడ మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సేవలను దుర్వినియోగం చేయొద్దని అక్కడి మత పెద్దలు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్రం ఆగస్ట్ 5న ఆర్టికల్–370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటుచేసినప్పటి నుంచి అక్కడ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. కశ్మీర్‌లో గత 145 రోజులుగా డిజిటల్ బ్లాకవుట్ కొనసాగుతుండగా ఇది ఇంకా ఎన్నాళ్లు కొనసాగుతోందో తెలియదు. సమీప భవిష్యత్తులో సేవలను పునః ప్రారంభించే సూచనలు కూడా కనిపించడం లేదు.

# మిగ్–27కు వీడ్కోలు



**జోధ్‌పూర్:** దాదాపు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన మిగ్(ఎంఐజీ)–27 యుద్ధ విమానాలు ఇక విశ్రాంతి తీసుకోనున్నాయి. జోధ్‌పూర్ వైమానిక స్థావరంలో శుక్రవారం జరిగిన మిగ్ వీడ్కోలు కార్యక్రమంలో సౌత్ వెస్టర్న్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఎస్‌కే ఘోటియా పాల్గొన్నారు. ఈ విమానాలు పోరాటక్షేత్రంలో ముందు నిలిచాయని, 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో అమూల్యమైన సేవలందించాయని తెలిపారు. ఇన్నాళ్లూ జోధ్‌పూర్ ఎయిర్ బేస్‌లో మిగ్–27 రకం విమానాలు ఏడు వరకు సేవలందించాయి.

# కజకిస్థాన్‌లో విమాన ప్రమాదం

## 12 మంది మృతి




**అల్మేటీ:** కజకిస్తాన్‌లో శుక్రవారం జరిగిన ఒక విమాన ప్రమాదంలో 12 మంది మరణించారు. దేశంలోని అతిపెద్ద నగరం అల్మేటీ నుంచి ఉదయం ఏడు గంటల ప్రాంతంలో సుమారు వంద మందితో టేకాఫ్ తీసుకున్న విమానం ఆ తరువాత కొద్దిసేపటికే కూలిపోయింది. బెక్ ఎయిర్ అనే విమానయాన సంస్థకు చెందిన ఈ విమానం రాజధాని నూర్ సుల్తాన్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే టేకాఫ్ తరువాత కొన్ని నిమిషాల వ్యవధిలోనే విమానం రాడార్‌లో కనిపించకుండా పోయిందని, అల్మేటీ సరిహద్దుల్లోని ఓ రెండంతస్తుల భవనంపై కూలిపోయిందని విమానాశ్రయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విమానం కూలిపోయిన ధాటికి విమానం రెండు ముక్కలైందని, ప్రాణాలతో ఉన్న వారిని శకలాల నుంచి వెలికి తీసేందుకు సహాయక బృందాలు పనిచేస్తున్నాయని వివరించింది. విమానంలో మొత్తం 95 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది ఉండగా కెప్టెన్‌తోపాటు 11 మంది మరణించినట్లు ఆ ప్రకటన వివరించింది. ఈ దుర్ఘటనలో 53 మంది గాయపడ్డారని, వీరిలో తొమ్మిది మంది పిల్లలూ ఉన్నారని తెలిపింది, ఘటనపై విచారణ జరపడంతోపాటు, బెక్ ఎయిర్ సంస్థ వాడుతున్న ఫొక్కర్ మోడల్ విమానాలపై కజకిస్థాన్ ప్రభుత్వం నిషేధం విధించింది. విమానం టేకాఫ్ తీసుకునే సమయంలోనే దాని తోకభాగం రన్‌వేను రెండుసార్లు తాకిందని, ఇది పైలట్ తప్పిదమా? లేదా సాంకేతికపరమైన సమస్య? అన్నది తేల్చాల్సి ఉందని ఉప ప్రధాని స్కైలార్ చెప్పారు.

### దళిత మహిళకు సీటు.. ఎన్నికల బహిష్కరణ

**చెన్నై:** కుల వివక్ష నేటికీ కొనసాగుతోందనడానికి ఉదాహరణగా నిలిచారు తమిళనాడుకు చెందిన తూత్తుకుడి గ్రామస్తులు. అక్కడ పంచాయతీ ప్రెసిడెంట్ కోసం శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో దళిత మహిళకు సీటు కేటాయించడంతో నాడార్ కులానికి చెందిన వారు ఏకంగా ఆ ఎన్నికలనే బహిష్కరించారు. పిచ్చావిళై గ్రామంలో 785 ఓటర్లలో ఆరుగురు దళితులు పంచాయతీ ప్రెసిడెంట్ కోసం నిర్వహించిన ఎన్నికల్లో ఓటు వేశారు. నాడార్ కులానికి చెందిన మిగతా 779 మంది ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేయకుండా వారి ఇళ్ల ముందు నల్లటి జెండాలను ఉంచి నిరసనలను తెలిపారు. తాలూకా అధికారి వారిని ఓటు వేయాలని కోరినప్పటికీ వారు దాన్ని పెడచెవిన పెట్టి బహిష్కరించారు. 'సీట్ల కేటాయింపు న్యాయంగా లేదు. మేం ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ మాకు నచ్చిన అభ్యర్థిని ఉంచడానికి అనుమతించలేదు. అందుకే మేం ఎన్నికలను బహిష్కరించాం'అని మడిసుదు అనే స్థానికుడు తెలిపారు.

# కశ్మీర్‌లో మైనస్ ఉష్ణోగ్రతలు

## గుల్మార్గ్, పహల్గామ్ రిసార్ట్‌లలోనూ అతిశీతల పరిస్థితులు



శ్రీనగర్‌లో గడ్డకట్టిన దాల్ సరస్సు పైభాగం

**న్యూఢిల్లీ:** కొన్ని రోజులుగా చలిగాలుల ఉధృతితో వణికిపోతున్న ఉత్తర భారతానికి ఇంకో రెండ్రోజులపాటు ఉపశమనం లభించే అవకాశం లేదని భారత వాతావరణ విభాగం శుక్రవారం తెలిపింది. తూర్పు, మధ్యభారతదేశ ప్రాంతాల్లోనూ చలితీవ్రత పెరగనుందని తెలిపింది. వాయవ్య దిక్కు నుంచి వస్తున్న శీతల పవనాలు కొనసాగుతున్న కారణంగా పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్ ఉత్తర ప్రాంతం, ఉత్తరప్రదేశ్‌లలో రానున్న రెండు రోజులు చలి లేదా అతిశీతల పరిస్థితులు నెలకొంటాయని ఐఎండీ తెలిపింది. కొత్త సంవత్సరం తొలిరోజు, అంతకుముందు రోజుల్లో దేశ వాయువ్య, మధ్య ప్రాంతాల్లో వర్షాలు, కొన్నిచోట్ల వడగళ్ల వాన కురిసే అవకాశముంది. ఇదిలా ఉండగా.. కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో సగటు ఉష్ణోగ్రతలు –5.6 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయాయి. ఈ సీజన్‌లో ఇంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారని స్థానిక వాతావరణ విభాగం తెలిపింది. కశ్మీర్, లడాఖ్‌ల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు మైనస్‌లలోకి వెళ్లాయి. కశ్మీర్ ఉత్తర ప్రాంతంలోని గుల్మార్గ్‌లో ఉష్ణోగ్రతలు – 9.5 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోగా, పహల్గామ్ రిసార్ట్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు – 12.0 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

### మిడతలపై పోరు..



పాకిస్తాన్ వైపు నుంచి వచ్చిన మిడతల దండు గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో పంటలను నాశనం చేస్తుండటంతో వాటిపైకి పురుగు మందును స్ప్రే చేస్తున్న రైతులు

### ఆధిపత్యపు జోరు..



ప్రపంచంపై సైనిక సత్తా చాటేందుకు రష్యా తయారు చేసుకున్న అత్యంత అధునాతన అవాన్‌గార్డ్ హైపర్‌సోనిక్ ఖండాంతర క్షిపణి ఇది. ధ్వనికంటే 20 రెట్లు వేగంగా దూసుకెళుతుంది. ఈ క్షిపణిని శుక్రవారం రష్యా తన సైన్యంలోకి తీసుకుంది. ఈ క్షిపణి గంటకు దాదాపు 33వేల కి.మీ.ల వేగంతో దూసుకెళ్లగలదు.

### పండగ హుషారు..



ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ప్రారంభమైన జాతీయ గిరిజన డ్యాన్స్ ఫెస్టివల్‌లో గిరిజన తలపాగా ధరించి డోలు వాయిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ. ఆరు దేశాలకు చెందిన 1,300 కళాకారులు పాల్గొనే ఈ ఉత్సవం మూడు రోజులు కొనసాగనుంది.

సాక్షి
శనివారం, డిసెంబర్, 28

# పాక్ క్రికెట్‌లో వివక్ష

మర్యాదస్తుల క్రీడగా అందరూ చెప్పుకునే క్రికెట్‌లో మళ్లీ చాన్నాళ్లకి తుపాను రేగింది. పాకిస్తాన్ క్రికెట్ టీంలో బాగా ఆడి, మంచి స్పిన్నర్‌గా పేరు తెచ్చుకున్న డేనిష్ కనేరియాపై అప్పటి కెప్టెన్‌తోపాటు, తోటి ఆటగాళ్లు కొందరు వివక్ష ప్రదర్శించేవారని ఒక టీవీ షోలో పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అఖ్తర్ బాంబు పేల్చాడు. అతడు కేవలం హిందువు కావడం వల్లే ఈ వివక్ష ఉండేదని కూడా అన్నాడు. అయితే ఆ బాంబు తాలూకు చప్పుళ్లు పాకిస్తాన్ మాటేమో గానీ...మన దేశంలో బాగానే వినబడ్డాయి. వర్తమాన పరిస్థితుల్లో అది సహజం కూడా. అసలు అలాంటివారి కోసమే తాము పౌరసత్వ చట్టాన్ని సవరించామని కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ చెప్పగా, ఉత్తరప్రదేశ్ మంత్రి కనేరియాకు నేరుగా ఒక ఆఫర్ ఇచ్చారు. ఇక్కడకు వస్తానంటే పౌరసత్వం కల్పిస్తామని అభయమిచ్చారు. అయితే షోయబ్, కనేరియా మాదిరే క్రికెట్‌లో కీర్తిప్రతిష్టలు ఆర్జించి, ఇప్పుడు పాకిస్తాన్ ప్రధాని పీఠంపై వున్న ఇమ్రాన్ ఖాన్ మాత్రం ఇంతవరకూ మాట్లాడలేదు. ఈ విషయంలో చెప్పేదేమీ లేదని పాక్ క్రికెట్ బోర్డు చేతులు దులుపుకుంది. ఇలాంటివి జరగకుండా చూస్తామని మాటవరసకైనా అనలేదు. పైగా షోయబ్, కనేరియాలిద్దరూ ప్రస్తుతం మాజీ ఆటగాళ్లు కదా అంటూ తర్కం లేవనెత్తుతోంది. కనేరియా ఆడుతున్నప్పుడు ఇంజమామ్–ఉల్– హక్, రషీద్ లతీఫ్, యూనిస్ ఖాన్, మహమ్మద్ యూసుఫ్‌లు కెప్టెన్లుగా పనిచేశారు. వీరిలో ఇంజమామ్, యూనిస్‌ఖాన్, మహమ్మ ద్ యూసుఫ్‌లు తనను ప్రోత్సహించేవారని కనేరియా అంటున్నాడు కనుక రషీద్‌పైనే సహజంగా అందరికీ అనుమానాలు వస్తాయి. ఎటూ కనేరియా త్వరలో ఆ పేర్లు బయటపెడతానంటున్నాడు కనుక ఆ కెప్టెన్, ఇతర ఆటగాళ్లెవరో తేలిపోతుంది.

వివక్ష ఒక మతానికి, కులానికి, దేశానికి లేదా జాతికి పరిమితమైన దురాచారం కాదని, ఇది అన్నిచోట్లా వ్యాపించివున్నదని గతంలో సైతం చాలాసార్లు వెల్లడైంది. నువ్వా నేనా అన్నట్టు ఆట సాగుతున్నప్పుడు ప్రత్యర్థి టీంల మధ్య స్పర్థలు పెరగడం, ఆవేశంతో ఎదుటివారిని జాతి పేరుతో, మతం పేరుతో దూషించడం, వారి ముఖకవళికలను హేళన చేయడం వంటివి క్రికెట్ అభిమానులు తరచు చూస్తున్నదే. దక్షిణాఫ్రికాకు చెందిన బేసిల్ డి అలివేరాను పూర్తి స్థాయి శ్వేత జాతీయుడు కాదన్న కారణంతో 1960లో క్రికెట్ టీంలోకి తీసుకోలేదు. దాంతో అతను అలిగి ఇంగ్లండ్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత అక్కడి టీం తరపున దక్షిణాఫ్రికా వెళ్లినప్పుడు కూడా ఆనాటి దక్షిణాఫ్రికా ప్రధాని జాన్ వోర్‌స్టర్ బేసిల్ గురించి అవమానకరంగానే మాట్లాడారు. తమ టీం కెన్యాపై ఓడినప్పుడు బ్రియాన్ లారా 1996లో కెన్యా ఆటగాళ్లతో మాట్లాడుతూ దక్షిణాఫ్రికా టీంపై చేసిన జాతిపరమైన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. పదేళ్లక్రితం సిడ్నీ టెస్టులో సైమండ్స్‌ని హర్భజన్ సింగ్ కోతి అంటూ వెక్కిరించడం, అప్పట్లో అది భారత్, ఆస్ట్రేలియా టీంల మధ్య పెను వివాదం సృష్టించడం ఎవరూ మరిచిపోరు. అయితే ఆటలో ఉత్కంఠ పెరిగి, నువ్వా నేనా అన్నట్టు సాగుతుండగా ఆటగాళ్లు ఆవేశానికి లోనై అప్పటికప్పుడు ఏదో అనడం వేరు. కనేరియాకు జరిగింది ఇది కాదు. పాక్ ఆటగాళ్లలో కొందరు అతనితో కలిసి భోంచేసేందుకు సిద్ధపడేవారు కాదని, కనేరియాను వేరేచోటకు వెళ్లమనేవారని షోయబ్ వెల్లడించాడు. కేవలం తాను అన్య మతస్తుడిననే ఇలా ప్రవర్తించేవారని కనేరియా కూడా చెబుతున్నాడు. నిజానికి మన దేశంలో దళితులకు, ఇతర కులాలకు ఇది నిత్యానుభవం. అన్య మతస్తులపై కత్తులు నూరేవారు అన్నిచోట్లా వున్నారు. కానీ అలాంటి ఉన్మాదులు క్రీడాప్రపంచంలోకి సైతం చొరబడ్డారని తెలిసినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది.

దాదాపు 87 ఏళ్ల చరిత్రవున్న మన క్రికెట్ టీంలో ఆధిపత్య కులాలకు చెందినవారే కనిపిస్తారన్న ఫిర్యాదు చాలా తరచుగా దళిత వర్గాల నుంచి వినబడుతుంటుంది. దళిత ఆటగాళ్లు ఇంతవరకూ కేవలం నలుగురు మాత్రమే వున్నారని ఆ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దళిత కులాలవారు క్రికెట్ చూడరని, ఆడరని ఎవరూ అనుకోరు. మరి ఆ వర్గాలవారు టీంలో ఎందుకు కనబడరన్నది జవాబులేని ప్రశ్న. 1993లో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన వినోద్ కాంబ్లీ మంచి ఆటగాడిగా రాణించాడు. కులం కారణంగా తనను పక్కనబెట్టారని కాంబ్లీ ఎప్పుడూ చెప్పలేదు. కానీ దళితుడన్న కారణంతో అతనికి అన్యాయం చేశారని మొన్నటివరకూ బీజేపీ ఎంపీగా వున్న ఉదిత్ రాజ్ ఆరోపించారు. క్రికెట్‌లో సైతం రిజర్వేషన్లు వచ్చినప్పుడే దళితులకు, వెనకబడిన కులాలకు అందులో చోటు దక్కుతుందని రిపబ్లికన్ పార్టీకి చెందిన కేంద్రమంత్రి రాందాస్ అథ్వాలే కూడా చెప్పారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వున్నప్పుడు క్రీడల్లో ఎందుకుండరాదన్నది ఆయన ప్రశ్న. క్రికెట్ టీముల్లో ఇంతవరకూ ఆడినవారు ఆధిపత్య కులాలవారే అయినా వారంతా డబ్బూ, పలుకుబడీ వున్న కుటుంబాల నుంచో, రాజకీయ నాయకుల కుటుంబాలనుంచో రాలేదని వాదించే వారున్నారు. అందులో అవాస్తవం లేకపోవచ్చు. కానీ దళితులు ఎందుకు రాలేకపోయారన్న ప్రశ్నకు జవాబులేదు. దక్షిణాఫ్రికా జాత్యహంకారంతో తన టీంలో శ్వేతజాతీయులకే చోటిస్తున్నదని నిర్ధారణయ్యాక ఆ దేశాన్ని ఐసీసీ 1970లో సస్పెండ్ చేసింది. ఇందువల్ల పొలాక్, రాబిన్ స్మిత్, టోనీ గ్రెగ్ వంటి మంచి ఆటగాళ్లు వేరే దేశాల టీంలకు వలస పోవలసివచ్చింది. 90వ దశకంలో దక్షిణాఫ్రికాలో జాత్యహంకార ప్రభుత్వం అంతరించినప్పటినుంచీ నల్లజాతీయులు కూడా ఆ టీంలో ఆడగలుగుతున్నారు. ఇప్పుడు కనేరియా ఉదంతంలో పాక్‌పై నాలుగు రాళ్లేయడం మాటెలా వున్నా మన క్రికెట్‌కు, ఇతర క్రీడలకు అలాంటి మచ్చ రాకుండా ఏం చేయగలమో చూడవలసిన అవసరం వుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి శు.విదియ ఉ.10.40 వరకు తదుపరి తదియ, నక్షత్రం ఉత్తరాషాఢ రా.6.51 వరకు తదుపరి శ్రవణం, వర్జ్యం రా.11.04 నుంచి 12.46 వరకు దుర్ముహూర్తం ఉ.6.32 నుంచి 8.01 వరకు అమృతఘడియలు... ప.12.08 నుంచి 1.45 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం: 5.30
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# హింసకు అణచివేతే సమాధానమా?

విశ్లేషణ


రాజీవ్ ధావన్

**పౌరసత్వ సవరణ చట్టంపై నిరసన తెలుపుతున్నవారితో ఎలాంటి చర్చలూ చేపట్టని ఉత్తరప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు వారిని బలప్రయోగంతో చెదరగొట్టాయి. కాల్పులు జరిపాయి. విధ్వంసం చేసినవారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నాయి. వాస్తవానికి అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు.. విభజించి పాలించు అనే సూత్రం పనిచేసినంతకాలం తమ హిందూ ఓటు చెక్కుచెదరదనే అభిప్రాయంతో.. ముస్లింలతో సహా ఇతరులను లెక్కపెట్టడం లేదు. సత్పరిపాలనకు సంబంధించిన అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ చర్యలు.. అమలులో ఉన్న చట్టాలన్నింటినీ ఉల్లంఘించడమే కాదు.. చట్టపాలనను అవమానిస్తున్నాయని కూడా చెప్పాల్సి ఉంటుంది. వ్యక్తుల, సమూహాల హింసకు తీవ్ర అణచివేత సమాధానం కావడం ఆటవిక న్యాయమే అవుతుంది.**

రాజకీయ తప్పిదాలు, అతి చర్యలనుంచి ప్రజల దృష్టిని మళ్లించడంలో భాగంగా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన నిరసనకారుల నుంచి నష్టపరిహారం రాబట్టాలని ప్రయత్నం చేస్తోంది. కానీ నిరసన తెలిపేందుకు ప్రజలకున్న రాజ్యాంగపరమైన హక్కులే ప్రాథమికం కానీ అణచివేత కాదన్న విషయం యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మర్చిపోయినట్లు కనబడుతోంది. శాంతిభద్రతల ప్రయోజనాల రీత్యా కానీ, భారత సార్వభౌమత్వం, సమగ్రత విషయంలో అయినా సరే.. నిరాయుధంగా, శాంతి యుతంగా సమావేశం కావడానికి రాజ్యాంగం దేశప్రజలకు కల్పించిన హక్కుపై అహేతుక ఆంక్షలను రుద్దకూడదని రాజ్యాంగం స్వయంగా నిర్దేశించిన నిబంధనను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కచ్చితంగా పాటించడం లేదని బోధపడుతోంది. రాజ్యాంగం పొందుపర్చిన ఈ అత్యంత ముఖ్యమైన ప్రాథమిక విధులను ఉల్లంఘించిన యోగి ప్రభుత్వం ఇప్పటికే అణచివేతకు గురైన వారిపై మరింత అణచివేతను విధించబోతున్నది. పైగా, అణచివేతకు పాల్పడిన పోలీసులను నిర్దోషులుగా నిర్ణయిస్తోంది.

ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసే హక్కు తమకుందని ఎవరూ ప్రకటించలేరు. అది నేరం. దానికి న్యాయస్థానం విధించిన పరిహారాన్ని చెల్లించాల్సిందే. కానీ దీనికి అనుసరించాల్సిన పద్ధతి, ప్రక్రియ ఏకపక్షంగా ఉండకూడదు లేక అమాయకులపై గురిపెట్టరాదు. రాజస్తాన్‌లో గుజ్జర్ల హింసాకాండ సందర్భంగా ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులకు భారీ నష్టం వాటిల్లిన సందర్భంలో ఈ అంశంపై సుప్రీంకోర్టులో తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. న్యాయసలహాదారుగా నన్ను 2007 జూన్ 5న నియమించినప్పుడు నేర లేక సివిల్ వ్యవహారాల్లో అడ్డదిడ్డంగా చర్యలు తీసుకోవడం సాధ్యపడదని, ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్టం 1984 (పీడీపీపీఏ)ను, సంబంధిత ఇతర చట్టాలను మరోసారి పరిశీలించాలని సుప్రీంకోర్టుకు విన్నవించాను. పైగా ఆనాటి అల్లర్లను అణచివేయడానికి 6 కంపెనీల సైనికులను పంపిన పారామిలిటరీ అధికారులను కె పరాశరన్, నేను స్వయంగా కలిసి విచారించాం కూడా.

అయితే ఈ పీడీపీపీఏ... నేరనిరోధక చర్యలకు ఏమాత్రం తగినది కాదు పైగా సాధారణ కేసులకు జరిమానాతో సహా ఆరునెలల జైలుశిక్ష విధింపు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు ప్రయోగించిన వారికి ఒకటి నుంచి పదేళ్ల కారాగార శిక్ష విధింపు అనేవి కొత్త నేరాలకు, అపరాధాలకు దారి తీస్తాయి. సామూహికంగా లేదా వ్యక్తిగతంగా ఒకరిపై వేలెత్తి చూపేరీతిలో నేరాలపై చర్యలను తీసుకోరాదు. దానికి ఒక క్రమ ప్రక్రియ అవసరం అవుతుంది.

ఆనాడు రాజస్తాన్, హరియాణా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలలో గుజ్జర్ల ప్రదర్శన సందర్భంగా జరిగిన విధ్వంసం మాటల్లో చెప్పలేనిది. సైన్యాన్ని రంగంలో దింపారు. ఈ సందర్భంగా అనేక ఎఫ్ఐఆర్‌లు ఫైల్ చేసి అరెస్టులు చేశారని, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులకు భారీ నష్టం చేకూరిందని నా నివేదికలో పొందుపర్చాను. నేను నివసిస్తుండిన న్యూ ఫ్రెండ్స్ కాలనీలో కూడా ఒక డీటీసీ బస్సును తగులబెట్టేశారని కోర్టుకు నివేదించాను. 2007 మే నెలలో ఎన్‌హెచ్8, ఎన్‌హెచ్ 11లో,



బురుండి సమీపంలో మోర్దా, బయానా బోనిల్, విరాట్ నగర్ గ్రామాల్లో పోలీసులు జరిపిన కాల్పుల ఘటనల్లో 18 మంది చనిపోయారు. గుంపు ఒక పోలీసును చచ్చేలా కొట్టారు. ఈ చర్యకు గాను గుజ్జర్లపై సాటి నిరసనకారులైన మీనాలు కూడా తిరగబడ్డారు. ఆనాడు ఘటనలకు సంబంధించిన ప్రతి రిపోర్టునూ జాతీయ టీవీ చానల్స్ ప్రసారాలను పరిశీలించి కోర్టుకు వివరంగా సమర్పించాను. మీడియా బాధ్యతాయుతంగానే నివేదించిందని, ఎక్కడా కల్పించి వార్తల్ని ప్రసారం చేయలేదని పేర్కొన్నాను. కానీ న్యాయస్థానం నా సమగ్ర నివేదికను నిర్లక్ష్యం చేయడమే కాకుండా ప్రతి ఒక్కరినీ తప్పు పట్టడమే కాకుండా కత్తిరించి అతికించిన మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన నాటి రాజస్తాన్ సీఎం వసుంధరా రాజే, గుజ్జర్లతో అయిదు దఫాలుగా చర్చలకు పూనుకున్నారు. తొలి నాలుగు చర్చలు విఫలమైనా 2007 జూన్ 4న చివరిదఫా చర్చలు విజయవంతమయ్యాయి. తర్వాత బెయిన్‌స్లా–రాజే మధ్య కుదిరిన ఒప్పందాన్ని గుజ్జర్ల మహాపంచాయతీ ఆమోదించింది. దాంతో సైన్యం కూడా బ్యారక్‌లలోకి వెళ్లిపోయింది.

నాటి గుజ్జర్ల హింసాత్మక చర్యలకు, 2019లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న హింసాత్మక చర్యలకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. తాజాగా నిరసన తెలుపుతున్న వారితో ఎలాంటి చర్చలూ ప్రారంభించకుండానే ఉత్తరప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు వారిని బలప్రయోగంతో చెదరగొట్టాయి. తీవ్రఆరోపణలు చేశాయి. గుజ్జర్లు, మీనాలు, ఇతర ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల ఓటు బ్యాంకులను బుజ్జగించాలని వసుంధరా రాజే ఆనాడు ప్రయత్నించారు. కానీ 2019లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు ముస్లిం ఓట్లను, వామపక్ష ఉదారవాద నిరసనకారులను పక్కన బెట్టవచ్చని భావించాయి. విభజించి పాలించు సూత్రం పనిచేసినంతకాలం తమ హిందూ ఓటు చెక్కుచెదరదనే అభిప్రాయంతో వీరు ముస్లింలతో సహా ఇతరులను లెక్కపెట్టడం లేదు.

గుజ్జర్ల ఘటన సందర్భంగా సుప్రీంకోర్టు ఆనాడు ప్రభుత్వాలకు, వాటి హైకోర్టులకు నిర్దేశించిన విధివిధానాలను ఇప్పుడు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. కానీ లక్నో బెంచ్‌కి చెందిన జస్టిస్ సుధీర్ అగర్వాల్ (బాబ్రీమసీదు కేసులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి) తాజా అల్లర్లకు పాల్పడినవారిపై పీడీపీపీఏ చట్టాన్ని విధించలేదని శోకన్నాలు పెట్టారు. మరోవైపున యోగి ఆదిత్యనాథ్ పోలీసుల అతిచర్యలపై ఎలాంటి వ్యాఖ్యానం చేయకుండా, నిరసనకారులపైనే తప్పుమోపారు. హింసాత్మక ఘటనలు జరిగినప్పుడు పోలీసుల ద్వారా జరిగిన విధ్వంసంపైన కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణమే నివేదించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినా యూపీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ఇరుపక్షాల పాత్రపై అంతిమంగా న్యాయస్థానం నిర్ణయించాల్సి ఉండగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ ప్రక్రియ మొత్తాన్ని పక్కనబెట్టేసింది.

మరొక ముఖ్యమైన అంశం ఏదంటే హైకోర్టు, సుప్రీంకోర్టు పేర్కొన్న మార్గదర్శక సూత్రాలను కమిషనర్ తప్పక పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. పోలీసుల వల్ల జరిగిన విధ్వంసాన్ని వివరంగా సమర్పించాల్సి ఉంది. ఈ ముఖ్యమైన భాగాన్ని పాటించకుంటే, పోలీసులు, రాష్ట్రప్రభుత్వ నివేదిక అసంపూర్ణంగానూ, అసందర్భంగానూ ఉండిపోతుంది. ఇక్కడ పోలీసుల వల్ల జరిగిన విధ్వంసం అంటే వ్యక్తిని లేక వ్యక్తులను గాయపర్చడం, చంపడం కూడా అని అర్థం. కానీ యూపీ ప్రభుత్వం ప్రైవేట్ నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని పోలీసు చర్యలను పట్టించుకోకపోవడమే పెద్ద విషాదం. సన్మార్గం కంటే మరింత సన్మార్గంతో తాను వ్యవహరిస్తున్నట్లు నటిస్తున్న యూపీ ప్రభుత్వం కొన్ని నష్టపూరిత చర్యలకు డబ్బు రూపంలో లెక్కగట్టి చూపుతోంది. కానీ ఈ తరహా నష్టాల విషయంలో పక్కా ఆధారాలను చూపించిన తర్వాతే కమిషనర్‌కు వాటిని నివేదించాల్సి ఉంది. జరిగిన నష్టాలకు వాటికి కారకులైన వారికి మధ్య సంబంధాన్ని కచ్చితంగా అంచనా వేయాల్సి ఉంటుంది.

గుజ్జర్ల నిరసన కేసులపై జరిగిన చర్చల సందర్భంగా, రెండు కమిటీలూ నేరం జరిగిన ప్రక్రియలో చోటు చేసుకున్న ఘటనలన్నింటినీ నేరవిచారణలో పొందుపర్చాలని అంగీకరించారు. జరిగిన అకృత్యాలపై సివిల్ చర్య తీసుకోవడానికి నారిమన్ కూడా మద్దతు తెలిపారు. కానీ పదేళ్ల తర్వాత కూడా అలాంటి చట్టం ఏదీ అమలులోకి రాలేదు. సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలను ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. కారణం ఒక్కటే.. ఈ మార్గదర్శకాలను అమలు చేస్తే పోలీసుల అతి చర్యలు, వేధింపులు కూడా న్యాయ పరిశీలనకు వస్తాయి. హింసాత్మక ఘటనలపై రాష్ట్రప్రభుత్వమూ ఏకపక్ష చర్య తీసుకోకూడదు.

పైగా శిక్షార్హమైన నేరచర్యలకు పాల్పడినవారిని తప్పనిసరిగా అరెస్టు చేయవలసిన అవసరం లేదని గతంలో ఏడుగురు సభ్యులతో కూడిన అలహాబాద్ హైకోర్టు పేర్కొన్న విషయాన్ని యూపీ ప్రభుత్వం తప్పకుండా గుర్తుంచుకోవాలి. కానీ తాజా ఘటనల సందర్భంగా యోగి ప్రభుత్వం 5 వేలమందిని నిర్బంధించడమే కాకుండా వారిలో వెయ్యిమందిని అరెస్టు చేసింది కూడా. ఒక్కమాటలో చెప్పాలంటే సత్పరిపాలనకు సంబంధించిన అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చర్యలు.. అమలులో ఉన్న చట్టాలన్నింటినీ దారి మళ్లించడమే కాదు.. చట్టపాలనను అవమానిస్తున్నాయని కూడా చెప్పాల్సి ఉంటుంది.


వ్యాసకర్త సీనియర్ న్యాయవాది

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### అడగాలి




"దేశ పౌరులమైన మనం కేంద్ర ప్రభుత్వాన్ని ద్రవ్యోల్బణం, వృద్ధిరేటు క్షీణత, నిరుద్యోగం, పడిపోయిన పన్ను వసూళ్లు వంటి ముఖ్యమైన అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేయాలి. ప్రాముఖ్యత లేని అంశాల జోలికి ప్రస్తుతం పోవద్దని కోరాలి" – సోనియా మినోచా, ప్రొఫెసర్

### ద్వంద్వ నీతి



"పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలో పాలుపంచుకున్నాడని చెన్నై నుంచి ఒక జర్మనీ విద్యార్థిని దేశం నుంచి పంపారు. ఇప్పుడు నార్వే పర్యాటకురాలికి సైతం అదే చవిచూపించారు. కెనడా పౌరసత్వం వున్న సినీ నటుడు అక్షయ్ కుమార్‌కు ఇలాంటి నిబంధనలు వర్తించవా? ఆయన సంఘ్ పరివార్ సంస్థల సభల్లో తరచూ పాల్గొంటున్నాడు" – ఆర్య, రచయిత్రి

### మౌనం




"రాజ్‌దీప్ సర్దేశాయ్‌ను కించపరిచేలా బీజేపీ జాతీయ ఐటీ సెల్ విభాగం చీఫ్ మాలవీయా ట్వీట్ పెడితే వేరే చానెళ్ల యాంకర్‌లెవరూ మాట్లాడరేం? ఆరేళ్లక్రితం ప్రతి ఒక్కరూ అలాంటివారి పోకడల్ని ఖండించేవారు. ఆ యాంకర్ పనిచేసే చానెల్‌లో జరిగే చర్చలకు ఇక పిలవడం మానుకునేవారు. కాలం ఎంత మారిపోయింది?!" – రోహిణి సింగ్, జర్నలిస్టు

### సిగ్గు...సిగ్గు...




"మనం ఎవరితోనైనా ముఖాముఖి మాట్లాడుతున్నప్పుడు మనలో సిగ్గుకు సంబంధించిన హార్మోన్ ఏదైనా విడుదలవుతుందేమో అని నాకు తరచూ అనిపిస్తుంటుంది. కనుకనే నేరుగా మాట్లాడితే సభ్యత, సంస్కారం పాటించేవారు కూడా సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు పంచుకుంటున్నప్పుడు మాత్రం ఎంతో దిగజారి మాట్లాడగలుగుతున్నారేమో?!" – రామచంద్ర గుహ, చరిత్రకారుడు

### గైర్హాజరు



"లైంగిక వేధింపుల కేసులు ఎదుర్కొంటున్న తమిళ సినీ గేయ రచయిత వైరముత్తుకు డాక్టరేట్ ఇచ్చే ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం ఉత్సవంలో పాల్గొనవలసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ రావడం విరమించుకున్నారు. ఇది ఆసక్తికరమైన పరిణామం" – వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

### అండర్‌టేకింగ్



"యూపీ రాజధాని లక్నోకు సమీపంలోని మూడు గ్రామాల్లో వందమంది ముస్లిం యువకుల నుంచి శాంతికి భంగం కలిగించబోమంటూ బాండ్‌లపై సంతకాలు చేయించుకున్నారు. వీరిలో ఏ ఒక్కరికీ నేర చరిత్ర లేదు. వారెవరూ సీఏఏ వ్యతిరేక ఉద్యమాల్లో పాలుపంచుకోలేదు. ఇది తమను జీవితాంతం వెన్నాడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. వీరిలో విశ్వవిద్యాలయం టాపర్ కూడా వున్నారు" – సుప్రియా శర్మ, జర్నలిస్టు

### తెలుసా?



"ప్రధాని నరేంద్ర మోదీ చాలా తరచుగా రాజ్యాంగంలోని ప్రాథమిక బాధ్యతల గురించి మాట్లాడుతూ ప్రాథమిక హక్కులతో సమానంగా వాటిని చూపుతున్నారు. ఈ ప్రాథమిక బాధ్యతల్ని ఎమర్జెన్సీ కాలంలో ఇందిరా గాంధీ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారని మీకు తెలుసో లేదో?!" – శేఖర్ గుప్తా, సీనియర్ పాత్రికేయుడు

ఇన్‌బాక్స్


## త్రిలింగ దేశానికి మూడు రాజధానులు

మూడు రాజధానుల ముచ్చటైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని చూడాలనుకుంటున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఒక వినూత్నమైన ఆలోచన. ఆంధ్ర మహావిష్ణువు పాలనలో మన రాష్ట్రం ఒకప్పుడు మూడు వైపులా మూడు శైవక్షేత్రాల (లింగాల) నడుమ రాజ్యంగా విస్తరించి త్రిలింగ రాజ్యంగా పేరొందింది. కోస్తాలో ద్రాక్షారామం, సీమలో శ్రీశైలం, ప్రస్తుత తెలంగాణాలో కాళేశ్వరం అవి. ఇప్పుడు ఏపీలో మూడు చోట్ల మూడు విభాగాల రాజధానులు నెలకొల్పాలనుకోవడం కొట్టిపారెయ్యదగ్గ ఆలోచన ఎంతమాత్రం కాదు. లోతుగా చర్చించి గమనంలోకి తీసుకోదగ్గది.

గత సీఎం బాహుబలి స్థాయి ఏకైక అంతర్జాతీయ మహానగరం రాజధానిగా కలగంటే, నేటి యువ ముఖ్యమంత్రి బహుళ నగరాల్ని రాజధానులుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని భావిస్తున్నారు. అధికార వికేంద్రీకరణ, అభివృద్ధి కార్యక్రమాల వికేంద్రీకరణ అన్నవి మంచి ఆదర్శాలే. ఆచరింపదగ్గవే. ఐతే అంతర్జాతీయ నగరం స్థాయి ప్రచారం పొందిన నగరం అతిమాములు స్థాయికి మిగిలితే కలగబోయే నష్టమెంత, లేదా జరుగుతూన్న నష్ట నివారణ ఏమేరకు అన్నది మదింపు జరగాలి. ఆదా మార్గాలూ, ఆదాయ మార్గాలూ ఎలా ఉండబోతున్నాయి, ఆయా పట్టణాలపై, ప్రాంతాలపై ఏయే ప్రభావాలు, ఏమేరకు అన్నది చర్చించాలి. వాస్తవానికి అసలు ఈ డిజిటల్ యుగంలో రాజధాని పరిమాణంగానీ, ప్రాంతంకానీ సమస్యకాదు. అమెరికాలో కూర్చుని అనకాపల్లిలో వ్యాపారం చెయ్యొచ్చు. పారిస్‌లో కూర్చొని పలాసలో వ్యవహారం నడపొచ్చు. ఇక పాలనా వ్యవహారాలు ఏమూల కూర్చొని ఏమూలనైనా జరపొచ్చు. అయితే ముఖ్యకేంద్రాలన్నవి మా ప్రాంతాలకూ ఉన్నాయి అన్న భరోసా ప్రాంతాల మధ్య వివక్షని తగ్గిస్తుంది. ఒక రాష్ట్రానికి పాలనా రాజధాని, న్యాయ రాజధాని, శాసన రాజధాని వేర్వేరుగా ఏర్పరిచే ఆలోచన మేధోమథనం చేయదగ్గది.

– డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

# అర్ధరాత్రి శపథాలు


శ్రీరమణ

రెండు రోజుల్లో పాత సంవత్సరం వెళ్లిపోయి, ఘల్లుఘల్లుమని బంగరు గజ్జెల చప్పుళ్లతో కొత్త సంవత్సరం విశ్వమంతా అడుగు పెట్టనుంది. ఈ నవ వత్సర శుభవేళ అందరికీ శుభాకాంక్షలు. డిసెంబర్ 31 అర్ధరాత్రి దాకా మేలుకుని గడచిన సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, ఆ వెంటనే వచ్చే కొత్త వత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకుంటారు. ఆశావాదులు 2020 అన్ని విధాలా లాభసాటిగా ఉంటుందని బోలెడు నమ్మకాలతో పాత సంవత్సరపు చివరి రాత్రిని గడుపుతారు. నిరాశావాదులు చప్పరింతలతో 'ఏం తేడా ఉంటుంది. అంతా మన భ్రమ తప్ప' అంటూ సందేశాలు ఇస్తుంటారు. అసలు పాత కొత్త అనే తేడా లేనే లేదు. కాలం అనేది పెద్ద దారపు బంతి అయితే, అందులో ప్రతి జానెడు నిడివి ఒక ఏడాది అంటే క్రీస్తు శకంలో 2019 జానలు అయిపోయి, తర్వాతి జాన మొదలైనట్టు అన్నమాట. ఆస్తికులు ఆ జాన సాక్షాత్తూ దేవుడిదని నమ్ముతారు. నాస్తికులు నమ్మరు. హేతువాదులు అసలు కాలాన్ని ఇంకో విధంగా నిర్వచిస్తారు. భూమి తన చుట్టూ తాను తిరగడం వల్ల రోజులు, సూర్యుడి చుట్టూ తిరగడంవల్ల సంవత్సరాలు లెక్కకు వస్తున్నాయంటారు. ప్రాణం ఉన్నప్పుడే కాలం గణనకి వస్తుంది. రాయికి, రప్పకి కాల ప్రభావం, ఆయుర్దాయం ఉండవు. ఇలా హేతు

అక్షర తూణీరం





వాదంతో అప్లయిడ్ ఫిజిక్స్‌లోకి, సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీలోకి తీసికెళ్లి చివరకు ఎన్‌సైక్లోపీడియా ఇరవై రెండో వాల్యూమ్‌లో మనల్ని నించోబెట్టి వాళ్లదారిన వాళ్లు వెళ్లిపోతారు. అందుకే హేతువాదుల వెంట నడిచేటప్పుడు ఆచితూచి అడుగులు వెయ్యండి. ఆ మధ్య కరడుగట్టిన ఓ హేతువాది బారినపడ్డా. 'మీ తాతగారు నిజంగా మీ తాతగారని గ్యారంటీ లేదు. అదొక నమ్మకం మాత్రమే. పాక్షిక సత్యం. డీఎన్ఏలు చూసి నిర్ధారించిన పూర్ణసత్యాలు కావు' అంటూ సశాస్త్రీయ తర్కంలోకి దిగాడు. నాకు మా తాతగారి మీద డౌట్ వచ్చింది. మా నాయనమ్మని అడిగా. ఆవిడ నవ్వేసి ఎవడ్రా నీకు చెప్పిన అంట్లవెధవ అని అడిగింది. మీ తాత ఛండాలపు బుద్ధులన్నీ అమర్చినట్టు నీకు వచ్చి పడ్డాయ్. ఇంతకంటే రుజువేం కావాలి' అంటూ తాతగారిని తలచుకుంటూ కంటతడి పెట్టింది.


ఈ సంధి కాలంలో, పాత కొత్తల బేసందులో అందరం ఎన్నెన్ని తీర్మానాలు చేసుకుంటామో.. ఆలోచిస్తే గుండె చెరువైపోతుంది. 'ఏ అమృత ఘడియల్లో సిగరెట్లు తాగడం అంటుకుందోగానీ నన్నది వదలడం లేదు. ఈసారి వదిలేస్తా. అదేం పెద్ద కష్టం కాదు' అంటూ శపథం చేశాడొక మిత్రుడు. 'ఏడేళ్లుగా ఈ మాటమీదే ఉన్నావ్ మిత్రమా' అంటే 'ఇన్నేళ్లు సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పుడు ఖాయం' అన్నాడు. చూడాలి. ముచ్చటగా మూడ్రోజులు ఆగితే జాతకం తెలిసిపోతుంది. కొందరు కొన్ని అలవాట్లని 'వ్యసనం'గా తీర్మానించారు. అది చాలా తప్పు. 'ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఓ క్రమశిక్షణతో నమ్ముకున్న అలవాటుని పద్ధతిగా ఆచరించడం వ్యసనం ఎట్లా అవుతుంది. అదొక కమిట్‌మెంట్' అని ఓ మహాకవి జాతికి సందేశం ఇచ్చారు. 'సిగరెట్లు మానెయ్యడం కష్టమేమీ కాదు. నేను చాలాసార్లు మానేశాను' అంటూ భరోసా ఇచ్చేవారు ఆరుద్ర. 'మీరు పైపు కాలుస్తారా... ఎందుకండీ' అని విస్తుపోతూ అడిగిన తన అభిమానికి – 'మరి పైపులున్నది కాల్చడానికే కదండీ' అని జవాబిచ్చారు. 'నేను కూడనివన్నీ మానేస్తా. కానీ జనవరి ఒకటిన కాదు. ఎప్పుడో ఇంకోప్పుడు....' అని నిర్ణయించుకున్నారు వెంకటరమణ. ఇంకోప్పుడంటే ఎప్పుడండీ అని అడిగితే, అది వ్యక్తిగత విషయం కదా అని భయపెట్టేవారు. పాత సంవత్సరంలో విశేషమైన అరిష్టం పోయి, నవ శకం ఆరంభమైందని ఎక్కువ మంది సంతోషపడుతున్నారు. అనేకానేక భరోసా పథకాలు జగన్ పాలనతో పేదముంగిళ్లకి వచ్చాయ్. పల్లెల్లో ఉద్యోగాలు విస్తృతంగా మొలకలెత్తాయి. ఇంగ్లిష్ మాటలు వినిపిస్తున్నాయ్. అప్పట్లో వాస్తు రీత్యా అమరావతి క్యాపిటల్ పరమాద్భుతం అన్నారు. మరి వాస్తు అంత ప్రశస్తంగా ఉంటే ముందుకు నడవాలి కదా, ఇట్లా గుంటపూలు పూస్తూ పునాదుల్లోనే ఆగడం ఏమిటి? 2020 శుభాకాంక్షలు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

## రగులుతున్న బస్తర్





ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే హక్కు ప్రజాస్వామ్య దేశంలో ఎవరికైనా ఉంటుంది. ఓట్ల రాజకీయాల్లో ప్రతిపక్షాలు సైతం ప్రభుత్వ చర్యలకు వత్తాసు పలుకుతున్నప్పుడు ప్రజలే ప్రత్యామ్నాయం వెతుక్కుంటారు. ఆ ప్రత్యామ్నాయ ప్రతిఘటన ఎప్పుడైనా సమాజంలోని అట్టడుగు వర్గాల నుంచే మొదలవుతుంది. దాన్ని అణచివేయడానికి ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధంగా సాధ్యం కానప్పుడు ఇతరేతర శక్తుల ద్వారా రక్తం పారించడానికి వెనుకాడదు. అలా నెత్తురోడుతున్న ప్రాంతమే బస్తర్. దాదాపు 30 ఏళ్లపాటు ఆ రణరంగంలో నిలబడి, ఆదివాసీ హక్కుల కోసం చట్టబద్ధ పోరాటం చేస్తూ నందినీ సుందర్ నమోదు చేసిన చరిత్రే 'రగులుతున్న అడవి'. ఇందులో సల్వాజుడుం అరాచకాలను ఎండగట్టిన తీరు దేశంలోని పోరాటాలకు కొత్త దిశను నిర్దేశిస్తుందని మేధావులు భావిస్తున్నారు.




(వెల: రూ 290, ప్రతులకు: స్టాల్ నెం. 304, హైదరాబాద్ బుక్ ఫెయిర్)

## కశ్మీర్ యుద్ధం




కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌పై ఆర్టికల్ 370 రద్దు చేయడంతో తన సొంత ప్రజలపైనే యుద్ధం చేస్తోందని ఎందరో ప్రగతిశీలురు దుమ్మెత్తిపోస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో సైన్యాన్ని మోహరించి, బయటి ప్రపంచంతో సంబంధాలను తెంచివేసి కశ్మీర్‌ను ఒక బహిరంగ చెరసాలగా చేసిన తీరును పలువురు ఎండగట్టారు. జాతీయంగా, అంతర్జాతీయంగా వచ్చిన అనేక ఇంగ్లిషు వ్యాసాలకు తెలుగు అనువాదాలతోపాటు, కొన్ని తెలుగు వ్యాసాలను కూడా చేర్చి సుమారు 30 విశ్లేషణాత్మక వ్యాసాలతో వెలువడిన ఈ పుస్తకాన్ని నిజానిజాలు తెలుసుకోగోరేవారు తప్పకుండా అధ్యయనం చేసి తీరాలి. – దేశరాజు

(వెల: రూ. 170, స్టాల్ నెం. 265, హైదరాబాద్ బుక్ ఫెయిర్)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899


యానిమేటర్‌గా..
స్విమ్మర్‌గా..

# బొమ్మలేసే చేతులు నదిని గెలిచాయి



**ఈమె పేరు శ్యామల గోలి. చిన్నప్పటి నుంచి చదువులో యావరేజ్.. తండ్రి ఒకటి తలిస్తే తాను ఇంకోటి నేర్చుకున్నారు. ఎవరూ ఊహించని దారి ఎంచుకున్నారు.. బొమ్మల్ని కదిలించి యానిమేటర్ అయ్యారు.. నష్టాలకు ఎదురీదారు. తన 44వ యేట స్విమ్మింగ్‌ను కెరీర్‌గా తీసుకున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించారు. ఇటీవల (డిసెంబర్ 22వ తేదీన) హుగ్లీలో పధ్నాలుగు కిలోమీటర్లు ఈది విజేతగా నిలిచారు. ఈ అన్ని విజయాల వెనక ఒక ఫెయిల్యూర్ ఇచ్చిన ప్రేరణ ఉంది. తండ్రి చెప్పిన మాట తాలూకు శక్తి ఉంది.**

శ్యామల సొంతూరు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట. మధ్యతరగతి రైతుకుటుంబం. తండ్రి కంటె వెంకటరాజు ఒకప్పుడు వెయిట్ లిఫ్టర్. చాలా రికార్డులు బ్రేక్ చేశారు. కాని తన ముగ్గురు పిల్లలను క్రీడలకు దూరంగా పెట్టారు. ఆటల్లో నెగ్గుకు రాగలరేమో కాని ఆ రంగంలోని రాజకీయాల్లో నెగ్గుకు రావడం కష్టమని.. ఆ రంగంలోని కష్టనష్టాలను చూసి, అనుభవించిన వాడిగా. వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లినప్పుడల్లా జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిల్లో ఐఏఎస్ ఆఫీసర్ల హోదా, వాళ్లకు అందే గౌరవాలు చూసి తన పెద్ద కూతురు శ్యామల (శ్యామలకు ఒక తమ్ముడు, చెల్లి)ను ఐఏఎస్ చేయాలని నిశ్చయించుకున్నాడు. శ్యామల మాత్రం అనుకోలేదు, ఆసక్తీ చూపించలేదు. అందుకే ఆమె గురించి ఇక్కడ చెప్పుకుంటున్నాం.

**పెళ్లితో కాదు.. ఆర్థిక స్వాతంత్య్రంతో..**

చదువులో అంతగా ఆసక్తిలేని శ్యామలకు మొదటి నుంచీ చిత్రలేఖనం మీదే శ్రద్ధ. హైస్కూల్లో ఉన్నప్పుడే బీఈడీ స్టూడెంట్స్ ప్రాజెక్ట్ వర్క్ కోసం కాన్సెప్ట్ డెవలప్‌చేసి.. బొమ్మలు గీసిస్తూండేవారు. పిల్లలను ఆటలకు దూరంగా ఉంచారే కాని తండ్రిగా వెంకటరాజు పిల్లలనెప్పుడూ బంధించలేదు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక్క మగపిల్లాడి మధ్య లింగవివక్షనూ చూపించలేదు. చిన్నప్పుడొకసారి శ్యామల తనకు ఇష్టమైన సినిమా నటుడి బొమ్మతో ఉన్న పేపర్‌ను పుస్తకానికి అట్టగా వేసుకుంటే చూసి ''అమ్మాయికి పెళ్లి పరమావధి కాదు.. ఆర్థిక స్వాతంత్య్రంతోనే జీవితంలో స్థిరత్వం వస్తుంది. ఇలాంటి బొమ్మలు పెళ్లి మీదకు ఆలోచనలు మళ్లిస్తాయి'' అని కూతురిని హెచ్చరించారు. ఆ మాటతో అప్పటికప్పుడు అట్టను చించనైతే చించేశారు కాని చదువు మీద ఆసక్తయితే పెంచుకోలేదు ఆమె. ఫలితం.. టెన్త్‌లో ఫెయిల్. ఆ ఫెయిల్యూరే ఆమెలో పట్టుదలను పెంచి తర్వాత విజయాలను చూపించింది. నాగార్జున యూనివర్శిటీలో ఎమ్మే సోషియాలజీ చేయించింది.

**తర్వాత..**

''ఏముంది? పెళ్లి. మా వారి పేరు మోహన్. సివిల్ ఇంజనీర్. అయితే మా నాన్న మాట మాత్రం మరచిపోలేదు''అంటూ తన జీవితంలోని తర్వాత ఘట్టం చెప్పారు శ్యామల. రెండేళ్లకు బాబు పుట్టాడు. అప్పుడు వాళ్లాయన ఉద్యోగ రీత్యా గుజరాత్‌లో ఉన్నారు. ఒకసారి సంక్రాంతి కోసమని సామర్లకోట వచ్చారు. తర్వాత రెండు నెలలకే బంధువుల పెళ్లి ఉంటే చంటిబాబుతో మళ్లీ అంతదూరం ప్రయాణం చేసి రావడం కష్టమని శ్యామలను ఊళ్లోనే ఉంచి అతను వెళ్లిపోయారు. ఆ టైమ్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు శ్యామల. కాకినాడలోని ఎరీనా మల్టీమీడియా ఇన్‌స్టిట్యూట్‌లో చేరి మల్టీమీడియా, వెబ్ డిజైనింగ్‌లో డిప్లొమా చేశారు. యేడాది కోర్స్‌ను మూడు నెలల్లో పూర్తిచేశారు శ్యామల. సరిగ్గా అప్పుడే భర్తకు బెంగళూరు బదిలీ అయింది. మకాం బెంగళూరుకు 20 కిలోమీటర్ల దూరంలోని ఓ ఊరికి మారింది.

**యానిమేషన్ సిరీస్..**

మల్టీ మీడియా, వెబ్‌డిజైనింగ్‌లో డిప్లొమా కోర్స్ ఇచ్చిన నేర్పు, నైపుణ్యంతో, తండ్రిమాటనూ ప్రాక్టికల్ చేయడానికి ఫోటో గ్రాఫిక్స్ స్టూడియో పెట్టారు. మంచి లాభాల్లో సాగుతున్నప్పుడే పిల్లాడి స్కూల్ కోసం బెంగళూరుకి షిఫ్ట్ కావల్సి వచ్చింది. ఖాళీగా కూర్చోవడం ఇష్టంలేక ఉద్యోగం కోసం వెదికారు. చిన్న యానిమేషన్ స్టూడియోలో ఉద్యోగం దొరికింది. అప్పటికే బాబు కోసం స్పైడర్ మాన్‌లాంటి యానిమేషన్ క్యారెక్టర్ ఒకటి తయారు చేయాలని పంచతంత్ర కథలను తనే రిటోల్డ్ చేసుకొని.. బొమ్మలు గీస్తూ.. గ్రాఫిక్ చేస్తూ .. వాటికి తన వాయిస్‌నే రికార్డ్ చేస్తూండేవారు ఇంట్లో.



తను పనిచేస్తున్న స్టూడియోలోనే మణిరత్నం 'బాయ్స్'సినిమాలోని ఒక పాటకు విజువల్ ఎఫెక్ట్స్ తయారు చేసిన శరత్ అనే యానిమేటర్‌తో పరిచయం అయింది ఆమెకు. ''ఆయన పనితీరు గమనిస్తూండేదాన్ని. ఆయనేమో తనను ఎక్కడ కాపీ కొడతున్నానో అనుకొని మానిటర్‌ను నాకు కనపడకుండా తిప్పుకొనేవారు. ఆనక నా వర్క్ గురించి తెలిసి కొన్ని టెక్నిక్స్ నేర్పించాడు'' అని గతాన్ని గుర్తుచేసుకున్నారు శ్యామల. తర్వాత కొద్దికాలానికే ఆ స్టూడియో మూత పడింది. కాని ఆమె ఆగలేదు. డిజిటల్ డ్రీమ్ డిజైనర్స్ పేరుతో వెబ్‌డిజైనింగ్‌లోకి అడుగిడారు ఇంట్లోనే ఆఫీస్ పెట్టుకొని. చెన్నై నుంచి సౌది అరేబియా దాకా దాదాపు రెండువందలకు పైగా దేశీ, విదేశీ ప్రాజెక్ట్‌లకు పనిచేశారు. ఈలోపు భర్తకు హైదరాబాద్‌లో మంచి అవకాశం రావడంతో అనివార్యంగా హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది ఆమె. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వెబ్‌సైట్స్‌కి పనిచేస్తూనే తన చిరకాల వాంఛ అయిన యానిమేషన్ ప్రాజెక్ట్ మీదా మనసు పెట్టారు. ఆ పైలట్ ప్రాజెక్ట్స్‌ను తీసుకొని ప్రతి టీవీ చానల్‌కు వెళ్లి డెమోస్ ఇచ్చేవారు. ఏ చానలూ స్పందించలేదు. యేడాది తర్వాత 'మా టీవీ' వాళ్లు 'మా జూనియర్స్' చానెల్‌ను ప్రారంభిస్తూ ఆమెను పిలిచారు యానిమేషన్ సిరీస్ కావాలని. అప్పుడు దొరికింది యానిమేషన్ ఫిల్మ్స్‌లో ఆమెకు బ్రేక్. పిల్లలున్న ప్రతి ఇంటికీ గోలి శ్యామల సుపరిచితులయ్యారు. ఏకైక మహిళా యానిమేషన్ సిరీస్ ప్రొడ్యూసర్‌గా దాదాపు పదేళ్లు కొనసాగారు. సొంత ప్రొడక్షన్‌లో కొన్ని ప్రయోగాలూ చేశారు. అందులో భాగంగానే లిటిల్ డ్రాగన్ అనే యానిమేషన్ మూవీ తీసి ఆర్థికంగా నష్టపోయారు. దాంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు. అది శారీరక ఆరోగ్యం మీదా ప్రభావం చూపించడంతో యానిమేషన్‌ను పాజ్ చేశారు.


**స్విమ్మింగ్‌తో..**

చిన్నప్పటి నుంచి నీళ్లంటే భయపడే శ్యామల తన ఆరోగ్యాన్ని నీటిలోనే వెదుక్కున్నారు. మూడేళ్ల కిందట ఈత నేర్చుకొని. కెరీర్‌గా మలచుకుని. 44వ యేట రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగిన పోటీలు, ఈవెంట్లలో పాల్గొని గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పాక్ జలసంధి, ఇంగ్లిష్ చానెల్‌ను దాటేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారు. ''సాధించాలనే పట్టుదలకు వయసు ఏ మాత్రం అడ్డుకాదని నన్ను ప్రోత్సహిస్తున్న కోచ్ ఆయుష్ యాదవ్‌కు కృతజ్ఞతలు. నా ప్రతి ఎఫర్ట్ నాకో కొత్త విషయాన్ని నేర్పింది. మరింత తర్ఫీదునిచ్చింది. వీటన్నింటికీ వెన్నంటే ఉన్న మా వారు, మా అబ్బాయి, మా నాన్నే నా స్ట్రెంత్. విమెన్ సేఫ్టీకి సంబంధించి ఒక యానిమేషన్ ఫిల్మ్ తీయాలనే ఆలోచన ఉంది'' అని చెప్పారు శ్యామల గోలి.

– సరస్వతి రమ

## తిరుప్పావై 13వ పాశురం

**పుళ్ళిన్ వాయ్ కీణ్డానైప్పొల్లా వరక్కనై,**
**క్కిళ్ళిక్కళైన్దానై క్కీర్తిమై పాడిప్పోయ్,**
**ప్పిళ్ళైగ ళెల్లారుమ్ పావైక్క ళమ్బుక్కార్,**
**వెళ్ళియెళు న్దువియాళముఱజ్గిత్తు,**
**పుళ్ళుమ్ శిలుమ్బిన గాణ్ పోదరి క్కణ్ణినాయ్,**
**కుళ్ళక్కుళిరక్కుడైన్దు నీరాడాదే,**
**పళ్ళిక్కిడత్తియో పావాయ్ నీనన్నాళాల్,**
**కళ్ళమ్ తవిర్ న్దు కలన్దేలో రేమ్బావాయ్.**




శ్రీవ్రతాన్ని చెయ్యబూనిన గోపికలు మరొక గోపికను మేల్కొల్పి తమతో వ్రతస్థలానికి తోడ్కొని పోవాలని ఆమె ఇంటికి చేరుకుంటారు. ఆ గోపిక ఇంకా శయ్యామందిరం నుండి బయటికి రాలేదు.

'తనను చంపవచ్చిన బకాసురుని దునిమిన శ్రీకష్ణుని స్తోత్రం చేస్తూ, మునుపటి అవతారంలో దురాత్ముడైన దశకంఠుడు రావణాసురుని సంహరించిన శ్రీరాముని స్తుతిస్తూ వ్రతనిరతులైన గోపికలు కొందరు ఈసరికే వ్రతస్థలికి చేరుకున్నారు. వారి స్తోత్రపాఠాలు నీ చెవిని పడలేదా ? గురుడు అస్తమించాడు, చుక్క పొడిచింది. ప్రకతిధర్మాన్ని అనుసరించి పక్షులు నిద్రలేచి కలకలారావాలు చేస్తున్నాయి, విను. ఓ యౌవనవతీ, హరిణేక్షణా ,తీరైన పూరెక్కల వంటి కన్నులదానా, నీ కన్నులను ఇంకా కపటనిద్దురలో మూసి ఉంచటం తగునా? నీ కొఱకు కాచుకుని మేము వెనుకబడి యున్నాము. లేచి మాతో కూడి హరినామస్మరణతో చల్లటి నీట స్నానమాడుదాము రమ్ము . మనలను ఆవరించిన మలినాలను వదిలించుకుని పరిశుద్ధులమై శ్రీవ్రతాన్ని ఆచరిద్దాము. లేకున్న మన కంటే ముందు చేరుకున్నవారికే శ్రీకష్ణ దర్శన భాగ్యం లభిస్తుంది. ఇంత శుభప్రదమైన రోజున సాక్షాత్ పరమాత్మ సాన్నిధ్యం లభించే సదవకాశాన్ని వ్యర్థం చేసి, వాస్తవాన్ని విస్మరించి స్వప్నలోకంలో కాలం గడపకు. లేచి మాతో వచ్చి చేరు'. 'స్నానం' అంటే ఇంతకు మునుపు చెప్పినట్లు 'కష్ణసంశ్లేషం' . భగవానుని చింతనలో తలమునకలుగా ఉండటమే ఆండాళ్ సూచించే స్నానం (నీరాట్టం).

– శ్రీదేవి మురళీధర్

## ముగ్గు-ముచ్చట


బి.లలితమ్మ
ఎగువపేట, వైఎస్ఆర్ జిల్లా



27 చుక్కలు
9 వరుసలు
9 కి నిలువు



**ముగ్గులు పంపవలసిన చిరునామా:**
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. muggulu.sakshi@gmail.com

# ఉన్నత శిఖరాలు సాటిలేని సామర్థ్యాలు




**శిఖరానికి కిరీటం పెడితే ఎలా ఉంటుంది? అత్యున్నతమైన పదవిలో ఒక మహిళ కూర్చుంటే ఎలా ఉంటుందో అలా ఉంటుంది! వీళ్లెవరూ పదవుల కోసం ప్రయత్నించలేదు. పదవులే వీళ్ల కోసం ప్రయత్నించాయి. పనిలో సామర్థ్యం.. అంకితభావం.. నిబద్ధత ఉంటే.. 'మీరే మమ్మల్ని లీడ్ చెయ్యాలి మేడమ్' అని గొప్ప గొప్ప సంస్థలే అప్లికేషన్ పెట్టుకుంటాయి. అలా ఈ ఏడాది 'లీడింగ్'లోకి వచ్చిన మహిళలు వీరు.**




### 1. గీతా గోపీనాథ్, ఐఎంఎఫ్ చీఫ్

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ ఎకనమిస్టుగా ప్రముఖ ప్రవాస భారతీయ ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ జనవరిలో బాధ్యతలు స్వీకరించారు. ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్టుగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా గుర్తింపు పొందారు.

### 2. సుమన్ కుమారి, పాకిస్తాన్‌లో సివిల్ జడ్జి

పాకిస్తాన్ సివిల్ న్యాయమూర్తిగా సుమన్ కుమారి జనవరిలో నియమితులయ్యారు. ఖంబర్–షాదద్కోట్ జిల్లాకు చెందిన కుమారి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఒక హిందూ మహిళ పాకిస్తాన్‌లో జడ్జి కావడం ఇదే మొదటిసారి.

### 3. ఇంద్రా నూయి, అమెజాన్ డైరెక్టర్

అమెజాన్ కంపెనీ డైరెక్టర్‌గా భారత సంతతి మహిళా ఇంద్రానూయి ఫిబ్రవరిలో బాధ్యతలు స్వీకరించారు. అమెజాన్‌లో డైరెక్టర్ అయిన రెండో మహిళగా ఇంద్రా నూయి గుర్తింపు పొందారు. ఆమెకన్నా ముందు 2019 ఫిబ్రవరి మొదటివారంలో స్టార్‌బక్స్ ఎగ్జిక్యూటివ్ రోసలిండ్ బ్రెవర్ అమెజాన్‌లో డైరెక్టర్‌గా ఉన్నారు.

### 4.జీసీ అనుపమ, ఏఎస్‌ఐ తొలి మహిళా ప్రెసిడెంట్

ఆస్ట్రానామికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) తొలి మహిళా ప్రెసిడెంట్‌గా డాక్టర్ జీసీ అనుపమ ఎన్నికయ్యారు. అనుపమ సూపర్‌నోవాపై పరిశోధనలు చేశారు.

### 5. నీలా విఖేపాటిల్, స్వీడన్ ప్రధాని సలహాదారు

స్వీడన్ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో రాజకీయ సలహాదారురాలిగా భారత సంతతికి చెందిన మహిళ, మహారాష్ట్రకు చెందిన ప్రముఖ విద్యావేత్త అశోక్ విఖే పాటిల్ కుమార్తె నీలా విఖేపాటిల్ నియమితులయ్యారు. స్వీడన్‌లో జన్మించిన నీలా గుజరాత్‌లోని అహ్మద్‌నగర్‌లో తన బాల్యాన్ని గడిపారు.

### 6. నియోమీ జహంగీర్ రావు, యూఎస్‌లో డీసీ కోర్టు జడ్జి

అమెరికాలోని ప్రఖ్యాత డిస్ట్రిక్ ఆఫ్ కొలంబియా సర్క్యూట్ కోర్టు (డీసీ కోర్టు) జడ్జిగా ప్రముఖ భారతీయ అమెరికన్ న్యాయవాది నియోమీ జహంగీర్‌రావు ఎన్నికయ్యారు.

### 7. పద్మాలక్ష్మి , యూఎన్‌డీపీ అంబాసిడర్

ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) నూతన గుడ్‌విల్ అంబాసిడర్‌గా టెలివిజన్ రంగానికి చెందిన భారత సంతతి అమెరికన్, ప్రముఖ ఆహార నిపుణురాలైన పద్మాలక్ష్మి మార్చిలో నియమితులయ్యారు.

### 8. దియామీర్జా, ఐరాస ఎస్‌డీజీ ప్రచారకర్త

ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) ప్రచారకర్తగా బాలీవుడ్ నటి దియామీర్జా ఎంపికయ్యారు. పేదరికాన్ని రూపుమాపడం; అందరికీ ఆరోగ్యసంరక్షణ తదితర లక్ష్యాల సాధనకు కృషి చేస్తుంది.

### 9. అనితా భాటియా, యూఎన్-ఉమెన్ డిప్యూటీ డైరెక్టర్

మహిళా సాధికారత, స్త్రీ–పురుష సమానత్వంపై కృషి చేసే ఐక్యరాజ్యసమితి సంస్థ యూఎన్–ఉమెన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన మహిళ అనితా భాటియా మేలో నియమితులయ్యారు. కలకత్తా లో బీఏ చదివిన అనిత వనరుల సమీకరణ, నిర్వహణలో నిష్ణాతురాలు.

### 10. ప్రమీల జయపాల్, అమెరికా తాత్కాలిక స్పీకర్

అమెరికా ప్రతినిధుల సభ తాత్కాలిక స్పీకర్‌గా ప్రమీల జయపాల్ జూన్‌లో సభా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పదవిని చేపట్టిన తొలి దక్షిణాసియా అమెరికన్ మహిళగా ప్రమీల నిలిచారు.

### 11. షలీజా ధామీ, తొలి మహిళా ఫ్లయిట్ కమాండర్

వింగ్ కమాండర్ షలీజా ధామీ భారత వాయుసేనలో తొలి మహిళా కమాండర్‌గా నిలిచారు. హెలికాప్టర్లను నడపడంలో ధామీకి 15 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది.

### 12. అంజలీ సింగ్, తొలి మహిళా సైనిక దౌత్యాధికారి

విదేశాల్లో భారత సైనిక దౌత్యాధికారిగా నియమితులైన తొలి మహిళగా వింగ్ కమాండర్ అంజలి సింగ్ రికార్డు నెలకొల్పారు. రష్యాలోని మాస్కోలో భారత రాయబార కార్యాలయంలో 'డిప్యూటీ ఎయిర్ అటాచీ'గా అంజలి సెప్టెంబరులో బాధ్యతలు స్వీకరించారు.



# నోట్లో కుకీసుకుందాం

న్యూ ఇయర్ వస్తోందంటే ఇళ్లన్నీ కేకులు, కుకీస్, బిస్కెట్లతో నిండిపోతాయి. ఒకరికి ఒకరు బహుమతిగా ఇవ్వడానికి బేకరీలకు ఆర్డర్ చేస్తుంటారు. మరి మనకు కావలసినవారికోసం స్వయంగా మనమే తయారు చేస్తే! న్యూ ఇయర్ విషెస్ చెప్పడానికి మీ స్నేహితుల ఇంటికి వెళ్లి, ఈ కుకీస్‌తో వారి నోటిని తీపి చేసి, 'హ్యాపీ న్యూ ఇయర్' చెప్పండి.

## క్రంచీ పీనట్ బటర్ కుకీస్



**కావలసినవి**

**బ్రౌన్ సుగర్** – ఒక కప్పు; **పంచదార** – ఒక కప్పు; **పీనట్ బటర్** – ఒక కప్పు; (కప్పుడు పల్లీలకు ముప్పావు కప్పు బటర్ జత చేసి, మిక్సీలో వేసి మెత్తగా చేస్తే హోమ్ మేడ్ పీనట్ బటర్ సిద్ధమైనట్లే) **కోడి గుడ్లు** – 2 (పెద్దవి); **వెనిలా ఎక్స్‌ట్రాక్ట్** – ఒక టీ స్పూను; **ఉప్పు** – పావు టీ స్పూను; **బేకింగ్ సోడా** – ఒక టీ స్పూను; **వేడి నీళ్లు** – 2 టేబుల్ స్పూన్లు; **మైదా పిండి** – 2 కప్పులు; **బటర్/నెయ్యి** – కొద్దిగా

**తయారీ**

ముందుగా అవెన్‌ను 375 డిగ్రీల దగ్గర ప్రీ హీట్ చేయాలి ● ఒక పెద్ద పాత్రలో బ్రౌన్ సుగర్, పంచదార, పీనట్ బటర్, కోడి గుడ్లు వేసి బాగా గిలకొట్టాలి (ఎలక్ట్రిక్ మిక్సర్ ఉంటే, అందులో వేసి బాగా మెత్తగా అయ్యేవరకు బ్లెండ్ చేయాలి) ● వెనిలా ఎక్స్‌ట్రాక్ట్, ఉప్పు, బేకింగ్ సోడా, వేడి నీళ్లు జత చేసి మరోమారు గిలకొట్టాలి ● మైదా పిండి జత చేసి అన్నీ కలిసేవరకు మరోమారు గిలకొట్టాలి ● కుకీస్ షీట్ లేదా అల్యూమినియం ఫాయిల్ తీసుకుని, దాని మీద బటర్ పూయాలి ● కుకీస్ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని ఫ్రిజ్‌లో సుమారు అర గంటసేపు ఫ్రీజ్ చేసి, బయటకు తీసి, చిన్న చిన్న బాల్స్‌లా చేతితో తయారుచేసి కుకీస్ షీట్ మీద ఉంచి, ప్రీ హీట్ చేసిన అవెన్‌లో ఉంచాలి ● సుమారు పావు గంట తరవాత బయటకు తీసి, చల్లారాక వాటిని గాలి చొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

## క్రిస్పీ చాకొలేట్ చిప్ కుకీస్



**కావలసినవి**

**మైదా పిండి** – రెండు కప్పులు (నిండుగా); **బేకింగ్ సోడా** – అర టీ స్పూను; **బటర్** – ఒక కప్పు; **పంచదార** – ఒక కప్పు; **ప్యాక్డ్ బ్రౌన్ సుగర్** – ఒక కప్పు; **ఉప్పు** – ఒక టీ స్పూను; **వెనిలా ఎక్స్‌ట్రాక్ట్** – 2 టీ స్పూన్లు; **కోడి గుడ్డు** – 1 (పెద్దది); **మిల్క్ చాకొలేట్ చిప్స్** – ఒక కప్పు; **డార్క్ చాకొలేట్** – అర కప్పు (సన్నగా ముక్కలు చేయాలి)

**తయారీ**

అవెన్‌ను 375 ఫారెన్ హీట్ డిగ్రీల దగ్గర ప్రీ హీట్ చేయాలి ● చిన్న పాత్రలో మైదా పిండి, ఉప్పు, బేకింగ్ సోడా వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి ● వేరొక పాత్రలో బ్రౌన్ సుగర్, పంచదార, బటర్ వేసి బ్లెండర్‌తో బాగా గిలకొట్టాలి ● పావుకప్పు నీళ్లు, వెనిలా, కోడిగుడ్డు జత చేసి మరి కాసేపు గిలకొట్టాలి ● మైదా పిండి మిశ్రమం జత చేసి బాగా గిలకొట్టాలి ● చాకొలేట్ చిప్స్ జత చేసి, సుమారు అరగంటసేపు ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి ఫ్రీజ్ చేసి, బయటకు తీసి, చిన్న చిన్న ఉండలుగా చేయాలి ● కుకీస్ షీట్ లేదా అల్యూమినియం ఫాయిల్ మీద బటర్ పూసి, ఆ పైన కుకీస్‌ను ఉంచి, ఆ షీట్‌ను అవెన్‌లో ఉంచి సుమారు పావు గంట సేపు బేక్ చేసి బయటకు తీయాలి ● బాగా చల్లారాక వీటిని గాలిచొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

## సుగర్ కుకీస్



**కావలసినవి**

**మైదా పిండి** – మూడు కప్పులకు కొద్దిగా తక్కువ **బేకింగ్ సోడా** – ఒక టీ స్పూను; **బేకింగ్ పౌడర్** – అర టీ స్పూను; **ఉప్పు** – అర టీ స్పూను; **బటర్** – ఒక కప్పు; **పంచదార** – ఒక కప్పు + 2 టేబుల్ స్పూన్లు; **బ్రౌన్ సుగర్** – 2 టేబుల్ స్పూన్లు; **కోడి గుడ్డు** – 1; **వెనిలా ఎక్స్‌ట్రాక్ట్** – 2 టీ స్పూన్లు; **పంచదార** – పావు కప్పు

**తయారీ**

ముందుగా అవెన్‌ను 350 ఫారెన్ హీట్ డిగ్రీల దగ్గర ప్రీహీట్ చేసుకోవాలి ● ఒక పాత్రలో మైదా పిండి, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి ● వేరొక పాత్రలో బటర్, బ్రౌన్ సుగర్, పంచదార వేసి బీటర్‌తో బాగా గిలకొట్టాలి ● కోడిగుడ్డు, వెనిలా జత చేసి మరోమారు బాగా గిలకొట్టాలి ● మైదా పిండి మిశ్రమం జత చేసి పదార్థాలన్నీ బాగా కలిసి మెత్తగా అయ్యేవరకు బీటర్‌తో బాగా గిలకొట్టి, ఈ మిశ్రమాన్ని అరగంటసేపు ఫ్రిజ్‌లో ఫ్రీజ్ చేసి, బయటకు తీసి, చిన్న చిన్న బాల్స్‌లా చేసుకోవాలి ● వీటి మీద మనకు నచ్చిన చిప్స్‌ను చల్లుకోవాలి ● అల్యూమినియం ఫాయిల్ లేదా కుకీస్ షీట్‌కు బటర్ పూసి, ఆ పైన ఈ కుకీస్‌ను ఉంచి, అవెన్‌లో ఉంచి సుమారు పది నిమిషాల పాటు బేక్ చేసి బయటకు తీసేయాలి ● చల్లారిన తరవాత గాలిచొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

## జింజర్ బ్రెడ్ కుకీస్



**కావలసినవి**

**బటర్** – అర కప్పు కంటె కొద్దిగా ఎక్కువ; **బ్రౌన్ సుగర్ (బ్రౌన్ సుగర్ బదులు పంచదార కూడా వాడచ్చు)** – ముప్పావు కప్పు; **మొలాసెస్ లేదా బెల్లం పాకం** – అర కప్పు కంటె కొద్దిగా ఎక్కువ **కోడి గుడ్డు** – 1; **వెనిలా ఎక్స్‌ట్రాక్ట్** – ఒక టీ స్పూను; **మైదా పిండి** – మూడున్నర కప్పులు **బేకింగ్ సోడా** – ఒక టీ స్పూను; **ఉప్పు** – అర టీ స్పూను; **అల్లం పేస్ట్** – 2 టేబుల్ స్పూన్లు; **దాల్చిన చెక్క పొడి** – ఒక టేబుల్ స్పూను; **గరం మసాలా** – అర టీ స్పూను; **లవంగాల పొడి** – అర టీ స్పూను

**తయారీ**

అవెన్‌ను 350 ఫారెన్ హీట్ డిగ్రీల దగ్గర ప్రీహీట్ చేసుకోవాలి ● ఒక పాత్రలో మైదా పిండి, బేకింగ్ సోడా, ఉప్పు, అల్లం పేస్ట్, దాల్చిన చెక్క పొడి, లవంగాల పొడి వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి ● వేరొక పాత్రలో బటర్, బ్రౌన్ సుగర్, పంచదార వేసి బాగా గిలకొట్టాలి ● బెల్లం పాకం లేదా మొలాసెస్ జత చేసి మరోమారు గిలకొట్టాలి ● కోడిగుడ్డు, వెనిలా జత చేసి బాగా కలియబెట్టాలి ● మైదా పిండి మిశ్రమం జత చేసి పదార్థాలన్నీ బాగా కలిసి మెత్తగా అయ్యేవరకు బీటర్‌తో బాగా గిలకొట్టాక ఈ మిశ్రమాన్ని ఒక రాత్రి అంతా ఫ్రిజ్‌లో ఉంచి ఫ్రీజ్ చేసి, బయటకు తీసి, చిన్న చిన్న బాల్స్ చేయాలి ● బటర్ పూసిన అల్యూమినియం ఫాయిల్ లేదా కుకీస్ షీట్ మీద ఈ బాల్స్ ఉంచి, షీట్‌ను అవెన్‌లో పది నిమిషాల పాటు బేక్ చేసి బయటకు తీసి, చల్లారాక గాలిచొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

## వైట్ చాకొలేట్ బ్లూ బెర్రీ ఓట్‌మీల్ కుకీస్



**కావలసినవి**

**బటర్** – అర కప్పు; **పంచదార** – అర కప్పు; **బ్రౌన్ సుగర్** – అర కప్పు; **కోడి గుడ్డు** – 1 (పెద్దది); **వెనిలా ఎక్స్‌ట్రాక్ట్** – 2 టీ స్పూన్లు; **మైదా పిండి** – ఒక కప్పు + 2 టేబుల్ స్పూన్లు; **కార్న్ స్టార్చ్** – 2 టీ స్పూన్లు; **ఉప్పు** – అర టీ స్పూను; **బేకింగ్ సోడా** – అర టీ స్పూను; **బేకింగ్ పౌడర్** – పావు టీ స్పూను; **ఓట్స్** – ఒక కప్పు; **వైట్ చాకొలేట్ చిప్స్** – అర కప్పు; **తాజా బ్లూబెర్రీలు** – ఒక కప్పు

**తయారీ**

ముందుగా అవెన్‌ను 350 ఫారెన్ హీట్ డిగ్రీల దగ్గర ప్రీహీట్ చేసుకోవాలి ● ఒక పాత్రలో మైదాపిండి, కార్న్ స్టార్చ్, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి ● వేరొక పాత్రలో బటర్, బ్రౌన్ సుగర్, పంచదార వేసి బీటర్‌తో బాగా గిలకొట్టాలి ● కోడిగుడ్డు జత చేసి మరోమారు బాగా గిలకొట్టాలి ● మైదా పిండి మిశ్రమం జత చేసి పదార్థాలన్నీ బాగా కలిసి మెత్తగా అయ్యేవరకు బీటర్‌తో గిలకొట్టాక, ఓట్స్, వైట్ చాకొలేట్ చిప్స్ జత చేసి, గరిటెతో జాగ్రత్తగా కలియబెట్టాలి ● చివరగా తాజా బ్లూబెర్రీలు జత చేయాలి ● చిన్న చిన్న బాల్స్‌లా చేసుకోవాలి ● అల్యూమినియం ఫాయిల్ లేదా కుకీస్ షీట్‌కు బటర్ పూసి, ఆ పైన ఈ కుకీస్‌ను ఉంచి, అవెన్‌లో ఉంచి సుమారు పది నిమిషాల పాటు బేక్ చేసి బయటకు తీసేయాలి ● చల్లారిన తరవాత గాలిచొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

---

ఫుడ్ ప్రింట్స్

# కనువిందుగా... కడుపు నిండుగా...

**ఆ హోటల్‌కు హంగు ఆర్భాటాలు ఏమీ ఉండవు. అక్కడకు చేరేదాకా ఒక హోటల్ ఉంటుందన్న భావన, మన ఆకలి తీర్చే అన్నదాత ఉంటాడన్న స్ఫురణే మనకు రాదు. ఆ హోటల్‌కు ఒకసారి విచ్చేసి భోజనం చేస్తే మాత్రం 'అన్నదాతా సుఖీభవ' అనాల్సిందే. ప్రచార పటాటోపం కన్నా, అన్నార్తుల జిహ్వాచాపల్యానికి అనుగుణంగా 24 రకాల కూరలతో సుష్టుగా భోజనం పెట్టి సంతృప్తి పరుస్తున్న నాగన్న హోటల్ ఈ వారం ఫుడ్ ప్రింట్స్...**




● కూసుమంచిలోని నాగన్న హోటల్



● 24 కూరలతో భోజనం

ఉపాధి కోసం ఉన్న ఊరు వదిలి ఎక్కడికో వెళ్లడం ఎందుకనుకున్నారు బెల్లంకొండ నాగన్న. ఖమ్మం–సూర్యాపేట ప్రధాన రహదారిలో మండల కేంద్రమైన కూసుమంచిలో 1995లో ఒక హోటల్‌ను ప్రారంభించారు. ఇంటి పట్టునే ఉండి వ్యాపారం చేసుకోమని అమ్మ ఇచ్చిన సలహాతో నాగన్న అక్కడే ఉండి, సమీప బంధువుల స్థలంలో చిన్న పూరిపాకలో హోటల్ ప్రారంభించారు. పోటీ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న తపనతో నాగన్న విస్తరినిండా కూరలు వడ్డించి ఆకలితో వచ్చేవారిని సంతృప్తి పరచాలనుకున్నారు. 24 కూరలతో కూడిన శాకాహార భోజనాన్ని రూ.10కే అందించడం ప్రారంభించారు. లాభనష్టాల గురించి ఆలోచించలేదు. వెనుకడుగు వేయకూడదన్న లక్ష్యంతో 24 ఏళ్లుగా 24 కూరల హోటల్‌ను నడుపుతూనే ఉన్నాడు.

వంటకాలను నాగన్న కుటుంబ సభ్యులే తయారు చేస్తారు. తెల్లవారు జామున ఐదు గంటలకు భార్య మణెమ్మతో కలిసి పని ప్రారంభిస్తే, మధ్యాహ్నం దాకా అదే వ్యాపకం. హోటల్‌కు ఎంతమంది వచ్చినా.. ఏ రకమైన కూరైనా భార్య మణెమ్మ వండాల్సిందే, నాగన్న వడ్డించాల్సిందే. తనకున్న పొలంలో కూరగాయలు పండిస్తూ, వాటినే హోటల్‌కు వినియోగిస్తున్నారు. సొంత పాడి నుంచి పెరుగు తయారు చేస్తారు. నాణ్యమైన భోజనానికి చిరునామాగా ఉన్న తన పేరు వినియోగదారుల హృదయాలలో పది కాలాల పాటు ఉండాలని ఆయన చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటారు. సొంత పొలంలో పండించిన ధాన్యాన్ని మర ఆడించి, ఆ బియ్యాన్ని హోటల్‌కు వినియోగిస్తున్నారు.

– **మాటేటి వేణుగోపాల్**, సాక్షిప్రతినిధి, ఖమ్మం



**మా** హోటల్ గురించి ఎక్కడా ప్రచారం ఉండదు. భోజనానికి వచ్చిన వారు మరో పదిమందికి తెలియజేయడం వల్లే వ్యాపారం ఎదుగుతోంది. మా హోటల్‌లో భోజనం చేయడానికి ఇక్కడి కూరల విశిష్టత, ప్రత్యేకత తెలుసుకున్న అనేకమంది ఇతర ప్రాంతాల నుంచి పనిగట్టుకుని వస్తారు. రాజకీయ ప్రముఖులు, అధికారులు సైతం మా వంటను చవిచూసినవారే. సినీ ప్రముఖులు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు మా హోటల్ అడ్రస్ తెలుసుకుని 24 కూరల భోజనాన్ని రుచి చూస్తుంటారు. భోజనప్రియుల జిహ్వాచాపల్యానికి అనుగుణంగా ప్రయోగాలు చేస్తుంటాం. బీట్‌రూట్‌తో కూర మాత్రమే కాదు, పచ్చడి సైతం చేసి మెప్పిస్తాం. క్యారట్, ముల్లంగి, క్యాబేజీ, టొమాటో, వంకాయ, దోసకాయ, బెండ, బీర, చిక్కుడు, గోరు చిక్కుడు, బుడమ దోస, కాకర వంటి కాయగూరలతో రోజుకో రకం తయారు చేస్తాం. జిహ్వకో రుచి, పుర్రెకో బుద్ధి అన్నట్లుగా ఎవరికి నచ్చిన కూర వారు తింటారు. అన్నీ నచ్చిన వారు తిని మరోసారి వేయమంటే నాకు కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. కాష్ కౌంటర్ దగ్గర కూర్చోవడం ఇష్టం ఉండదు. తప్పనిసరి పరిస్థితిలో మాత్రమే కూర్చుంటాను. వినియోగదారులతో కలిసి వారికి ఆనందం కలిగేలా వడ్డించడమే నాకు ఇష్టం. అందుకే నేను వాళ్లలో కలిసిపోతాను.

– **నాగన్న,**
**హోటల్ యజమాని**

---

ఆయుర్వేదం

# ఉప్పు తెచ్చే ముప్పు



**ఉ**ప్పుని శరీరానికి హితశత్రువు అనుకోవచ్చు. వంటకానికి రుచి తెప్పించి, నాలుకని ఆకర్షించి, మనిషిని తనకు బానిసగా మార్చేసుకుంటుంది ఉప్పు. ఉప్పుని సోడియం క్లోరైడ్ అంటారు. మానవ శరీరం అసంఖ్యాక కణజాల నిర్మితం. కణం లోపల ఉండే పొటాషియానికి, కణం బయట ఉండే సోడియానికి ఉండే పరిమాణ నిష్పత్తి 8:1; ఇది సృష్టి ధర్మం. ప్రకృతి దత్తమైన ఆహార పదార్థాలు అపక్వంగా ఉన్నప్పుడు వాటిలో ఉండే పొటాషియం, సోడియముల నిష్పత్తి దాదాపు 8:1 గానే ఉంటుంది. మన ఆహారసేవనలో ఈ రెంటి నిష్పత్తిని ఇలాగే కాపాడుకోవాలి. మనం వంట వండే విధానం వల్ల స్వతస్సిద్ధమైన పరిమాణాలు తారుమారవుతాయి. అంటే పొటాషియం తగ్గిపోయి, సోడియం గణనీయంగా పెరిగిపోవటం. ఇది ప్రమాదకరం. లవణాన్ని ఎక్కువ తినకూడదని ఆయుర్వేదం చెప్పింది.

**చరక సంహిత విమానస్థానంలో:** ''అథ ఖలు త్రీణి ద్రవ్యాణి న అతి ఉపయుంజీతాధికం... పిప్పలీ క్షారం లవణమితి' అంటే పిప్పళ్లు, క్షారం (కొన్ని ద్రవ్యాల నుండి వెలికి తీసిన గాఢమైన సారం), ఉప్పు ఎక్కువ తినవద్దు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం ఒక వ్యక్తికి రోజుకి 3 – 5 గ్రాముల ఉప్పు సరిపోతుంది. (బయట కొన్న ఉప్పు, ప్రకృతి ద్రవ్యాలైన పళ్లు, ఆకు కూరలు, శాకాలు, పాలు మొదలైనవి కలిపి). కాని మనం రోజుకి 15 – 20 గ్రాములు సేవిస్తున్నాం. ఇలా తినడం అనేక రోగాలకు దారి తీస్తుంది.

**పరిమిత పరిమాణంలో... వాగ్భట సంహితలో:**

**లవణం స్తంభ సంఘాత బంధ విధ్మాపనో అగ్ని కృత్**
**స్వేహనః స్వేదనః తీక్ష్ణ రోచనః ఛేద భేద కృత్ ॥**

రుచిని పెంచుతుంది. జీర్ణక్రియ త్వరగా జరుగుతుంది. శరీరంలో కొవ్వును, కంతులను కరిగించి జడత్వాన్ని పోగొడుతుంది. స్వేదాన్ని కలిగిస్తుంది.

**అతిగా సేవిస్తే అనర్థాలు**

రక్తస్రావం, దప్పిక పెరుగుతాయి. బలం నశిస్తుంది. విషతుల్యం. సంధులలో వాపు పుడుతుంది. జుత్తు నెరుస్తుంది. బట్టతల, చర్మంలో ముడతలు, ఇతర చర్మ వికారాలు కలుగుతాయి.

**సోతియుక్తో అస్రపవనం ఖలితం పలితం వలిమ్ తృట్**
**కుష్ఠ విషవిసర్పాన్ జనయేత్ క్షపయేత్ బలమ్**

శరీరంలో నీటిని నిల్వ ఉండేట్టు చేసి, ఊబకాయం, వాపులు కలుగచేస్తుంది. రక్తనాళాల లోపలి పొరను గట్టిపరచి, రక్త ప్రసరణకు అవరోధం కలిగిస్తుంది. తద్వారా బీపీ పెరిగి.. పక్షవాతం, హార్ట్ ఎటాక్, కీళ్లవాపులు వంటి వ్యాధులకు దారి తీస్తుంది. నేటి జీవనశైలి వలన ఈ వ్యాధులు కలగడానికి మరింత దోహదం చేస్తుంది.

మన రక్తంలోని గ్లూకోజ్.. కణాలలోనికి ప్రవేశించినప్పుడే శక్తి లభిస్తుంది. కణం యొక్క పొరను దాటి గ్లూకోజ్ లోపలకి వెళ్లాలంటే ఇన్సులిన్ హార్మోను అవసరం. అక్కడ ఇన్సులిన్ సక్రమంగా పనిచెయ్యాలంటే ఉప్పు తక్కువ స్థాయిలో ఉండా లి. అందువల్లే మధుమేహ రోగులు ఉప్పు తక్కువ తినాలి. ఇటీవలి కాలంలో జపాన్ శాస్త్రవేత్తలు కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు.

**ఐదు రకాల లవణాలు**

సాముద్ర లవణం (90 శాతం సోడియం క్లోరైడ్ ఉంటుంది), L¨Âf లేక రోమ లవణం (70 శాతం nacl, సైంధవ లవణం (rock salt: 70% Nac ) బిడాల లవణం (కరక్కాయ, ఉసిరికాయ వంటి కొన్ని ద్రవ్యాల సారాన్ని తీసి, ప్రత్యేకంగా తయారుచేస్తారు. 40% Nacl) సౌవర్చ లవణం (భూమిలోని లోపలి పొరలు, నదీ తీర ప్రాంతాలు దీనికి మూలాధారం. 30% Nacl)

| 100 గ్రా. మాంసంలో | పచ్చిది | వండిన తర్వాత |
|---|---|---|
| పొటాషియం | 270 మి. గ్రా. | 30 మి.గ్రా. |
| సోడియం | 33 మి. గ్రా. | 2033 |
| వీటి నిష్పత్తి | సుమారు 8:1 | 1:67 |

**తప్పించుకోవడం ఎలా?**

**నిషిద్ధం:** ఊరగాయలు, నిల్వపచ్చళ్లు, అప్పడాలు, వడియాలు, మజ్జిగ మిరపకాయలు వంటివి, ఉప్పు కారం చల్లిన వేపడాలు, డీప్ ఫ్రైలు మానేయాలి. ఉడికించిన కూరలలో నామ మాత్రం ఉప్పు అలవరచుకోవాలి. జంక్, ఫాస్ట్ ఫుడ్స్ జోలికి పోకూడదు. బజారులో ఉప్పు కొనడం తగ్గించాలి.

**సేవించవలసినవి**

ఫలాలు, డ్రై ఫ్రూట్స్, కూరగాయలు, పాలు, బీట్‌రూట్, ముల్లంగి, ఆకు కూరలు, గ్రీన్‌సలాడ్సు మొదలైనవి. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, చెరకురసం వంటివి. కాయగూరలు, పండ్లు మొదలైనవి పెస్టిసైడ్స్, కార్బైడ్స్ యొక్క విష ప్రభావాలకు గురైనవే మనకు లభిస్తున్నాయి. ఆ విషాల్ని కొంతవరకు నాశనం చేయాలంటే...

గోరువెచ్చని నీళ్లలో రెండు చెంచాలు ఉప్పు, ఒక చెంచా నిమ్మరసం వేసి అందులో కాయగూరల్ని కాని, పళ్లని కాని ఓ అరగంట నానబెట్టి, అనంతరం మంచినీటితో రెండు మూడు సార్లు కడుక్కోవాలి.

**గమనిక**

రుచుల కోసం పాకులాడితే వచ్చే రోగాలను 'రుచి రోగాలు' అంటారు. ఇవి కూడా 'సుఖరోగాల' వలే అనర్థదాయకం. ఆరోగ్యప్రదమైన కొత్త రుచులను అలవాటు చేసుకోవడానికి నాలుకకు రెండు వారాల సమయం చాలు.



– **డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి** ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
28-12-2019

యంగ్ బాలీవుడ్ - 9 / నీల్ నితిన్ ముఖేష్

# అతడే హీరో అతడే విలన్

**చూడటానికి హాలీవుడ్ నటుడిలా ఉంటాడు.**
**ఒక క్షణంలో హీరో.**
**మరు నిమిషంలో విలన్.**
**కాని ఎప్పుడూ ఆడపిల్లలు వెంటపడేలా ఉంటాడు.**
**నీల్ నితిన్ ముఖేశ్ బాలీవుడ్‌లో, సౌత్‌లో ప్రస్తుతం చాలా బిజీ ఆర్టిస్ట్.**
**పాటలు వినవచ్చే ఇంటి నుంచి వచ్చి వెండితెర మీద హంగామా సృష్టిస్తున్నాడు.**


నీల్ నితిన్ ముఖేశ్

నీల్ నితిన్ ముఖేశ్ పుట్టాక చూడటానికి ప్రఖ్యాత గాయని లతా మంగేష్కర్ వచ్చింది.

ఆమె ఎందుకు వచ్చింది?

ఎందుకంటే ఆమె అలనాటి గొప్ప గాయకుడు ముఖేశ్‌ను తన సోదరుడిలా భావిస్తుంది కనుక.

ముఖేశ్ కుమారుడు నితిన్ ముఖేశ్. నితిన్ ముఖేశ్ కొడుకు నీల్ నితిన్ ముఖేశ్.

అంటే ముఖేశ్ మనమడు నీల్ నితిన్ ముఖేశ్.

తల్లి పొత్తిళ్లలో ఉన్న నీల్‌ను చూసిన లత 'ఈ పిల్లాడు మన దేశం పిల్లాడిలా లేడు. ఏదో గ్రహం నుంచి వచ్చినట్టుగా చాలా ముద్దులొలుకుతున్నాడు. చంద్రమండలం మీద కాలు పెట్టినవాడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్. అందుకని అతని పేరు పెట్టండి' అని సూచించింది.

అలా నీల్ నితిన్ ముఖేశ్ పేరు చంద్రుడితో ముడిపడింది.

చంద్రుడిలాగే నీల్ కూడా అందగాడుగా ఎదిగాడు.

•••

నీల్ నితిన్ ముఖేశ్ కుటుంబం ఎప్పుడూ స్ట్రగుల్స్‌లోనే ఉంది. ముఖేశ్ గొప్ప గాయకుడే అయినా ప్రత్యేకమైన పాటలే అతనికి దక్కేవి. రఫీలా, కిశోర్ కుమార్‌లా అతడు అందరికీ పాడేవాడు కాదు. ఆయన తన కెరీర్‌లో స్థితిమంతుడు కాగలిగాడు కాని ఐశ్వర్యవంతుడు కాలేకపోయాడు. ఆయన కుమారుడు నితిన్ ముఖేశ్ కూడా తండ్రిలానే ప్లేబ్యాక్ సింగింగ్‌లో ప్రవేశించాడు. 'తేజాబ్'లో 'సోగయా ఏ జహా' హిట్ పాట అతడు పాడింది. 'నూరీ' సినిమాలో 'నూరీ... నూరీ' పాట కూడా అతడే పాడాడు. అయితే తండ్రి గొంతులాగే నితిన్ ముఖేశ్ గొంతు కూడా అన్ని పాటలకు సరిపోదు. ఆ కుటుంబంలో మూడో తరంలో వచ్చిన నీల్ నితిన్ ముఖేశ్ తన తాతతండ్రులకు మల్లే గాయకుడు కావాలని అనుకోలేదు. నటుడు కావాలనుకున్నాడు. కాని అది అంత సులభమా?


•••

నీల్, రణ్‌బీర్ కపూర్ కాలేజీలో కలిసి చదువుకున్నారు. రణ్‌బీర్ కపూర్ కాలేజ్‌కు వచ్చేవాడే కాని ఏనాడూ క్లాస్‌లో కూచునేవాడు కాదు. కాలేజీ బయటే అతనో కాలేజీ నడిపేవాడు తన గ్యాంగ్‌తో. నీల్‌కు ఆ గ్యాంగ్ పట్ల ఆకర్షణ ఉన్నా తన నేపథ్యం కారణాన బుద్ధిగా క్లాసుల్లో కూచునేవాడు. కాని ఆ పాఠాలు ఏమీ తలకెక్కేవి కాదు. యాక్టింగ్ నేర్చుకోవడానికి ప్రయత్నిస్తుండేవాడు. అది చూసిన రణ్‌బీర్ 'అంత కష్టపడతావెందుకు. నేను కూడా యాక్టర్నే అవుదామనుకుంటున్నాను. కాని హైరానా లేకుండా ఉన్నాను' అన్నాడు అతనితో.

దానికి నీల్ 'కరెక్ట్. నువ్వు అలాగే ఉండాలి. ఎందుకంటే నీది కపూర్ ఘరానా. మీరంతా నటులు. నాది మాధుర్ ఘరానా. మేమంతా పాటగాళ్లం. ఆ ఇంటి నుంచి వచ్చి నటుడిగా నిరూపించుకోవాలంటే చాలా కష్టపడాలి' అన్నాడు.


అన్నట్టుగా నటనలో తర్ఫీదు అయ్యాడు. అతని తీర్చిదిద్దినట్టుండే రూపం లాభించింది.












దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ అతన్ని హీరోగా పెట్టి 'జానీ గద్దార్' సినిమా తీశాడు.

•••

'జానీ గద్దార్' ఒక క్రైమ్ థ్రిల్లర్. ఒక ముఠాలో నమ్మకంగా ఉన్నట్టుగా కనిపిస్తూ ఆ ముఠాకు చెందిన డబ్బును కాజేసే కుర్రాడిగా నీల్ అందులో నటించాడు. నిజానికి అది పూర్తిగా నెగెటివిటి ఉన్న పాత్ర. నీల్ వంటి అందగాడు అంత నిర్దయమైన పాత్రను పోషిస్తే ప్రేక్షకులు రిజెక్ట్ చేసే ప్రమాదం ఉంది. కాని నీల్ తన ప్రతిభతో పాత్రను నమ్మించగలిగాడు. 'జానీ గద్దార్' పెద్ద హిట్ అయ్యింది. తర్వాత కబీర్ ఖాన్ దర్శకత్వంలో తయారైన 'న్యూయార్క్'లో ముస్లిం కుర్రాడిగా నటించాడు. న్యూయార్క్‌లో చదువుకుంటూ పార్ట్‌టైమ్‌గా క్యాబ్ నడిపే అతగాణ్ణి పోలీసులు అరెస్ట్ చేస్తారు డిక్కీలో ఆయుధాలున్నాయని. కేసు క్షణాల్లో బిగుసుకుపోతుంది. అక్కణ్ణుంచి కథ మలుపులు తిరుగుతూ పోతుంది. న్యూయార్క్ సినిమా కూడా పెద్ద హిట్ అయ్యింది. అయితే ఆ తర్వాత నీల్‌కు కాలం కలిసి రాలేదు. 'లఫంగే పరిందే', 'జైల్', 'తేరా క్యాహోగా జానీ' వంటి సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇంకో మూడు సినిమాలు అదే దారి పట్టాయి. నీల్ తన తండ్రిలా, తాతలా స్ట్రగుల్ ఎదుర్కొనాల్సి వస్తుందా అని ఆందోళన చెందాడు. సినీరంగంలో ఈ ఆందోళన సర్వసాధారణం. ఇవాళ్టి పున్నమి. రేపటి అమావాస్య.

•••

అయితే అప్పుడు సౌత్ నుంచి మురగదాస్ ఆదుకున్నాడు. విజయ్ హీరోగా చేసిన 'కత్తి'లో విలన్ వేషం ఆఫర్ చేశాడు. అది పెద్ద హిట్ అయ్యింది. 'ప్రేమ్‌రతన్ ధన్ పాయో', 'గోల్‌మాల్ అగైన్' వీటిలో వేసిన పాత్రలు, ఆ సినిమాలు హిట్ అయ్యాయి. 'ఇందు సర్కార్'లో 'సంజయ్‌గాంధీ'లా కనిపించి ఆకట్టుకున్నాడు నీల్. తెలుగులో 'కవచం', 'సాహో' సినిమాలు ఇక్కడి ప్రేక్షకులకు కూడా దగ్గర చేశాయి.

నీల్ పెళ్లి చేసుకున్నాడు. రుక్మిణి సహాయ్ అతని భార్య పేరు. ఉమ్మడి కుటుంబంలో ఉండటానికే ఇష్టపడతాడు. శారీరక దారుఢ్యం మీద చాలా శ్రద్ధ పెట్టే నీల్ కనీసం పది పదిహేనేళ్లు అన్ని భాషలలో నటించే అవకాశం ఉన్నట్టుగా కనిపిస్తున్నాడు.

మంచిగానూ చెడ్డగానూ కనిపించగల నటుల వరుసలో నీల్ టాప్ లెవల్‌లో ఉన్నాడు.

అతని విజయపరంపరకు ఇప్పుడప్పుడే ధోకా లేదు.

**– ఫీచర్స్ డెస్క్**



## రేపటి 'ఫన్‌డే'లో..!

### కటకటయోగి ఏం చేశాడో తెలుసా?

సింహపుర రాజ్యపౌరుడైన వరాహ మిహిరుని కుమార్తె వేదవతిని అపహరించాడు కటకటయోగి. సుస్వరమైన వేదనాదాన్ని మాత్రమే అన్నపానాలుగా స్వీకరించే అరుదైన వ్యక్తి వేదవతి. వరాహమిహిరుని ఖగోళ విజ్ఞానమంతా ఆమెలో మూర్తీభవించింది. అటువంటి వేదవతిని నిర్బంధించి ఆమె నుంచి వేదమయమైన ఖగోళ విజ్ఞానాన్ని సొంతం చేసుకోవాలని ప్రయత్నించాడు.

అతడి ప్రయత్నం ఫలించిందా?

ఎవరీ కపటయోగి?

*శంకర విజయం–28 (ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్ర)లో చదవండి.*



### తవ్వ చెప్పిన ముచ్చట్లు

''తుమ్మలా తుమ్మలా? రెండూ ఉన్నాయి. మీరేది చెప్పమంటే అది చెబుతాను''



అన్నది ముత్తవ్వ.

ముత్తవ్వ అంటే కేవలం అవ్వ మాత్రమే కాదు, మూర్తీభవించిన తరతరాల ముచ్చటైన చరిత్ర.

తుమ్మ అడవి కోసం జరిగిన రామరావణ యుద్ధం గురించి వెంట్రుకలు నిక్కబొడుచుకునేలా చెప్పగలదు.

ఎంత పెద్దింటి పిల్లలైనా గోచీలు పెట్టుకున్న కాలం, చిన్న పిల్లలకు ఒంటి నిండా బట్టలేమిటి?...అని విసుక్కునే కాలం, ఎర్రని రాగి డబ్బు కంటబడని కరెన్సీరహిత కాలం, గడిసెల కొద్దీ, పుట్లకొద్దీ ఇంటి నిండా దినుసులు ఉండే బంగారు కాలం, ఐదు రూపాయలు పన్ను కట్టలేక... వందల కొద్ది ఎకరాలు అమ్ముకున్న కరువు కాలం...

ఒక్కటా రెండా?

ఎన్నెన్ని ముచ్చట్లు!

***కాలాన్ని కంటి ముందు సాక్షాత్కరించిన ముచ్చట్లు... తవ్వ చెప్పిన ముచ్చట్లు... ప్రసిద్ధ రచయిత చాగంటి సోమయాజులు కథ 'బొమ్మల పెళ్లి'లో చదవండి.***

### షాట్ రెడీ!

''షాట్ రెడీ'' అనే కేక వినిపించింది. లైట్లు వెలిగాయి. యుద్ధప్రాతిపదికన కుర్రవాళ్ళు ముందూ వెనకాలా పరుగెత్తసాగారు. అంబులెన్స్, స్ట్రెచర్లు ఫీల్డ్ సమీపంలో నిలబెట్టారు. యూనిట్ కుర్రవాడు వచ్చి సోడా కొట్టి అందులోనే నిమ్మకాయ పిండి ఇచ్చాడు.



ఇప్పుడు తుఫాను చెయ్యబోయేది మామూలు స్టంటు కాదు. గ్లాస్స్ట్రైక్! కాస్త అటు ఇటు అయితే ఇక అంతే...

***వెండితెర వెలుగుల వెనుక కనిపించని కన్నీటి చీకటి 'తుఫాన్ మెయిల్'లో చదవండి.***

*ఇంకా..*

*శాస్త్రీయం శరవేగం (ముఖచిత్రకథనం), ఊర్లె ఉండకు బిడ్డా (ఇసుకచెట్టు: గల్ఫ్ కథలు), రైల్వేట్రాక్... చర్చి గంటలు (క్రైమ్ స్టోరీ), యథోచిత విందు (పురాణం), వాటితో ప్రమాదమా? (సందేహం), కొత్త సంవత్సరం శుభసూచకం (పాటతత్వం)... మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.*

---

బెస్ట్ బ్రెయిన్‌ఫుడ్

# ఇవి తినండి... గుర్తుంటుంది



మెదడు చురుగ్గా పనిచేయడానికీ, జ్ఞాపకశక్తి పదికాలాల పాటు పదిలంగా ఉండటానికి మనం తీసుకోవాల్సిన ఆహార పదార్థాల్లో మొదటివి కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ అని తెలుసుకోవాలి. ఇవి పొట్టు తీయని కాయధాన్యాల నుంచి లభ్యమవుతాయి. ఉదా: దంపుడు బియ్యం లేదా ముడిబియ్యం, పొట్టుతీయకుండా పిండి పట్టించిన గోధుమలు వంటి వాటిని కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్ల కోసం సాధారణంగా మనం తీసుకుంటూ ఉంటాం.

### ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్


మోతాదుకు మించిన కొవ్వులు మన ఒంటికీ, ఆరోగ్యానికీ మంచిది కాదన్న విషయం మనందరికీ తెలిసిందే. కానీ మెదడు చురుగ్గా పనిచేయడానికి మాత్రం ఆరోగ్యకరమైన కొవ్వులు పరిమితంగా కావాల్సిందే. మనం తీసుకునే ఆహారంలో ఒమెగా 3 ఫ్యాటీ ఆసిడ్స్, ఒమెగా 6 ఫ్యాటీ ఆసిడ్స్ వంటి వాటితో పాటు మరికొన్ని పోషకాలను ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్ అని అంటారు. ఇవి మనకు మాంసాహారం (ప్రధానంగా చికెన్), గుడ్లు, చేపలు, నట్స్, అవిశెనూనె నుంచి లభ్యమవుతాయి. కానీ ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ట్రాన్స్ ఫ్యాట్స్ అని పిలిచే హైడ్రోజనేటెడ్ కొవ్వులు మాత్రం మెదడుకు అంత మంచిది కాదు. అవి మెదడు చురుగ్గా పనిచేయడానికి అవసరమైన మంచి కొవ్వులను (అంటే ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్) అడ్డుకుంటాయి. ఇలాంటి హాని చేసే కొవ్వులకు మంచి ఉదాహరణ బిస్కెట్లు, కేకులు, బేకరీ పదార్థాలను నిల్వ చేసేందుకు వాడే కొవ్వులు. అందుకే వాటికి వీలైనంతగా దూరంగా ఉండటం మేలు.

### అమైనో ఆసిడ్స్

మెదడులోని అనేక కణాల్లో ఒకదాని నుంచి మరోదానికి సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు దోహదపడే వాటిని న్యూరోట్రాన్స్‌మిటర్స్ అంటారు. ఇదెంత వేగంగా జరిగితే మెదడు అంత చురుగ్గా పనిచేస్తుంది. ఇందుకు దోహదపడేవే 'అమైనో ఆసిడ్స్'. ఇవి ప్రోటీన్స్‌నుంచి లభ్యమవుతాయి.

### జింక్ లాంటి ఖనిజ లవణాలు, ఇతర విటమిన్లు

టీనేజర్స్‌లోనూ, యుక్తవయస్కుల్లో జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి జింక్ బాగా ఉపయోగపడుతుందన్న మాట ఎప్పట్నుంచో వాడుకలో ఉంది. ఇక జింక్ అన్నది శరీరంలోని జీవచర్యలు (మెటబాలిజమ్) సమర్థంగా జరగడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, దెబ్బతిన్న కణజాలాన్ని సమర్థంగా సరిచేయడానికి (టిష్యూ రిపేర్)కు కూడా బాగా ఉపయోగపడుతుంది.



జింక్... మాంసాహారం, సీఫుడ్స్, పాలు, గుడ్లలో కూడా ఉంటుంది. అయితే... వయస్సు పెరుగుతున్న కొద్దీ జ్ఞాపకశక్తిని కోల్పోకుండా నివారించేందుకు కేవలం జింక్ మాత్రమే కాకుండా... బీకాంప్లెక్స్‌లోని బి1, బి6, బి12 ప్రధానంగా అవసరమైవుతాయి. ఈ విటమిన్లు, యాంటాక్సిడెంట్లు ప్రధానంగా తాజా పళ్లు అంటే... ద్రాక్ష, అన్ని నిమ్మజాతి (సిట్రస్) పళ్లు, యాపిల్స్, ప్లమ్స్, బెర్రీస్, దానిమ్మ వంటివి, కూరగాయలు, ఆకుకూరలు (ఇవి పచ్చిగా తినడం లేదా ఉడికించి తినడం మంచిది), పొట్టు తీయని గోధుమ, రాగి, జొన్న, మొక్కజొన్న వంటి ధాన్యాలు, చిక్కుళ్లు, పాలు వంటి ఆహారంలో ఎక్కువగా ఉంటాయి. ఆకుపచ్చని తాజా కూరల్లో కూడా ఈ విటమిన్లు ఎక్కువగా ఉంటాయి.

ఇక వీటన్నింటితో పాటు మన మెదడు చురుగ్గా ఉండి, జ్ఞాపకశక్తి బాగుండటానికి రోజూ కనీసం మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్లు... ఇతర ద్రవాహారాలు కూడా తీసుకోవాలని గుర్తుంచుకోండి.

---

అన్నదాతల గొంతుక

# రన్ ఫర్ ఫార్మర్

**"నేను చేస్తున్న పోరాటం నా కోసం కాదు.. నేను పడుతున్న వేదన నా కుటుంబం కోసం కాదు.. నేను చేస్తున్న యుద్ధం నా ఊరి కోసం కాదు.. నా పోరాటం.. వేదన.. యుద్ధం అంతా కూడా అన్నదాత కోసం.. పదిమందికి పట్టెడన్నం పెట్టే రైతన్న కోసం.. "ఈ పోరాటంలో నా ప్రాణాలు పోయినా పర్లేదు అన్నదాత గుండెచప్పుడు ప్రభుత్వానికి వినబడితే చాలు" అంటున్నాడు ఫణీంద్ర. అన్నదాతల గోడును సర్కారీ పెద్దలకు విన్నవించాలనే సంకల్పంతో 'రన్ ఫర్ ఫార్మర్' కార్యక్రమాన్ని ప్రారంభించాడతడు. హైదరాబాద్ నుంచి అమరావతి వరకూ పరుగు పూర్తి చేశాడు. ఈ యువకుడి పరుగు కథ ఏంటో చూద్దాం.**


ఫణీంద్ర

కృష్ణా జిల్లా అప్పిగట్ల గ్రామానికి చెందిన ఫణీంద్ర పుట్టింది ఓ సాధారణ రైతు కుటుంబంలో. చిన్ననాటి నుంచి తన తండ్రి పడుతున్న కష్టాలను దగ్గర నుంచి చూశాడు. తుఫాన్ల నుంచి పండించిన పంటను రక్షించుకోలేక.. మిగిలిన పంటకు గిట్టుబాటు ధర లభించక తండ్రి పడుతున్న ఆవేదన ఫణీంద్రను కదిలించి వేసింది. తన తండ్రిలానే ప్రతి రైతు కుటుంబం ఇలానే కష్టాలు పడుతుందని తెలుసుకున్నాడు. వాళ్లకోసం ఏమైనా చేయాలని బలంగా నిర్ణయించుకున్నాడు. అయితే ఏం చేయాలో అప్పటికి అర్థం కాలేదతనికి. ఆర్థిక ఇబ్బందులతోనే ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. 2012లో సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వడానికి హైదరాబాద్‌కు వచ్చాడు. అయితే ఒకవైపు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా.. మరోవైపు మనసు మాత్రం రైతులకు ఏదో చేయాలని ఆరాట పడుతుండేది..

**ఆ కథనం చదివి..**

రైతులకోసం ఏదో చేయాలని ఉన్నా.. ఏం చేయాలో ఫణీంద్రకు దిక్కుతోచలేదు. అయితే ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు నాసిక్ నుంచి మహారాష్ట్ర వరకు రైతులు చేసిన 165 కి.మీ పాదయాత్రకు సంబంధించిన వార్త ఫణీంద్రలో ఓ వినూత్న ఆలోచనకు అంకురం వేసింది. ఆ స్ఫూర్తితో 'రన్ ఫర్ ఫార్మర్' కార్యక్రమం మొదలు పెడదామని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా జాతీయ జెండాను చేతపట్టుకుని ప్రజలలో చైతన్యం కల్పించేందుకు పరుగు మొదలుపెట్టాడు. రాష్ట్రంలో ఎక్కడ మారథన్ కార్యక్రమాలు జరిగినా అక్కడ ఫణీంద్ర ప్రత్యక్షమయ్యేవాడు. అందరూ వారి కార్యక్రమ ఉద్దేశం కోసం పరుగెడుతుంటే.. ఫణీంద్ర మాత్రం రైతు జెండా పట్టుకుని 'సేవ్ ద ఫార్మర్స్' అంటూ నినాదాలు చేసేవాడు.

**అసెంబ్లీ నుంచి అసెంబ్లీకి...**

అప్పటివరకు ఎన్నో కార్యక్రమాలలో ఫణీంద్ర పాల్గొన్నా.. ఎవరూ పట్టించుకోలేదు. ఇలా అయితే లాభం లేదనుకుని.. భగత్ సింగ్‌ను గుర్తు చేసుకుంటూ 'అసెంబ్లీ టూ అసెంబ్లీ' పరుగెత్తాలని నిర్ణయించుకున్నాడు. 2018 ఏప్రిల్‌లో మండుటెండలను లెక్కచేయకుండా.. 'రైతు కోసం పరుగు' పేరుతో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వరకు ఏకధాటిగా పరుగెత్తాడు. 325 కిలోమీటర్లను ఐదు రోజులలో పూర్తి చేసి.. అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రాలు అందజేశాడు. రైతుల బాధలు అర్థం చేసుకుని గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకున్నాడు.

**ఆడపిల్లకు రక్షణ కల్పించండి...**

ఫణీందర్ జీవితంలో ఈ ఏడాది ఓ విషాదకర సంఘటన చోటు చేసుకుంది. వరకట్న వేధింపులతో సోదరి మరణించడంతో ఫణీంద్ర కుదేలయ్యాడు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు. అప్పటివరకు రైతుకు న్యాయం జరగాలనే పోరాటం చేసిన ఫణీంద్ర.. ఆడపిల్లకు రక్షణ కల్పించేందుకు సైతం పోరాడాలని నిర్ణయించుకున్నాడు. తన చెల్లెలి పేరును టీ షర్టుపై రాయించుకుని 'ఆడపిల్లకు రక్షణ కల్పించండి..' అంటూ సరికొత్త పరుగు మొదలు పెట్టాడు.

ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే సందర్భంగా రన్ ఫర్ ఫార్మర్ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. రైతుకోసం చేస్తున్న పోరాటంలో ఫణీంద్ర తన ఉద్యోగాన్ని కూడా పోగొట్టుకున్నాడు. ప్రస్తుతం ఓ వైపు ఉద్యోగ అన్వేషణ చేస్తూనే.. మరోవైపు రన్ ఫర్ ఫార్మర్ కార్యక్రమాలు చేపడుతున్నాడు. రైతులలో చైతన్యం రావాలి... పాలకులకు రైతువాణి వినిపించాలి అంటూ అలుపెరగకుండా పరుగు పెడుతున్న ఫణీంద్ర ఆశయం సిద్ధించాలని కోరుకుందాం.

### నా ప్రాణం పోయినా పర్లేదు..

పండించిన ప్రతి గింజకు మద్దతు ధర దక్కాలి. ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాల పెంపు కోసం ధర్నాలు చేస్తుంటే.. రైతు సంఘాల పేరుతో కొందరు నాయకులు రైతు కడుపు కొడుతున్నారు. రైతుల కోసం ఏ సంఘం కూడా క్షేత్ర స్థాయిలో నిజంగా పోరాడడం లేదు. షేర్ మార్కెట్లు పడిపోయినట్లుగా రైతుల పండించిన పంట ధర పడిపోవడమేంటి..? ప్రతి కంపెనీ తాము తయారు చేసిన వస్తువుకు ఖరీదు నిర్ణయిస్తున్నప్పుడు.. తాను పండించిన పంటకు ధర నిర్ణయించుకునే రైతుకు ఎందుకు అధికారం లేదు? 2006లో స్వామినాథన్ కమిషన్ సమర్పించిన నివేదిక ఇంకా ఎందుకు అమలు కావడం లేదు? రైతుకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటా. రైతు కోసం పరుగులో నా ప్రాణం పోయినా పర్లేదు..


**– ఫణీంద్ర**


రైతులకు అవగాహన కల్పిస్తూ ఫణీంద్ర...

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
శనివారం
28-12-2019

# విజయ్ వర్మ ఉరఫ్ వైల్డ్ డాగ్

ఏసీపీ విజయ్ వర్మ.. కరడుకట్టిన క్రిమినల్స్‌ను ఎన్‌కౌంటర్ చేయడంలో స్పెషలిస్ట్. అందుకే ఆయన్ను వైల్డ్ డాగ్ అని కూడా అంటారు. విజయ్ వర్మ ఎలాంటి ఆపరేషన్లు చేపట్టారో తెలియాలంటే కాస్త టైమ్ ఉంది. నాగార్జున హీరోగా నూతన దర్శకుడు అషిహోర్ సాల్మాన్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'వైల్డ్ డాగ్'. మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ''వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నటించడం సంతోషంగా ఉంది. కొత్త టెక్నీషియన్లు, సరికొత్త ఫిల్మ్‌మేకింగ్ విధానం, కొత్త విషయాలు నేర్చుకోవడాన్ని ఆపకూడదు. 2020 ఎగ్జయిటింగ్‌గా ఉండబోతోంది'' అని ట్వీట్ చేశారు నాగార్జున. కాగా ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. వేసవిలో ఈ సినిమా విడుదల కానుందని సమాచారం. ఈ సినిమాకు కెమెరా: షానీ డియోల్, సహ నిర్మాతలు: పాషా, జగన్‌మోహన్ వంచా.


● నాగార్జున


● మారుతి, సాయి తేజ్, అల్లు అరవింద్, రావు రమేశ్, 'బన్నీ' వాస్

# ఈ విజయం ఆ ఇద్దరిదే

''ప్రతిరోజూ పండగే' సినిమా విజయం మారుతి, సాయి తేజ్‌లదే. ఈ ఇద్దరూ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులందరూ సంతోషంగా ఉన్నారు. మంచి సినిమా తీసిన యూనిట్‌ని అభినందిస్తున్నాను'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. సాయితేజ్, రాశీ ఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాస్ నిర్మించిన ఈ సినిమా విజయోత్సవం రాజమండ్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి తేజ్ మాట్లాడుతూ–''ప్రతిరోజూ పండగే' నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన సినిమా. ఇలాంటి కథను నా దగ్గరకు తీసుకొచ్చిన మారుతిగారికి థ్యాంక్స్. సత్యరాజ్‌గారి పాత్రను మర్చిపోలేను. రావు రమేశ్‌గారితో నేను చేసిన సినిమాలన్నీ సక్సెస్. ఈ సక్సెస్‌ను మెగా అభిమానులకు, తెలుగు ప్రేక్షకులకు అంకితం ఇస్తున్నా'' అన్నారు. ''ఈ కథ రాసుకున్నప్పుడు రాజమండ్రిలో చిత్రీకరించాలనుకున్నాను. సక్సెస్‌మీట్‌ను రాజమండ్రిలోనే నిర్వహించాలని షూటింగ్ అప్పుడే అనుకున్నాను.. ఇప్పుడు చేశాం'' అన్నారు మారుతి. ''తేజూ అంటే నాకు చాలా ఇష్టం. అలాంటి వ్యక్తికి ఇంత మంచి విజయం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు నిర్మాత 'బన్నీ' వాస్.


**- అల్లు అరవింద్**

# నవ్వులు పంచే సాఫ్ట్‌వేర్ సుధీర్


● రాజశేఖర్ రెడ్డి, శేఖర్ రాజు

''నాది భీమవరం దగ్గర ఒక పల్లెటూరు. హైదరాబాద్‌లో 2500 నెలసరి జీతంతో ఓ గ్లాస్ మార్ట్‌లో పనిచేశా. ఆ పనిలోని మెళకువలు నేర్చుకుని శేఖర గ్లాస్‌మార్ట్‌ను స్థాపించి ప్రస్తుతం మూడు చోట్ల 90 మంది సిబ్బందితో సంస్థని నడుపుతున్నాను'' అని నిర్మాత, నటుడు కె.శేఖర్ రాజు అన్నారు. సుడిగాలి సుధీర్, ధన్య బాలకృష్ణ జంటగా రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సాఫ్ట్‌వేర్ సుధీర్'. కె.శేఖర్ రాజు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కె.శేఖర్ రాజు మాట్లాడుతూ– ''రాజశేఖర్ రెడ్డి చెప్పిన కథ నచ్చడంతో 'సాఫ్ట్‌వేర్ సుధీర్' చిత్రం నిర్మించా. సుధీర్‌కు ఇది మంచి సినిమా అవుతుంది. ఈ ఇయర్ ఎండింగ్‌ని మా సినిమా చూస్తూ ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. రాజశేఖర్ రెడ్డి పులిచర్ల మాట్లాడుతూ– ''రైటర్‌గా నా కెరీర్ స్టార్ట్ చేశాను. 10 సంవత్సరాల క్రితం కథలు పట్టుకొని సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఫైనల్‌గా మా గురువు సంపత్ నందిగారి దగ్గర అసిస్టెంట్ రైటర్, కో డైరెక్టర్‌గా పని చేశాను. పోసాని కృష్ణమురళి, కోన వెంకట్‌గారి దగ్గర కూడా పనిచేశాను. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' చిత్రానికి రచయితగా పని చేశాను. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. కరెంట్ బర్నింగ్ ఇష్యూ పాయింట్ అందర్నీ ఆలోచింపజేస్తుంది'' అన్నారు.

# అవినీతిపై పోరాటం


● సి.హెచ్. సత్య సుమన్‌బాబు

సి.హెచ్. సత్య సుమన్‌బాబు స్వీయ దర్శకత్వంలో శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం 2గా ఓ సినిమా రూపొందనుంది. ఆయన స్వీయ దర్శకత్వంలో 'ఎర్రచీర' అనే సినిమా రూపొందిన విషయం తెలిసిందే. బేబీ డమరి సమర్పణలో రూపొందనున్న కొత్త చిత్రం జనవరి 27న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా సత్య సుమన్‌బాబు మాట్లాడుతూ– ''ఒక ఐ.ఏ.ఎస్. అధికారి రాజీలేని పోరాటం చేసి అవినీతిని ఎలా అంతమొందించారన్నదే మా సినిమా కథ. సమాజానికి మంచి సందేశాత్మక చిత్రమిది. జనవరి 27 నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్.

# నన్నెవరో ఆవహించారు!

షూటింగ్ పూర్తి చేసినప్పుడు చిత్ర యూనిట్ సభ్యులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకుంటారు. కానీ, 'ఘోస్ట్ స్టోరీస్' అనే వెబ్ సిరీస్ షూటింగ్‌ను పూర్తి చేసి 'హమ్మయ్య' అని రిలీఫ్ ఫీలవుతున్నారు జాన్వీ కపూర్. బాలీవుడ్‌లో రూపొందిన హారర్ అంథాలజీ 'ఘోస్ట్ స్టోరీస్'. ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. జాన్వీ కపూర్ విభాగానికి జోయా అక్తర్ దర్శకత్వం వహించారని తెలిసింది. 'ఘోస్ట్ స్టోరీస్'లో తన వంతు షూటింగ్‌ను పూర్తి చేసిన జాన్వీ మాట్లాడుతూ –''స్క్రిప్ట్ నన్ను బాగా ఆకట్టుకోవడంతో పాత్రలో బాగా లీనమయ్యాను. కానీ, షూటింగ్ సమయంలో చాలా భయపడ్డాను. మనిషి భావోద్వేగాల్లో భయం కూడా ఒక ముఖ్యమైనదనిపిస్తోంది. నిజం చెప్పాలంటే షూటింగ్ పూర్తయ్యేలోపు మా బృందంలోని పదిమందిలో ఎనిమిది మంది అనారోగ్యం బారినపడ్డారు. షూట్ సమయంలో నన్ను ఎవరో ఆవహించినట్లు, షూట్ తర్వాత వదిలేసిన అనుభూతికి లోనయ్యాను. ఈ 'ఘోస్ట్ స్టోరీస్' నన్ను చాలా భయపెట్టింది'' అని జాన్వీ పేర్కొన్నారు. 'ఘోస్ట్ స్టోరీస్' అంథాలజీలో ఓ భాగంలో జాన్వీ, మిగతా భాగాల్లో శోభితా ధూళిపాళ్ల, మృణాల్ ఠాకూర్ నటించారు. న్యూ ఇయర్‌కి ఈ 'ఘోస్ట్ స్టోరీస్' వీక్షకుల ముందుకు రానుంది.


● జాన్వీ కపూర్


● పూజా హెగ్డే, అల్లు అర్జున్


# వైకుంఠపురములో బుట్టబొమ్మ

'బుట్టబొమ్మ.. బుట్టబొమ్మ నన్ను సుట్టుకుంటివే.. జిందగీకే అట్టబొమ్మై జంట కట్టుకుంటివే' అని పాడుతున్నారు అల్లు అర్జున్. త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా 'అల..వైకుంఠపురములో...' చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే కథానాయిక. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్‌లో ఈ చిత్రంలోని 'బుట్టబొమ్మ' అనే పాటను అల్లు అర్జున్ , పూజలపై చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట కోసం రంగు రంగుల పూలను భారీగా వినియోగిస్తున్నారట. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను అర్మాన్‌మాలిక్ పాడారు. ఈ సినిమాకు తమన్ సంగీతదర్శకుడు. సుశాంత్, నివేతా పేతురాజ్, టబు, జయరామ్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాను అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది.

# లవర్ బాయ్ ఇమేజ్ అంటే చిరాకు


- నాగశౌర్య
● శంకర్ ప్రసాద్, ఉషా ముల్పూరి, నాగశౌర్య, రమణ తేజ


''ఛలో' సినిమా టీజర్ ఇక్కడే(రామానాయుడు ప్రివ్యూ థియేటర్) విడుదల చేశాం.. బ్లాక్ బస్టర్ అయింది. 'నర్తనశాల' టీజర్ కూడా ఇదే ప్లేస్‌లో రిలీజ్ చేశాం.. ఫ్లాప్ అయింది. ఇప్పుడు 'అశ్వథ్థామ' టీజర్‌ని కూడా ఇక్కడే రిలీజ్ చేస్తున్నాం.. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని గర్వంగా చెప్పగలను. నా తల్లిదండ్రులు గర్వంగా తలెత్తుకునేలా ఈ సినిమా చేశాను'' అని నాగశౌర్య అన్నారు. రమణ తేజని డైరెక్టర్‌గా పరిచయం చేస్తూ నాగశౌర్య, మెహరీన్ జంటగా నటించిన చిత్రం 'అశ్వథ్థామ'. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మించిన ఈ సినిమా జనవరి 31న విడుదలవుతోంది. ఈ సినిమా టీజర్‌ని హీరోయిన్ సమంత ట్విట్టర్‌లో విడుదల చేశారు. అలాగే రామానాయుడు స్టూడియోలో జరిగిన టీజర్ విడుదల కార్యక్రమంలో నాగశౌర్య మాట్లాడుతూ– ''ఢిల్లీ, ముంబైలలో అమ్మాయిలపై జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా 'అశ్వథ్థామ' కథను రాశా. 'ఛలో' కథ నేనే రాసినా పేరు వేసుకోలేదు. నాకు కథలు రాయడం, చెప్పడం ఇష్టం. నాకు లవర్ బాయ్ ఇమేజ్ అంటే చాలా చిరాకు.. అందుకే ఈ చిత్రంలో దాని నుంచి పూర్తిగా బయటికి వచ్చి రఫ్‌గా ఉండే పాత్ర చేశాను'' అన్నారు. ''నాగశౌర్య మంచి కథ రాశారు. ఈ చిత్రంలో నాగశౌర్య విశ్వరూపం చూస్తారు'' అన్నారు రమణ తేజ. ''కథని నమ్మి ఈ సినిమా తీశాం'' అన్నారు శంకర్ ప్రసాద్ ముల్పూరి. ''ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, సాంగ్స్‌కి మంచి స్పందన వస్తోంది. మా సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు ఉషా ముల్పూరి. ఈ కార్యక్రమంలో లైన్ ప్రొడ్యూసర్ బుజ్జి, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, ఎడిటర్ గ్యారీ, కెమెరామెన్ మనోజ్ రెడ్డి, డైరెక్టర్ బి.వి.యస్.రవి తదితరులు పాల్గొన్నారు.


● నితిన్

# వందల్లో ఉన్నారులే.. ఒకళ్లూ సెట్టవ్వలే!

ప్రేయసి కోసం తెగ ఆరాటపడిపోతున్నారు హీరో నితిన్ . మాటల్లో లాభం లేదని పాటలో తన భావాన్ని బయటపెట్టారు. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భీష్మ'. 'సింగిల్ ఫరెవర్' అనేది ఉప శీర్షిక. ఈ చిత్రంలో రష్మికా మందన్నా కథానాయికగా నటిస్తున్నారు. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది.. నిర్మాణ కార్యక్రమాలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. తాజాగా ఈ సినిమాలోని 'హై క్లాసు నుంచి లోక్లాసు దాకా నా క్రష్‌లులే.. వందల్లో ఉన్నారులే... ఒకళ్లూ సెట్టవ్వలే..' అనే పాటను 'సింగిల్ యాంథమ్'గా 'భీష్మ' చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ సినిమాకు మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. 'భీష్మ' చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల కానుంది.

# నేటి ట్రెండ్‌కి తగ్గ కథ


● కవిత, సుమన్

సుమన్, కవిత ప్రధాన పాత్రల్లో, అలం సందీప్, ప్రమీల జంటగా బొంతు శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఏవీ భాస్కర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా ఏవీ భాస్కర్ మాట్లాడుతూ– ''శ్రీనివాస్ చాలా క్లారిటీగా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటివరకు మంచిర్యాల, కోనసీమలో రెండు షెడ్యూల్స్ చిత్రీకరించాం. త్వరలో టైటిల్‌ను ప్రకటిస్తాం. జనవరి 24న ఆడియో విడుదలకు ప్లాన్ చేస్తున్నాం. సుమన్, కవిత గార్లతో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం బాగుంది'' అన్నారు. ''విభిన్న కథ, కథనాలతో నేటి ట్రెండ్‌కి తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుంది. పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో రెండు షెడ్యూల్స్ పూర్తి చేశాం'' అన్నారు బొంతు శ్రీనివాస్. ఈ చిత్రానికి కెమెరా: శూలం ప్రసాద్, సంగీతం: చిన్నికృష్ణ.

# నా కెరీర్ అయిపోలేదు


● నిత్యా మీనన్

సౌత్‌లో హీరోయిన్‌గా మంచి పేరు సంపాదించుకున్న నిత్యామీనన్ పదేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నారు. ఈ ఏడాది 'మిషన్ మంగళ్' సినిమాతో బాలీవుడ్‌కు కూడా ఎంట్రీ ఇచ్చారు. నటిగా ఇప్పటివరకూ ఎన్నో అవార్డులు అందుకున్నారు. అయితే జాతీయ అవార్డు మాత్రం పొందలేకపోయారు. ఈ విషయం గురించి నిత్యామీనన్ మాట్లాడుతూ – ''ఒక నటిగా జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తే చాలా సంతోషంగా ఉంటుంది. ప్రేక్షకులు మెచ్చిన మంచి సినిమాలో నేను భాగమై, అందులో నా నటనకు జాతీయ అవార్డు రావాలనుకుంటున్నాను. నాకు జాతీయ అవార్డు తెచ్చే సినిమా రొటీన్‌గా ఉండకూడదు. అలాంటి సినిమా అయితేనే చేస్తాను. అయినా నా కెరీర్ ఇంకా అయిపోలేదు. చాలా కెరీర్ ఉంది కాబట్టి తప్పకుండా ఏదో ఒక సినిమాకి జాతీయ అవార్డు సాధిస్తాననే నమ్మకం ఉంది. నన్ను నేను ఎప్పుడూ ఒక కొత్త హీరోయిన్‌లానే భావిస్తాను. యాక్టర్‌గా ఇక చాలు అని అస్సలు అనుకోను'' అని పేర్కొన్నారు. 'మిషన్ మంగళ్' తర్వాత వేరే హిందీ చిత్రం కమిట్ కాలేదు ఎందుకు? అనడిగితే – ''నాకు నచ్చే కథ కోసం ఎదురుచూస్తున్నా'' అన్నారు నిత్యామీనన్.









epaper.sakshi.com

సాక్షి స్పోర్ట్స్
శనివారం
28-12-2019

భారత క్రికెట్‌కు 2019 'గుడ్'గా సాగి 'బైబై' చెప్పింది. ఆటలో మేటి జట్టుగా టీమిండియా దూసుకెళ్లగా... వ్యక్తిగతంగానూ క్రికెటర్లు ఎన్నో మైలురాళ్లను అందుకున్నారు. కొన్ని సిరీస్‌లలో అయితే ఒకరిని మించి ఒకరు దంచేశారు. గాయాల మరకలు, కీలక ఆటగాళ్ల లోటు ఏ సిరీస్‌లోనూ కనబడలేదంటే అతిశయోక్తి కాదు. బ్యాటింగ్ ఇండియాలో బౌలింగ్ గ్రేట్ అయ్యింది ఈ ఏడాదే. కోహ్లి 'టన్'లకొద్దీ పరుగులు, రోహిత్ ప్రపంచకప్ శతకాలు, కొన్ని మచ్చుతునకలైతే... టెస్టుల్లో మయాంక్, వన్డేల్లో రాహుల్ రెగ్యులర్ ఓపెనర్లకు ఏమాత్రం తీసిపోని విధంగా ఎదిగారు.

# గ్రేట్ ఇండియన్ క్రికెట్ సిరీస్



| మ్యా | గె | ఓ | ర |
|---|---|---|---|
| 29 | 19 | 8 | 2 |

## ఇంటా గెలిచి... రచ్చా గెలిచి...

ఈ ఏడాది ప్రత్యేకించి వన్డేల్లో టీమిండియా గర్జించింది. ఎక్కడికెళ్లినా ఎదురేలేని జట్టుగా తిరిగొచ్చింది. ఇంటా బయటా కలిపి ఐదు ద్వైపాక్షిక సిరీస్‌లాడిన భారత్ నాలుగింటిని వశం చేసుకుంది. ప్రపంచకప్‌లో 10 మ్యాచ్‌ల్లో ఒకటి రద్దయితే ఏడు గెలిచింది. ఓవరాల్‌గా ఏ జట్టుకూ సాధ్యం కానీ 70 శాతం విజయాలు నమోదు చేసింది. మొదట ఆస్ట్రేలియా గడ్డపై కంగారూ పెట్టించి మరీ వన్డే క్రికెట్లో భారత్ విజయ శాసనానికి శ్రీకారం చుట్టింది. అక్కడ మూడు వన్డేల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకొని కొత్త ఏడాదికి గెలుపు రుచిని చూపించింది. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ ధోని ఆట అదరహో! తొలుత ఓడిన మ్యాచ్ సహా... వరుస వన్డేల్లో మిస్టర్‌కూల్ (51, 55 నాటౌట్, 87 నాటౌట్) అర్ధసెంచరీలతో అదరగొట్టాడు. ఆ వెంటే న్యూజిలాండ్‌కెళ్లి చితగ్గొట్టింది. ఐదు వన్డేల్లో ఒకే ఒక్క మ్యాన్ మినహా ప్రతి పోరులో పరాక్రమం చూపింది. 4–1తో కివీరెక్కలు విరిచింది. ఈ సిరీస్‌లో తెలుగు క్రికెటర్ అంబటి రాయుడు చూపించిన తెగువ క్రికెట్ విశ్లేషకుల్ని ఆకర్షించింది. ముఖ్యంగా ఆఖరి వన్డేలో రోహిత్, ధావన్, ధోనిలాంటి హేమాహేమీలు సైతం విలవిలలాడిన చోట మన రాయుడు (113 బంతుల్లో 90; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. 18 పరుగులకే 4 వికెట్లను కోల్పోయిన భారత్‌కు పెద్దదిక్కయ్యాడు. మొత్తానికి విజయగర్వంతో ఉన్న కోహ్లి సేనకు సొంతగడ్డపై ఆసీస్ చేతిలో అనూహ్య పరాజయం ఎదురైంది. ఈ యేడు భారత్ కోల్పోయిన సిరీస్ (2–3తో) ఇదొక్కటే! అనంతరం వరల్డ్‌కప్ ముగిశాక కరీబియన్ దీవులకెళ్లి మళ్లీ జయకేతనం ఎగరేసింది. అక్కడ 3వన్డేల సిరీస్‌లో తొలి వన్డే రద్దవగా తర్వాత రెండు వన్డేల్ని సునాయాసంగా గెలుచుకుంది. మళ్లీ ఇటీవల ఇక్కడికొచ్చాక కూడా వెస్టిండీస్‌ను విడిచిపెట్టలేదు. భారీస్కోర్లు చేసిమరీ 2–1తో నెగ్గింది. అయితే విండీస్ ఓడినా ఆకట్టుకుంది. ఈ క్యాలెండర్‌ను కోహ్లి రోహిత్‌లు అసాధారణ ఫామ్‌తో ముగించారు. రోహిత్ 28 మ్యాచ్‌ల్లో 57.30 సగటుతో 1490 పరుగులు చేశాడు. 7 సెంచరీలు, 6 అర్ధసెంచరీలు బాదాడు. 26 వన్డేలాడిన కెప్టెన్ 59.86 సగటుతో 1377 పరుగులు చేశాడు. 5 సెంచరీలు, 7 ఫిఫ్టీలు కొట్టాడు.

## 2019లో కోహ్లి సేన జోరు

టెస్టుల్లో అయితే భారత్‌కు ఓటమన్నదే లేదు. రెగ్యులర్ ఓపెనర్ ధావన్ లేని భారత్‌కు మయాంక్ అగర్వాల్ రూపంలో మరో నిలకడైన బ్యాట్స్‌మన్ జతయ్యాడు. పరిమిత ఓవర్ల క్రికెటర్ రోహిత్‌కు ఐదురోజుల ఆట కలిసొచ్చింది కూడా ఈ ఏడాదే. ఆస్ట్రేలియా పర్యటనలోని ఆఖరి టెస్టును డ్రా చేసుకున్న భారత్... ఆ తర్వాత ఆడితే గెలుపు తప్ప మరో ఫలితం ఎరుగదు. విండీస్ దీవుల్లో ఆడిన రెండు టెస్టుల్ని భారీతేడాతో గెలిచింది. అక్టోబర్‌లో ఇక్కడికొచ్చిన దక్షిణాఫ్రికాను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. సఫారీ జట్టుపై రెండు టెస్టులైతే ఇన్నింగ్స్‌తేడాతో గెలుపొందడం విశేషం. ఓపెనర్లుగా మయాంక్, రోహిత్ సెంచరీలు, డబుల్ సెంచరీలతో మెరిశారు. ఇక బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్ (2–0)లో భారత్‌కు రెండో ఇన్నింగ్స్ ఆడే అవకాశమే రాలేదు. రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ దెబ్బకు బంగ్లా కునారిల్లింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆడిన మూడు సిరీస్‌లూ గెలిచి అందుబాటులో ఉన్న 360 పాయింట్లను తమ ఖాతాలో వేసుకుంది.



| మ్యా | గె | ఓ | డ్రా |
|---|---|---|---|
| 8 | 7 | 0 | 1 |




## మెరుపుల్లో వెనుకబడింది

పొట్టి ఫార్మాట్‌లో మాత్రం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. న్యూజిలాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టు చేతిలో 2–1తో ఓడిన టీమిండియా... స్వదేశంలో ఆసీస్ చేతిలో 2–0తో కంగుతింది. గట్టి జట్లపై మన మెరుపులు మెరవలేదు. అయితే విండీస్ పర్యటనలో భాగంగా అమెరికాలో జరిగిన మ్యాచ్‌ల్లో మాత్రం కోహ్లి సేన చెలరేగింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. సొంతగడ్డపై సఫారీతో జరిగిన మూడు మ్యాచ్‌ల పొట్టి ఆటను 1–1తో సమం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ రద్దయింది. తర్వాత బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లతో సిరీస్‌లను 2–1తో గెలిచినప్పటికీ ఒక్కో మ్యాచ్‌లో ఎదురుదెబ్బలు తిన్నది.

| మ్యా | గె | ఓ | ర |
|---|---|---|---|
| 17 | 9 | 7 | 1 |

## సెమీస్‌లో చెదిరిన 'ప్రపంచ'కల



కోహ్లిసేన ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఫేవరెట్ జట్టుగా బరిలోకి దిగింది. విదేశీ దిగ్గజాలు, వ్యాఖ్యాతలు సైతం కప్ భారత్‌దే అని జోస్యం చెప్పారు. అయితే భారత్ కూడా ఫేవరెట్ హోదాకు సెమీస్ దాకా న్యాయం చేసింది. 9 లీగ్ మ్యాచ్‌లకు గాను ఒక్క ఆతిథ్య జట్టు చేతిలోనే ఓడింది. ఒక వన్డే రద్దయింది. ఆసీస్, దక్షిణాఫ్రికాలాంటి మేటి జట్లను అవలీలగా మట్టికరిపించి... లీగ్ టాపర్‌గా నాకౌట్ బరిలో దిగిన టీమిండియాకు ఊహించని విధంగా న్యూజిలాండ్ చేతిలో చుక్కెదురైంది. ఈ టోర్నీలో భారత ఓపెనర్ రోహిత్ శర్మ ఐదు శతకాలతో రికార్డులకెక్కాడు.

| మ్యా | గె | ఓ | ర |
|---|---|---|---|
| 10 | 7 | 2 | 1 |



## సీకే నాయుడు అవార్డుకు ఎంపికైన శ్రీకాంత్, అంజుమ్ చోప్రా

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతి యేటా ఇచ్చే ప్రతిష్టాత్మక సీకే నాయుడు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఈ ఏడాదికి గానూ భారత దిగ్గజ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, భారత మహిళల జట్టు మాజీ సారథి అంజుమ్ చోప్రాలు ఎంపికయ్యారు. ఈ మేరకు బీసీసీఐ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డును వచ్చే నెల 12వ తేదీన ముంబైలో జరిగే బోర్డు వార్షిక అవార్డుల కార్యక్రమంలో ఇవ్వనుంది. వీరిద్దరూ క్రికెట్‌కు చేసిన సేవలకు గానూ వారిని సీకే నాయుడు అవార్డుతో సత్కరిస్తున్నామని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. చెన్నైకు చెందిన శ్రీకాంత్... భారత్‌కు 1981–1992 మధ్య ప్రాతినిధ్యం వహించాడు. 43 టెస్టుల్లో 2062 పరుగులు, 146 వన్డేల్లో 4091 పరుగులు చేసిన ఈ 60 ఏళ్ల కుడి చేతి వాటం బ్యాట్స్‌మన్... భారత్ 1983లో తొలిసారి ప్రపంచ కప్ గెలిచిన జట్టు సభ్యుడు. అంతేకాకుండా అతను చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న సమయంలోనే భారత్ 2011లో రెండోసారి ప్రపంచ కప్‌ను గెల్చుకోవడం విశేషం. 1989లో ఇతని సారథ్యంలోనే సచిన్ టెండూల్కర్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఇక 42 ఏళ్ల అంజుమ్ చోప్రా తన కెరీర్‌లో 12 టెస్టులు, 127 వన్డేలు, 18 టి20లు ఆడింది.



## ఆంధ్ర 110/7

- బెంగాల్‌తో రంజీ పోరు
- డ్రా దిశగా మ్యాచ్

**కోల్‌కతా:** రంజీ ట్రోఫీలో భాగంగా బెంగాల్‌తో జరుగుతున్న పోరులో ఆంధ్ర బ్యాటింగ్ తడబడింది. మ్యాచ్ మూడో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసింది. ఓపెనర్ జ్ఞానేశ్వర్ (148 బంతుల్లో 45 బ్యాటింగ్; 4 ఫోర్లు) నిలకడగా ఆడుతుండగా.. సారథి హనుమ విహారి (23) విఫలమయ్యాడు. రికీ భుయ్ (0), శ్రీకర్ భరత్ (2) కూడా నిరాశ పరిచారు. ప్రస్తుతం జ్ఞానేశ్వర్, అయ్యప్ప (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బెంగాల్ బౌలర్ ఇషాన్ పోరెల్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆంధ్ర ఇంకా 179 పరుగులు వెనుకబడి ఉంది. చిత్తడి మైదానం, వెలుతురులేమి వంటి కారణాలతో మూడో రోజు కేవలం 46 ఓవర్ల ఆటే సాధ్యమైంది. శనివారం మ్యాచ్‌కు చివరి రోజు కావడంతో 'డ్రా'కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అయితే 3 వికెట్లు మాత్రమే చేతిలో ఉన్న ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోవడం దాదాపుగా ఖాయం అయింది.

## నిఖత్ X మేరీకోమ్

నేడు ట్రయల్స్ పోరు • గెలిస్తే ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు



నిఖత్



మేరీకోమ్

**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పోరుకు సమయం వచ్చేసింది. నేడు జరిగే బౌట్‌లో ఒలింపిక్ కాంస్య పతక విజేత, ఆరు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన మేరీకోమ్‌తో తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ తలపడనుంది. 51 కేజీల విభాగంలో వీరిద్దరి మధ్య పోటీ ఉంది. ఒలింపిక్ క్వాలిఫయింగ్ ట్రయల్స్‌లో భాగంగా ఈ ముఖాముఖీ జరగనుంది. ఇందులో గెలిచే బాక్సర్‌కే ఫిబ్రవరిలో జరిగే క్వాలిఫయర్స్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. శుక్రవారం జరిగిన తమ తొలి రౌండ్ మ్యాచ్‌లలో విజయాలు సాధించి వీరిద్దరు తుది పోరుకు సన్నద్ధమయ్యారు. నిఖత్ 10–0తో ప్రస్తుత జాతీయ చాంపియన్ జ్యోతి గులియాను, మేరీకోమ్ 10–0తో రితు గ్రేవాల్‌ను ఓడించారు.

51 కేజీలో విభాగంలో ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు భారత్‌నుంచి బాక్సర్‌ను పంపే విషయంలో వివాదం రేగడంతో మేరీకోమ్, నిఖత్ మధ్య పోటీ అనివార్యమైంది. మేరీకోమ్ ఇప్పటికే సాధించిన ఘనతలను బట్టి ఆమెనే పంపిస్తామని బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడు అజయ్ సింగ్ వ్యాఖ్యానించడంతో వివాదం మొదలైంది. మేరీకోమ్ కోసం నిబంధనలు కూడా మార్చే ప్రయత్నం చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన నిఖత్ తనకు న్యాయం చేయాలంటూ, ట్రయల్స్‌లో తన సత్తా నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కేంద్ర క్రీడా మంత్రికి లేఖ రాయడంతో సమస్య తెరపైకి వచ్చింది. ఒక దశలో ఎంతో సీనియర్ అయిన మేరీకోమ్ కూడా అసహనంతో నిఖత్‌పై పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసింది. బాక్సింగ్ వర్గాల్లో ఎక్కువ మంది నిఖత్‌కే అండగా నిలవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ట్రయల్స్‌కు సమాఖ్య ఒప్పుకుంది. ఈ పోరులో ఎవరు గెలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

## ఢిల్లీ లక్ష్యం 84

- హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్



తన్మయ్

**న్యూఢిల్లీ:** ఢిల్లీతో జరుగుతోన్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి అంచున నిలిచింది. ఫాలోఆన్ ఆడిన హైదరాబాద్ తన రెండో ఇన్నింగ్స్‌లో 70.2 ఓవర్లలో 298 పరుగులకు ఆలౌటై... 84 పరుగుల విజయలక్ష్యాన్ని ఢిల్లీ ముందుంచింది. ఢిల్లీ శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 7 ఓవర్లలో 24 పరుగులు చేసింది. కునాల్ (6), శిఖర్ ధావన్ (15) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 20/2తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్‌ను ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (154 బంతుల్లో 103; 13 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో ఆదుకున్నాడు. 97 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఇన్నింగ్స్ పరాభవం తప్పదనుకున్న స్థితిలో... తన్మయ్ టెయిలెండర్లతో పలు కీలక భాగస్వామ్యాలను నెలకొల్పాడు. తనయ్ త్యాగరాజన్ (70 బంతుల్లో 34; 6 ఫోర్లు)తో కలిసి 7వ వికెట్‌కు 93 పరుగులు... మెహదీ హసన్ (62 బంతుల్లో 71 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి 8వ వికెట్‌కు 60 పరుగులు జోడించి హైదరాబాద్‌కు ఇన్నింగ్స్ ఓటమిని తప్పించాడు. ఇషాంత్ శర్మ 4 వికెట్లతో రాణించాడు.

## ట్రవిస్ హెడ్ సెంచరీ

- ఆస్ట్రేలియా 467 ఆలౌట్



హెడ్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో శుక్రవారం ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 44 పరుగులు చేసింది. బ్లండెల్ (15), కెప్టెన్ కేన్ విలియమ్సన్ (9) వెనుదిరగ్గా... లాథమ్ (9), టేలర్ (2) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 257/4తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 467 పరుగులకు ఆలౌటైంది. ట్రవిస్ హెడ్ (234 బంతుల్లో 114; 12 ఫోర్లు) సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ టిమ్ పైన్ (138 బంతుల్లో 79; 9 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీ సాధించగా, స్టీవ్ స్మిత్ (242 బంతు ల్లో 85; 8 ఫోర్లు, 1 సిక్స్) మరో ఎనిమిది పరుగులు మాత్రమే జోడించి అవుటయ్యాడు. కివీస్ బౌలర్లలో వాగ్నర్‌కు 4 వికెట్లు దక్కాయి.

## దక్షిణాఫ్రికాకు భారీ ఆధిక్యం

- ఇంగ్లండ్‌తో తొలి టెస్టు



ఫిలాండర్

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా సఫారీ జట్టుకు 103 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌లో జో డెన్లీ (50), స్టోక్స్ (35), రూట్ (29) మాత్రమే కొద్దిగా ప్రతిఘటించగలిగారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో వెర్నాన్ ఫిలాండర్ 4 వికెట్లతో చెలరేగగా, రబడకు 3 వికెట్లు దక్కాయి. అయితే ఆ తర్వాత ఇంగ్లండ్ తమ బౌలర్ల ప్రతిభతో ప్రత్యర్థిని కట్టడి చేయగలిగింది. ఫలితంగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 72 పరుగులు చేసింది. అండర్సన్ మరో సారి తొలి ఓవర్లోనే మార్క్‌రమ్ (2)ను అవుట్ చేయగా, ఎల్గర్ (22), హమ్జా (4), డు ప్లెసిస్ (20) పెవిలియన్ చేరారు. ప్రస్తుతం వాన్ డర్ డుసెన్ (17), నోర్జే (4) క్రీజ్‌లో ఉండగా...ఓవరాల్‌గా ఆతిథ్య జట్టు 175 పరుగులు ముందంజలో ఉంది.

## దూసుకెళుతోన్న హంపి, హారిక

**మాస్కో:** ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు. టోర్నీలో ఎనిమిది రౌండ్ల అనంతరం వీరిద్దరూ 6 పాయింట్లతో సమంగా నిలిచినప్పటికీ... ర్యాంకుల్ని వర్గీకరించగా హంపి ఐదో స్థానంలో, హారిక ఎనిమిదో స్థానంలో ఉన్నారు. 6.5 పాయింట్లతో రొమేనియా ప్లేయర్ బల్మగ ఇరినా అగ్రస్థానంలో కొనసాగుతోంది. శుక్రవారం మొత్తం నాలుగు రౌండ్లు జరుగగా హంపి ఐదో గేమ్‌లో గిర్యా ఓల్గాపై గెలుపొంది, ఆరో గేమ్‌లో బల్మగ ఇరినా చేతిలో ఓడిపోయింది. ముజిచుక్ అనాతో ఏడో గేమ్‌ను డ్రా చేసుకున్న ఆమె.. ఎనిమిదో గేమ్‌లో జనిజె ననాపై గెలుపొందింది. మరోవైపు హారిక మూడు గేమ్‌ల్ని డ్రా చేసుకొని ఒక గేమ్‌లో గెలుపొందింది. గలియామోవా అలీసా (ఆరో గేమ్)పై గెలుపొందిన హారిక... కశ్లిన్‌స్కాయా అలీనా (ఐదో గేమ్), పొగోనినా నటలిజా (ఏడో గేమ్), లగ్నో కాటెరినా (ఎనిమిదో గేమ్)లతో మ్యాచ్‌ల్ని డ్రా చేసుకుంది.

## నిషేధంపై అప్పీల్ చేసిన రష్యా

**మాస్కో:** తమపై అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) విధించిన నాలుగేళ్ల నిషేధాన్ని సవాలు చేస్తూ రష్యా శుక్రవారం కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్)లో అప్పీల్ చేసింది. రష్యా డోపింగ్ నిరోధక సంస్థ (రుసాడ) తరఫున స్విట్జర్లాండ్‌కు చెందిన న్యాయ సంబంధిత షెలెన్‌బెర్గ్ విట్మర్ అనే సంస్థ కోర్టులో వాదనలు వినిపించనుంది.

సాక్షి బిజినెస్

శనివారం
28-12-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 411 ▲ | 119 ▲ |
| 41,575 | 12,246 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 9,022 | ▲ | 1 |
| డోజోన్స్ | 28,682 | ▲ | 61 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,645 | ▲ | 13 |
| డాక్స్ | 13,337 | ▲ | 36 |
| షాంఘై | 3,005 | ▼ | 2 |
| నికాయ్ | 23,838 | ▼ | 87 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.52 | 72.16 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.11 | 94.35 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.89 | 80.78 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.98 | 66.38 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.59 | 50.76 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.80 | 53.61 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.24 | 19.84 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.96 | 19.97 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.57 | 10.98 |

# ఓటీపీతో ఎస్‌బీఐ ఏటీఎంల నుంచి నగదు

- రూ. 10 వేల పైబడిన లావాదేవీలకు జనవరి 1 నుంచి అమల్లోకి
- రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు




**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ ఏటీఎంకు చీకటి పడిన తర్వాత వెళుతున్నారా..? కార్డుతోపాటు, చేతిలో మొబైల్ ఫోన్ కూడా ఉండాలి. ఎందుకంటే ఓటీపీ సాయంతోనే నగదు ఉపసంహరణ జరిగే విధానాన్ని ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా తన ఏటీఎంలలో ప్రవేశపెడుతోంది. రూ.10,000, అంతకుమించి నగదు ఉపసంహరణలకు మాత్రమే ఇది అమలవుతుంది. అది కూడా రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకే. మిగతా వేళల్లో ఇప్పటి మాదిరే ఓటీపీ లేకుండా నగదును తీసుకోవచ్చు. అలాగే, రూ.10వేల లోపు నగదును ఇక ముందూ ఓటీపీ లేకుండా రోజులో ఏ సమయంలో అయినా తీసుకోవచ్చు. జనవరి 1 నుంచే ఈ విధానం అమల్లోకి వస్తోంది.

**ఓటీపీ విధానం ఇలా..**

- కార్డును ఏటీఎం మెషీన్‌లో ఉంచి చివర్లో నగదు మొత్తాన్ని టైప్ చేసి ఓకే చేసిన తర్వాత ఖాతాదారుల రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఏటీఎం స్క్రీన్‌పై ఓటీపీ అడుగుతుంది. నంబర్‌ను ప్రవేశపెట్టడం ద్వారానే నగదు ఉపసంహరణకు వీలవుతుంది.
- ఎస్‌బీఐ ఏటీఎంలలోనే ఈ విధానం. ఎస్‌బీఐ ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నగదు ఉపసంహరణకు ఓటీపీ విధానం ఉండదు. భవిష్యత్తులో అన్ని బ్యాంకులు ఈ విధానంలోకి మళ్లితే అప్పుడు అన్ని చోట్లా ఓటీపీ అవసరపడుతుంది.
- ఖాతాదారులు తమ కార్డును పోగొట్టుకున్నా లేదా కార్డు వివరాలను మరొకరు తెలుసుకుని అనధికారికంగా, మోసపూరిత లావాదేవీలు చేద్దామనుకుంటే కుదరదు. ఎందుకంటే కచ్చితంగా ఓటీపీ ఉంటేనే పని జరుగుతుంది. దీంతో ఎస్‌బీఐ ఏటీఎం లావాదేవీలు మరింత సురక్షితంగా మారనున్నాయి.

# పూర్తిగా జూపల్లి చేతికి 'మై హోమ్'

- సీఆర్‌హెచ్ నుంచి 50 శాతం వాటా కొనుగోలు
- రూ. వెయ్యి కోట్లకు పైగా వెచ్చించిన గ్రూప్ సంస్థలు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఇప్పటిదాకా ఐర్లాండ్ ప్రధాన కేంద్రంగా ఉన్న బిల్డింగ్ మెటీరియల్ కంపెనీ సీఆర్‌హెచ్ ఇండియాతో కలిసి 50:50 భాగస్వామ్య కంపెనీగా ఉన్న 'మై హోమ్ ఇండస్ట్రీస్'ను జూపల్లి రామేశ్వరరావుకు చెందిన సంస్థలు పూర్తిగా సొంతం చేసుకోనున్నాయి. సీఆర్‌హెచ్ ఇండియాకు చెందిన 50 శాతం వాటాను మైహోమ్‌కు చెందిన నిర్మాణ సంస్థ మైహోమ్ కన్‌స్ట్రక్షన్స్, జూపల్లి రియల్ ఎస్టేట్ డెవలపర్స్, గ్రూప్ ప్రమోటరు జూపల్లి రామేశ్వర రావు కలిసి కొనుగోలు చేశారు. ఇందుకోసం వీరు దాదాపు రూ.1000 కోట్ల వరకూ వెచ్చించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనికి గురువారం కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం కూడా లభించింది.

**4 ప్లాంట్స్, 10 లక్షల టన్నులు..:** మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రస్తుతం 'మహా సిమెంట్' బ్రాండ్ పేరిట గ్రే సిమెంట్ తయారీ, సరఫరాలో ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ పాండిచ్చేరి వంటి 11 రాష్ట్రాల్లో సిమెంట్ సరఫరా చేస్తోంది. సుమారు 5 వేల మందికి పైగా డీలర్లు ఉన్నారు. 10 లక్షల టన్నుల వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. సంస్థకు తెలంగాణలోని సూర్యాపేటతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, విశాఖ జిల్లాల్లోనూ, అదేవిధంగా తమిళనాడులో కలిపి మొత్తం నాలుగు తయారీ ప్లాంట్లు ఉన్నాయి. ఇక మై హోమ్ గ్రూప్... సిమెంట్, కన్‌స్ట్రక్షన్స్, రియల్ ఎస్టేట్, పవర్, కన్సల్టెన్సీ, మీడియా, ఫార్మాసూటికల్స్, ఎడ్యుకేషన్, ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ వంటి పలు రంగాల్లో విస్తరించి ఉంది.

## కేంద్రానికి ఎల్‌ఐసీ రూ. 2,611 కోట్ల డివిడెండ్




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బీమా సంస్థ, ఎల్‌ఐసీ గత ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.2,611 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. ఈ మేరకు చెక్కును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్‌ఐసీ చైర్మన్ ఎమ్.ఆర్. కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి దేబాశిష్ పాండాలు కూడా పాల్గొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎల్‌ఐసీ 10 శాతం వృద్ధితో రూ.53,214 కోట్ల మిగులు విలువను సాధించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ట్వీట్ చేసింది. ఈ ఏడాది నవంబర్ నాటికి పాలసీల సంఖ్య పరంగా ఎల్‌ఐసీ మార్కెట్ వాటా 76.28 శాతానికి పెరిగిందని పేర్కొంది. అలాగే తొలి ఏడాది ప్రీమియమ్ కూడా 71 శాతం పెరిగిందని వివరించింది. ఎల్‌ఐసీ ఏర్పాటై ఇప్పటికి 63 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం రూ.31.11 లక్షల కోట్ల ఆస్తులను నిర్వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.5.61 లక్షల కోట్ల వార్షిక ఆదాయాన్ని ఆర్జించింది. రూ.1,42,192 కోట్ల తొలి ఏడాది ప్రీమియమ్ ఆదాయాన్ని సాధించింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక తొలి ఏడాది ప్రీమియమ్ ఆదాయం.

## విదేశీ మారకపు నిల్వల రికార్డు @ 455 బిలియన్ డాలర్లు



**ముంబై:** భారత విదేశీ మారకపు ద్రవ్య నిల్వలు డిసెంబర్ 20వ తేదీతో ముగిసిన వారంలో రికార్డు స్థాయి 454.948 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది జీవితకాల గరిష్టస్థాయి. 13వ తేదీతో ముగిసిన వారంలో 454.492 బిలియన్ డాలర్లు ఉన్న ఈ నిల్వలు వారం తిరిగేసరికి 456 మిలియన్ డాలర్లు పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు తెలిపాయి. గణాంకాల ప్రకారం...

- డాలర్ల రూపంలో పేర్కొనే ఫారిన్ కరెన్సీ అసెట్స్ విలువ 311 మిలియన్ డాలర్లు పెరిగి 422.732 బిలియన్ డాలర్లకు ఎగసింది.
- పసిడి నిల్వల విలువ 164 మిలియన్ డాలర్లు ఎగసి 27.132 బిలియన్ డాలర్లకు చేరాయి.
- అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వద్ద స్పెషల్ డ్రాయింగ్స్ రైట్స్ మిలియన్ డాలర్లు తగ్గి, 1.443 బిలియన్ డాలర్లకు పడ్డాయి.
- ఫండ్ వద్ద దేశీ నిల్వలు 17 మిలియన్ డాలర్లు తగ్గి 3.642 బిలియన్ డాలర్లకు చేరాయి.

# ఐటీ కంపెనీలకు 'బో'యింగ్

**బిలియన్ డాలర్ల వ్యాపారం ఆగిపోయే ప్రమాదం**

**'737 మ్యాక్స్' విమాన తయారీని నిలిపివేయడం వల్లే...**




**న్యూఢిల్లీ:** భారత ఐటీ కంపెనీలకు బోయింగ్ సంస్థ నుంచి వచ్చే వ్యాపారానికి గండిపడనుంది! ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ నుంచి బిలియన్ డాలర్ల వ్యాపారం ఆగిపోయే ప్రమాదం పొంచి ఉంది. బోయింగ్ తన ప్రతిష్టాత్మక 737 మ్యాక్స్ సిరీస్ విమానాల తయారీని జనవరి నుంచి నిలిపివేయనుంది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, సైయంట్, ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ ప్రస్తుతం బోయింగ్ సంస్థతో వ్యాపార అనుబంధం కలిగి ఉన్నాయి. ''చాలా భారత ఐటీ కంపెనీలకు బోయింగ్ ప్రముఖ క్లయింట్‌గా ఉంది. కనుక స్వల్పకాలంలో ఈ కంపెనీలపై తప్పక ప్రభావం ఉంటుంది. బోయింగ్ ఎదుర్కొంటున్న సమస్యల వల్ల ఏరోస్పేస్ విభాగంలో వ్యయాలు కూడా తగ్గిపోతాయి'' అని ఐటీ అవుట్‌సోర్సింగ్ అడ్వైజర్, పారీక్ కన్సల్టింగ్ వ్యవస్థాపకుడు పారీక్ జైన్ తెలిపారు. మ్యాక్స్ 737 విమాన తయారీని ఈ నెలారంభంలోనే బోయింగ్ తాత్కాలికంగా నిలిపివేయగా, జనవరి నుంచి తన సరఫరాదారులు సరఫరాను నిలిపివేయనున్నట్టు ప్రకటించింది. ఈ సంస్థ తన సీఈవో డెన్నిస్ ములెన్‌బర్గ్‌కు ఈ వారమే ఉద్వాసన కూడా పలకడం గమనార్హం. ఇండోనేసియా, ఇథియోపియాల్లో బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు కూలిపోయిన ఘటనల నేపథ్యంలో నియంత్రణ సంస్థల విశ్వాసాన్ని బోయింగ్ కోల్పోయింది. ఇదే సీఈవోను సాగనంపేందుకు దారితీసింది.

**సగం వాటా మన ఐటీ కంపెనీలదే..**

విమానయాన ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ మార్కెట్ పరిమాణం ప్రపంచవ్యాప్తంగా ఏటా 4 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. బోయింగ్, ఎయిర్‌బస్ సమానంగా వాటా కలిగి ఉన్నాయి. బోయింగ్ సంస్థ 2 బిలియన్ డాలర్ల విలువైన సేవలను అవుట్‌సోర్సింగ్ ఇస్తుండగా, ఇందులో సగానికి సగం మన దేశ ఐటీ కంపెనీలే సొంతం చేసుకుంటున్నాయి. వీటితో పాటు అస్సెంచర్, క్యాప్‌జెమినీ సంస్థలు కూడా ఈ విభాగంలో ముందున్నాయి. బోయింగ్‌కు ఇంజన్లను ప్రట్ అండ్ విట్నే, రోల్స్‌రాయిస్, జనరల్ ఎలక్ట్రిక్, శాఫ్రాన్.. విమాన విడిభాగాలను స్పిరిట్ ఏరోసిస్టమ్స్, శాఫ్రాన్ సమకూరుస్తున్నాయి. రాక్‌వెల్, హనీవెల్ సంస్థలు ఏవియోనిక్స్‌ను సమకూరుస్తున్నాయి. ''చాలా వరకు భారత ఐటీ సంస్థలు నేరుగా బోయింగ్ సంస్థతో, సరఫరా వ్యవస్థతో అనుబంధం కలిగి ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సైయంట్ నేరుగా బోయింగ్‌తో వ్యాపారం కలిగి ఉంటే, విడిభాగాల సరఫరాదారు స్పిరిట్ ఏరోసిస్టమ్ ఇన్ఫోసిస్ క్లయింట్‌గా ఉంది'' అని అవుట్‌సోర్సింగ్ మార్కెట్ ప్రముఖుడొకరు తెలిపారు.

**ఒప్పందాల్లో రక్షణ ఉంటుంది..**

''సాధారణంగా అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టుల్లో రక్షణకు సంబంధించి నిబంధనలు ఉంటాయి. రద్దు కారణంగా తలెత్తే నష్టాల నుంచి ఐటీ కంపెనీలకు రక్షణ ఉంటుంది. అయితే, స్వల్ప కాలానికి లాభదాయకతపై కచ్చితంగా ప్రభావం పడుతుంది'' అని గ్రేహౌండ్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు, సీఈవో సంచిత్‌విర్ గోగియా వివరించారు. ''ఇంజనీరింగ్ సేవల సంస్థలు మాత్రం ఇప్పటికీ ఆశావహంగానే ఉన్నాయి. ఎందుకంటే బోయింగ్ 737 మ్యాక్స్‌ను నిలిపివేస్తే, అప్పుడు 797 మోడల్‌పై అధిక వ్యయాలు చేస్తుందన్న అంచనాతో ఉన్నాయి. భారత ఇంజనీరింగ్ సేవల సంస్థలకు ఇది సానుకూలమే'' అని మరొక నిపుణుడు పేర్కొన్నారు. బోయింగ్ 797 కొత్త తరహా విమానం. ఇది 225–275 సీట్ల సైజుతో ఉంటుంది.

**బోయింగ్ సరఫరా వ్యవస్థ**

**ఇంజన్ తయారీదారులు:** ప్రట్ అండ్ విట్నే, రోల్స్‌రాయిస్, జనరల్ ఎలక్ట్రిక్, శాఫ్రాన్

**విడిభాగాల సరఫరాదారులు:** స్పిరిట్ ఏరోసిస్టమ్స్, శాఫ్రాన్

**ఏవియోనిక్స్ (ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్):** రాక్‌వెల్, హనీవెల్

**భారత కంపెనీలు:** భారత ఐటీ కంపెనీలు అప్లికేషన్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, ఇంజనీరింగ్, ఏవియోనిక్స్, బీపీఓ సేవలను బోయింగ్ 737 మ్యాక్స్ విమాన తయారీ కార్యక్రమానికి అందిస్తున్నాయి.

## 125 కోట్ల మందికి ఆధార్




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 125 కోట్ల మంది ప్రజలకు ఆధార్ ఉన్నట్లు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) వెల్లడించింది. ఆధార్‌ను ప్రాథమిక గుర్తింపు పత్రంగా ఉపయోగించడం గణనీయంగా పెరుగుతోందని పేర్కొంది. నిత్యం 3 కోట్ల పైచిలుకు ఆధార్ ఆధారిత గుర్తింపు ధృవీకరణ అభ్యర్థనలు నమోదవుతున్నాయని తెలిపింది. అలాగే ఆధార్ వివరాల అప్‌డేట్ అభ్యర్థనలు కూడా రోజుకు 3–4 లక్షల మేర వస్తున్నాయని వివరించింది.

**సీఎస్‌సీల్లో మళ్లీ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్..**

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖలో భాగమైన సీఎస్‌సీ ఈ–గవర్నెన్స్ సర్వీసెస్ సంస్థ మళ్లీ ఆధార్ రిజిస్ట్రేషన్, సంబంధిత సర్వీసులను ప్రారంభించింది. వచ్చే వారం దేశవ్యాప్తంగా వీటిని అందుబాటులోకి తేనుంది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మార్పులు.. చేర్పులు వంటి సేవలు అందించేందుకు .. యూఐడీఏఐతో సీఎస్‌సీ ఎస్‌పీవీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.6 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ).. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో ఆన్‌లైన్ ప్రభుత్వ సర్వీసులను అందిస్తున్నాయి. డేటా లీకేజీ, నిబంధనల ఉల్లంఘన ఫిర్యాదుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని సీఎస్‌సీ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సేవలు రెండేళ్ల క్రితం నిల్చిపోయాయి.

## అదానీ చేతికి స్నోమాన్




**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ కోల్డ్ చెయిన్ లాజిస్టిక్స్ రంగంలోకి ప్రవేశించింది. ఈ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్నోమాన్ లాజిస్టిక్స్‌లో 40.25 శాతం వాటాను రూ.296 కోట్లకు అదానీ లాజిస్టిక్స్ కొనుగోలు చేసింది. గేట్‌వే డిస్ట్రిపార్క్స్ నుంచి ఈ వాటా ను ఒక్కో షేర్‌ను రూ.44 ధరకు కొనుగోలు చేసింది. ఈ లావాదేవీ పూర్తి ప్రక్రియ వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తవ్వగలదని అంచనా. కోల్డ్ చెయిన్ లాజిస్టిక్స్‌లో స్నోమాన్‌దే అగ్రస్థానం.

## మూడు ప్రభుత్వరంగ బ్యాంకులకు కేంద్రం తాజా నిధులు

**ఐవోబీ, యూకో, అలహాబాద్ బ్యాంకులకు రూ.8,655 కోట్లు**




**న్యూఢిల్లీ:** నియంత్రణపరమైన అవసరాలను చేరుకునేందుకు గాను యూకో, ఇండియన్ ఓవర్సీస్, అలహాబాద్ బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం రూ.8,655 కోట్ల నిధుల సాయాన్ని అందించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపు రూపంలో బ్యాంకులకు ఈ నిధులు అందనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ నుంచి పెట్టుబడుల విషయమై బ్యాంకులకు సమాచారం అందించింది. నియంత్రణ అవసరాలకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.4,360 కోట్లు అందుకోనున్నట్టు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐవోబీ) శుక్రవారం ప్రకటించింది. ఐవోబీకి రూ.3,800 కోట్ల సాయాన్ని గత ఆగస్టులోనే ప్రభుత్వం ప్రకటించగా, ఈ సాయాన్ని మరో రూ.560 కోట్లు అధికం చేసింది. అలాగే, యూకో బ్యాంకుకు కూడా రూ.2,142 కోట్ల సాయాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం తన నిర్ణయాన్ని తెలిపింది. ఈ రెండు బ్యాంకులు ఆర్‌బీఐ కచ్చిత దిద్దుబాటు కార్యాచరణ (పీసీఏ) పరిధిలో ఉన్నాయి. ఐవోబీ సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.2,254 కోట్ల నష్టాన్ని ప్రకటించడం గమనార్హం. బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు మొత్తం రుణాల్లో 20 శాతంగా ఉన్నాయి. యూకో బ్యాంకు కూడా సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.892 కోట్ల నష్టాలను ప్రకటించింది. ప్రభుత్వం నుంచి రూ.2,153 కోట్ల ఈక్విటీ సాయాన్ని అందుకోనున్నట్టు అలహాబాద్ బ్యాంకు గురువారమే ప్రకటించింది.

# పడిపోతున్న ఆదాయంతో సవాలే..

- ద్రవ్య గణాంకాలు గతి తప్పుతాయి
- ఆర్థిక స్థిరత్వ నివేదికలో రిజర్వ్ బ్యాంక్ హెచ్చరిక




**ముంబై:** పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం ద్రవ్య గణాంకాలపై ప్రభావం చూపిస్తుందని ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. పన్ను, పన్నేతర ఆదాయం లక్ష్యాలకు దూరంగా ఉండడంతోపాటు, ప్రైవేటు పెట్టుబడులు, వినియోగం బలహీనపడడం సవాలుగా పేర్కొంది. శుక్రవారం ముంబైలో విడుదల చేసిన 25వ 'ఆర్థిక స్థిరత్వ నివేదిక'లో ఈ అంశాలను ప్రస్తావించింది. ఇన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో బలంగా ఉందని అభిప్రాయపడింది. బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు తమ బ్యాలన్స్ షీట్ల ప్రక్షాళనకు తీసుకున్న చర్యల వల్ల బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగుపడుతున్నట్టు తెలిపింది. నవంబర్ నాటికే ద్రవ్యలోటు నిర్ణీత లక్ష్యంలో 107 శాతానికి చేరిపోవడంతో.. జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతానికి పరిమితం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యంపై సందేహాలు వ్యక్తమవుతుండడం ఆర్‌బీఐ వ్యాఖ్యల్లోనూ కనిపించింది. అలాగే, జీఎస్‌టీ వసూళ్లు కూడా ఆశించిన మేర లేవు. మరోవైపు కార్పొరేట్ పన్ను కోత కారణంగా ప్రభుత్వానికి రూ.1.45 లక్షల కోట్ల ఆదాయం తగ్గిపోనుంది. ''ద్రవ్యలోటు గణాంకాలు గత కొన్నేళ్లలో మెరుగుపడ్డాయి. కానీ, ప్రైవేటు వినియోగం, పెట్టుబడులు బలహీన పడడం కారణంగా తగ్గిపోతున్న ఆదాయంతో ద్రవ్యలోటు సవాలు కాగలదు'' అని ఆర్‌బీఐ స్థిరత్వ నివేదిక పేర్కొంది.

**స్థూల ఎన్‌పీఏలు పెరగొచ్చు**

స్థూల ఆర్థిక పరిస్థితుల్లో మార్పు కారణంగా బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 2020 సెప్టెంబర్ నాటికి 9.9 శాతానికి పెరగొచ్చని ఈ నివేదిక పేర్కొంది. 2019 సెప్టెంబర్ నాటికి ఇవి 9.3 శాతంగా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న 9.3 శాతం స్థాయిలోనే స్థిరంగా ఉండడం గమనార్హం. ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 12.7 శాతం నుంచి 13.2 శాతానికి, ప్రైవేటు బ్యాంకుల్లో ఇది 3.9 శాతం నుంచి 4.2 శాతానికి.. అదే విధంగా దేశంలో పనిచేసే విదేశీ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 2.9% నుంచి 3.1 శాతానికి పెరిగే అవకాశాలున్నాయని తెలిపింది.


**ఎన్‌బీఎఫ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి**

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ఆస్తుల నాణ్యత ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో (ఏప్రిల్–సెప్టెంబర్) ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో స్థూల ఎన్‌పీఏలు 6.1 శాతం నుంచి 6.3 శాతానికి పెరిగాయని ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది. అదే సమయంలో నికర ఎన్‌పీఏలు మాత్రం స్థిరంగా 3.4 శాతం వద్దే ఉన్నాయని తెలిపింది. క్యాపిటల్ టు రిస్క్ అసెట్స్ రేషియో (సీఆర్‌ఏఆర్) నిర్దేశిత 20% కంటే తక్కువగా 19.5 శాతం వద్ద ఉంది.

**రూ.5 కోట్లు దాటితే చెప్పాలి..**

రూ.5 కోట్లు, అంతకుమించి రుణాల సమాచారాన్ని.. భారీ రుణాల కేంద్ర సమాచార కేంద్రానికి (సీఆర్‌ఐఎల్‌సీ) తెలియజేయాలని పెద్దసైజు కోపరేటివ్ బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. రూ.500 కోట్లు, అంతకుమించి ఆస్తులున్న అన్ని అర్బన్ కోపరేటివ్ బ్యాంకులను సీఆర్‌ఐఎల్‌సీ పరిధిలోకి తీసుకొస్తూ ఇటీవలే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

**పాలనను మెరుగుపరిచి వృద్ధికి తోడ్పడాలి: దాస్**



కంపెనీలు, బ్యాంకులు పాలనా ప్రమాణాలను మెరుగుపరుచుకుని, దేశ ఆర్థిక వ్యవస్థ తన పూర్తి సామర్థ్యాల మేరకు రాణించేందుకు తోడ్పడాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కోరారు. దేశ ఆర్థిక వృద్ధి ఆరేళ్ల కనిష్ట స్థాయి 4.5%కి సెప్టెంబర్ త్రైమాసికంలో పడిపోయిన విషయం విదితమే. అలాగే, చాలా కంపెనీల్లో కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో దాస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం నెలకొంది. వినియోగం, పెట్టుబడులను పునరుద్ధరించడం అన్నవి ప్రధాన సవాళ్లుగా దాస్ పేర్కొన్నారు. బోర్డుల్లో మంచి కార్పొరేట్ పరిపాలన అన్నది మన దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని చేరుకునేందుకు ముఖ్యమైన అంశమనేది తన అభిప్రాయంగా చెప్పారు. ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదిక విడుదల సందర్భంగా దాస్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## విస్తారా విమానాల్లో డేటా సర్వీసులు

- నెల్కోతో కుదిరిన ఒప్పందం
- తగిన స్పెక్ట్రమ్ కేటాయింపు



**న్యూఢిల్లీ:** విస్తార ఎయిర్‌లైన్స్ కంపెనీ త్వరలోనే తన విమానాల్లో డేటా సర్వీసులను అందించనున్నది. భారత్‌లో విమానాల్లో డేటా సర్వీసులను అందించనున్న తొలి విమానయాన సంస్థ విస్తార కానున్నది. విమానాల్లో డేటా సర్వీసులను అందించడం కోసం విస్తార కంపెనీ టాటా గ్రూప్‌నకు చెందిన నెల్కోతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని కోసం ఈ సంస్థలు ఇస్రో నుంచి ఒక ట్రాన్స్‌పాండర్‌ను తీసుకున్నాయని, దీనికి అవసరమైన స్పెక్ట్రమ్‌ను కేటాయించాలని తమను కోరాయని టెలికం కార్యదర్శి అన్షు ప్రకాశ్ తెలిపారు. ఈ సంస్థలు కోరిన స్పెక్ట్రమ్‌ను కేటాయించామని, వీలైనంత త్వరలోనే విస్తార విమానయాన సంస్థ, తన విమానాల్లో డేటా సర్వీసులను అందించనున్నదని ఆయన వివరించారు.

**డేటా సర్వీసులే ముందు...**

వాయిస్ కాల్స్ కంటే ముందు డేటా సేవలు అందుబాటులోకి వస్తాయని, దీంతో ఓవర్–ద–టాప్(ఓటీసీ) సేవలు పొందవచ్చని, వాట్సాప్ కాల్స్ చేసుకోవచ్చని ప్రకాశ్ పేర్కొన్నారు. వీటి టారిఫ్‌ల నియంత్రణ ప్రభుత్వ పరిధిలో ఉండదని తెలిపారు. ఈ సేవలను ఉచితంగా అందించాలో, లేదా డబ్బులు వసూలు చేయాలో ఆ యా సంస్థలే నిర్ణయిస్తాయని వివరించారు. కాగా విమానాల్లో డేటా సర్వీసులను ఎప్పటి నుంచి అందుబాటులోకి తెచ్చేది ఇంకా ఖరారు చేయలేదని విస్తార ప్రతినిధి పేర్కొన్నారు. 2015లో కార్యకలాపాలు ప్రారంభించిన విస్తార ప్రస్తుతం 39 విమానాలతో రోజుకు 200 విమాన సర్వీసులను నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో టాటా సన్స్‌కు 51% వాటా, మిగిలింది సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు ఉంది.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,753 |
| ఎన్ఎస్ఈ | 27,383 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 8,00,345 |
| ఎఫ్ఐఐ | 81 |
| డీఐఐ | 126 |

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,850 | ▲ 530 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,950 | ▲ 500 |
| వెండి (కిలో) | 50,300 | ▼ 100 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,960 | ▲ 190 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,100 | ▲ 180 |
| వెండి (కిలో) | 50,300 | ▼ 100 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,200 | ▲ 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,340 | ▲ 90 |
| వెండి (కిలో) | 47,400 | ▼ 300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,890 | ▲ 140 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,100 | ▲ 130 |
| వెండి (కిలో) | 47,500 | ▲ 500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,160 | ▲ 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,140 | ▲ 220 |
| వెండి (కిలో) | 47,600 | ▼ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 61.73 (రాత్రి 11.30కు) | $61.68 (గురువారం ముగింపు) |
| బ్రెంట్ | 68.16 (రాత్రి 11.30కు) | $67.92 (గురువారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 28-12-2019

| | |
|---|---|
| విశాఖ | 475-00 |
| చిత్తూరు | 478-00 |
| వరంగల్ | 453-00 |
| విజయవాడ | 464-00 |
| గోదావరి | 464-00 |
| **27-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 450-00 |

# బ్యాంక్ షేర్ల జోరు

- ఆర్‌బీఐ ఆపరేషన్ ట్విస్ట్
- మూడు పీఎస్‌బీలకు పెట్టుబడులు
- లాభాల్లో బ్యాంక్ షేర్లు
- 411 పాయింట్ల లాభంతో 41,575కు సెన్సెక్స్
- 119 పాయింట్లు పెరిగి 12,246కు నిఫ్టీ
- నేడు బ్యాంకర్లతో ఆర్థిక మంత్రి భేటీ



**బ్యాంక్**, ఆర్థిక రంగ షేర్లు శుక్రవారం దుమ్ము రేపాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు కూడా తోడవడంతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా లాభపడ్డాయి. దీంతో మూడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగుతుండటంతో సెన్సెక్స్ కీలకమైన 41,500 పాయింట్లపైకి, ఎన్ఎస్ఈ నిఫ్టీ 12,200 పాయింట్ల ఎగువకు ఎగబాకాయి. జనవరి సిరీస్ డెరివేటివ్స్ పటిష్టమైన లాభాలతో ఆరంభమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 411 పాయింట్ల లాభంతో 41,575 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 119 పాయింట్లు ఎగసి 12,246 వద్ద ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు తగ్గి 71.36ను తాకినప్పటికీ, (ఇంట్రాడేలో) మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. అయితే వారం మొత్తంగా చూస్తే మాత్రం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. బుధవారం క్రిస్మస్ సెలవు కారణంగా ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులే జరిగింది. ఈ నాలుగు రోజుల ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 107 పాయింట్లు, నిఫ్టీ 26 పాయింట్లు చొప్పున పతనమయ్యాయి.

**నాలుగు సెన్సెక్స్ షేర్లకే నష్టాలు....**

శుక్రవారం సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ట్రేడింగ్ జరుగుతున్న కొద్దీ లాభాలు పెరుగుతూ పోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 41,611 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. మొత్తం 411 పాయింట్ల సెన్సెక్స్ లాభాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ.. ఈ నాలుగు షేర్ల లాభాలే సగానికి (240 పాయింట్లు) పైగా ఉన్నాయి. మొత్తం 30 సెన్సెక్స్ షేర్లలో నాలుగు షేర్లే (అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, టీసీఎస్, కోటక్ బ్యాంక్) నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్ 2.6% లాభంతో రూ.755 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే.

### లాభాలు ఎందుకంటే....

**1 బ్యాంక్ షేర్ల ర్యాలీ...**

ఆపరేషన్ ట్విస్ట్‌లో భాగంగా ఆర్‌బీఐ సోమవారం నాడు రూ.20,000 కోట్ల విలువైన బాండ్ల క్రయ, విక్రయాలు జరపనుంది. ఫలితంగా బ్యాంక్‌ల ట్రెజరీ లాభాలు పెరుగుతాయి. పనితీరు, వ్యాపార వృద్ధి తదితర అంశాలపై చర్చించడానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల అధినేతలతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు (శనివారం) భేటీ కానున్నారు కూడా. ఈ సమావేశం నుంచి సానుకూల వార్తలు రానున్నాయన్న అంచనాలు పెరిగాయి. మరోవైపు మూడు ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు (అలహాబాద్ బ్యాంక్, యూకో బ్యాంక్, ఐఓబీ) కేంద్రం పెట్టుబడులు అందించింది. దీనితో బ్యాంక్ షేర్లు జోరుగా పెరిగాయి.

**2. అమెరికా– చైనా మధ్య ఒప్పందం**

అమెరికా– చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం తొలి దశ ఒప్పందంపై త్వరలోనే సంతకాలు జరగనున్నాయన్న తాజా వార్తలు మార్కెట్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి.

**3. కొనసాగుతున్న విదేశీ కొనుగోళ్లు....**

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగుతున్నాయి. ఈ నెలలో ఇప్పటిదాకా విదేశీ ఇన్వెస్టర్లు రూ.6,251 కోట్ల మేర నికర పెట్టుబడులు పెట్టారు. నవంబర్‌లో రూ.25,231 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విదేశీ మదుపర్లు మొత్తం మీద ఈ ఏడాదిలో మన స్టాక్ మార్కెట్లో రూ. లక్ష కోట్ల మేర పెట్టుబడుల పెట్టారు.

## విస్తరణ ప్రణాళికల పునః సమీక్ష: నాల్కో

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ అల్యూమినియమ్ కంపెనీ, నాల్కో తన విస్తరణ ప్రణాళికలను సమీక్షించనుంది. విస్తరణ ప్రణాళికలను పరిస్థితులకు తగ్గట్లుగా మార్చాల్సి ఉందని నాల్కో సీఎమ్‌డీ శ్రీధర్ పాత్ర చెప్పారు. ఇక్కడ సీఐఐ ఏర్పాటు చేసిన ఒక మైనింగ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొత్త ప్రాజెక్ట్‌లు, భారీ విస్తరణ ప్రణాళికల కోసం రానున్న నాలుగేళ్లలో రూ.30,000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నామని గత ఏడాదే నాల్కో వెల్లడించింది. నవరత్న హోదా ఉన్న ఈ కంపెనీ గనుల శాఖ అధ్వర్యంలో పనిచేస్తోంది. మైనింగ్, లోహ, విద్యుత్తు రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వాటా విక్రయం

**డీల్ విలువ 2.3 కోట్ల డాలర్లు**

**న్యూఢిల్లీ:** జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నెదర్లాండ్స్‌లో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్‌లో 39 శాతం వాటాను 2.3 కోట్ల డాలర్లకు విక్రయించనున్నది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన నెదర్లాండ్స్ అనుబంధ కంపెనీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (నెదర్లాండ్స్), జార్జియన్ స్టీల్ గ్రూప్ హోల్డింగ్స్ లిమిటెడ్‌తో కలిసి ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఈ జాయింట్ వెంచర్ కంపెనీ, జియో స్టీల్ ఎల్ఎల్‌సీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్(నెదర్లాండ్స్)కు 49 శాతం వాటా ఉంది. 39 శాతం వాటాను జాయింట్ వెంచర్ భాగస్వామి జార్జియన్ స్టీల్ గ్రూప్‌నకు విక్రయించనున్నది. ఈ విక్రయానంతరం ఈ జేవీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్(నెదర్లాండ్స్) వాటా 10 శాతానికి తగ్గుతుంది. ఒప్పందం కుదిరిన నెల రోజుల్లోపల ఈ లావాదేవీ పూర్తవ్వగలదని కంపెనీ అంచనా.

## ఆగ్రి స్టార్టప్‌ల కోసం ఐబీ గ్రూప్ వెంచర్ ఫండ్

**న్యూఢిల్లీ:** ఐబీ గ్రూప్ రూ. 200 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. వ్యవసాయ, పౌల్ట్రీ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్టార్టప్‌ల్లో ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ కోసం 'పరివర్తన్ జెన్ నెక్స్ట్' పేరుతో ఈ వీసీ ఫండ్‌ను ఏర్పాటు చేశామని ఐబీ గ్రూప్ తెలిపింది. మూడేళ్ల పాటు 25 శాతం రుణ రహిత పెట్టుబడులను అందిస్తామని ఐబీ గ్రూప్ ఎమ్‌డీ బహదూర్ ఆలీ చెప్పారు. అంతే కాకుండా సాగు సంబంధిత నిర్వహణ శిక్షణను కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. అమెరికా, యూరప్‌ల్లో ఉపయోగించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా భారత అగ్రిపెన్యూర్లను మెరుగైన వాణిజ్య అవకాశాలు కల్పిస్తామని బహదూర్ ఆలీ పేర్కొన్నారు.

## లాట్ మొబైల్స్ న్యూ ఇయర్ ఆఫర్స్



**ప్ర**ముఖ స్మార్ట్ మొబైల్ రిటైల్ దిగ్గజం– లాట్ మొబైల్స్ 2020 న్యూ ఇయర్ ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా మొబైల్స్ కొనుగోలుపై వివిధ బహుమతులతోపాటు మొబైల్ ఎక్స్ఛేంజ్‌పై 60 శాతం వరకూ డిస్కౌంట్లు, అదనంగా రూ.5,000 వరకూ ఎక్స్ఛేంజ్ బోనస్, 30 శాతం వరకూ పేటీఎం క్యాష్ బ్యాక్, 10 శాతం వరకూ హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్ బ్యాక్ పొందవచ్చునని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. అన్ని బ్రాండెడ్ మొబైల్స్ అందరికీ అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నాయని, సులభవాయిదా పద్ధతుల్లో మొబైల్స్, టీవీలు కొనుగోలు చేయవచ్చని ప్రకటన తెలిపింది.

## ఉచిత ట్రయల్స్ కుదరవు: సెబీ

**ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్‌కు ఆదేశాలు**



**న్యూఢిల్లీ:** మదుపు సంబంధిత సలహాలు, సేవలందించే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ (ఐఏ) పారదర్శకత మరింతగా మెరుగుపరచడానికి మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ నిబంధనలను కఠినం చేసింది. క్లయింట్ల నుంచి పూర్తి ఆమోదం పొందిన తర్వాతనే వారికి ఎలాంటి సేవలనైనా అందించాలని ఆదేశించింది. సేవలకు సంబంధించి ఉచిత ట్రయల్స్‌ను నిషేధించింది. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ అందించే సేవలకు ప్రతిఫలంగా క్లయింట్ల నుంచి స్వీకరించే డబ్బులను నగదు రూపంలో తీసుకోకూడదని, బ్యాంక్‌ల ద్వారానే చెల్లింపులు ఉండాలని పేర్కొంది. నగదు డిపాజిట్ల రూపంలో ఫీజులను వసూలు చేయకూడదని వివరించింది. ఈ నిబంధనలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తాయి.

## రుణ వృద్ధి 7 శాతం లోపే: ఇక్రా

**ఇదే జరిగితే 58 ఏళ్ల కనిష్టం**



**ముంబై:** భారత్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర మందగమనంలో ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తన తాజా నివేదికలో పేర్కొంది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రుణ వృద్ధి కేవలం 6.5 శాతం నుంచి 7 శాతం శ్రేణిలో ఉంటుందని విశ్లేషించింది. ఇదే నమోదయితే రుణ వృద్ధిరేటు 58 సంవత్సరాల కనిష్టస్థాయికి పడిపోయినట్లేనని కూడా పేర్కొంది. 1962లో రుణ వృద్ధిరేటు 5.4 శాతం. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు రెండవ త్రైమాసికంలో ఆరేళ్ల కనిష్ట స్థాయి 4.5 శాతంగా నమోదయిన నేపథ్యంలో ఇక్రా తాజా నివేదిక విడుదల చేసింది. గడచిన ఆర్థిక సంవత్సరం (2018–19) బ్యాంకింగ్ రుణ వృద్ధి 13.3 శాతంగా నమోదయిన విషయం గమనార్హం. భారత్ ఆర్థిక వృద్ధి రేటు అంచనాలను ఆర్‌బీఐసహా పలు సంస్థలు భారీగా తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో 7.4 శాతంగా పేర్కొన్న ఆర్‌బీఐ, ప్రస్తుతం ఈ రేటును అప్పటి నుంచీ 240 బేసిస్ పాయింట్లు (5 శాతానికి) తగ్గించింది. మూడీస్ విషయంలో ఈ అంచనా 5.8 శాతం నుంచి 4.9 శాతానికి తగ్గగా నోమురా ఈ రేటు అంచనాను 4.6 శాతానికి పరిమితం చేసింది.

## పీఎంసీ బ్యాంక్ స్కాంపై 32 వేల పేజీల చార్జిషీట్

**ముంబై:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో ఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంక్ స్కాంకు సంబంధించి ఐదుగురు నిందితులపై 32 వేల పేజీల చార్జిషీట్‌ను ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు శుక్రవారం సమర్పించింది. ఈ చార్జిషీట్‌లో ఆ బ్యాంకు మాజీ ఎండీ జాయ్ థామస్, మాజీ చైర్మన్ వర్యమ్ సింగ్, మాజీ డైరెక్టర్ సుర్జిత్ సింగ్ ఆరోరాతో పాటు, హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ (హెచ్‌డీఐఎల్) ప్రమోటర్లు రాకేశ్ వర్ధమాన్, సారంగ్ వర్ధమాన్ నిందితులుగా పేర్కొన్నారు. మోసం, సాక్ష్యాలను నాశనం చేయడం, తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించడానికి సంబంధించి ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బ్యాంక్ కుంభకోణం వెలుగులోకి వచ్చిన వెంటనే ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రస్తుతం వారు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ ఐదుగురితో పాటు పోలీసులు మరో ఏడుగురు బ్యాంకు అధికారులను కూడా అరెస్టు చేశారు. వీరిపై అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. కాగా ఈ 32 వేల పేజీల చార్జిషీట్‌లో పీఎంసీ బ్యాంక్ ఫోరెన్సిక్ అడిట్ రిపోర్టు, బ్యాంకు సొమ్ముతో నిందితుల కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలు, బ్యాంకు ఖాతాదారులతో పాటు 340 మంది సాక్షుల వాంగ్మూలాలు తదితర వివరాలు ఉన్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.




**రాష్ట్రీయం**



## మత్స్యావతారంలో రామయ్య

**భద్రాద్రిలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభం**

**భద్రాచలం టౌన్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు బేడా మండపం వద్ద ఆలయ ఈఓ జి.నర్సింహులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఆరంభించారు. అనంతరం రామయ్యను మత్స్యావతారంలో అలంకరించి అంతరాలయంలో వేంచేయింపజేశారు. మధ్యాహ్నిక ఆరాధనలు జరిపి రెండు గంటలకు మేళతాళాలు, కోలాటాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి వారిని వేంచేయింపజేశారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని 4 గంటల వరకు మిథిలా స్టేడియంలో ఉంచారు. అనంతరం తిరువీధి సేవ జరిపారు. మత్స్యావతారంలో ఉన్న రామయ్యను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

* * *

## మేడ్చల్, ముథ్కేడ్ మధ్య విద్యుత్ ట్రైన్

**రైల్వే జీఎం గజానన్ మాల్యా**

**నిజామాబాద్ సిటీ:** మేడ్చల్, ముథ్కేడ్‌ల మధ్య రైల్వే విద్యుద్దీకరణ పనులు వచ్చే ఏడాదిలో పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా తెలిపారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు విద్యుద్దీకరణ పనులు చివరి దశలో ఉన్నాయని, రానున్న సంవత్సర కాలంలో మేడ్చల్ ముథ్కేడ్‌ల మధ్య విద్యుద్దీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో నూతనంగా రూ. 120 కోట్లతో నిర్మించనున్న మల్టీకాంప్లెక్స్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

* * *

## బాలికపై యువకుడి అత్యాచారం

**మిరుదొడ్డి(దుబ్బాక):** బాలికపై యువకుడు అత్యాచారం జరిపిన సంఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మిరుదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ బాలిక 8వ తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన పూజారి మహేందర్ (23) ఈ నెల 24న బాలికకు మాయ మాటలు చెప్పి తన పొలం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం జరిపాడు. ఆ సమయంలో తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి మిత్రులకు వాట్సాప్ ద్వారా పోస్టు చేశాడు. కాగా, నలతగా కనిపించిన బాలికను తల్లిదండ్రులు ఏమైందని ప్రశ్నించగా, తనపై జరిగిన అత్యాచారం గురించి తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు చెప్పారు.

# క్యూలో నిల్చుని.. నేలపై కూర్చుని..

**ప్రభుత్వాస్పత్రిలో నిజామాబాద్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

- రోగులతో మాట కలిపి.. వైద్య సేవలపై ఆరా
- విధులకు గైర్హాజరైన 111 మందికి మెమోలు





శుక్రవారం ఉదయం సైకిల్‌పై ఆసుపత్రికి వస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, రోగుల బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నిజామాబాద్ అర్బన్:** శుక్రవారం ఉదయం 8 గంటలు.. ఓ వ్యక్తి సైకిల్‌పై సాదాసీదాగా సర్కారు దవాఖానాకు వచ్చాడు. 'జలధార'వద్దకు వెళ్లి లీటర్ నీటికి ధర ఎంత? అని ఆరా తీశాడు. ఓపీ విభాగం వద్ద రోగులతో పాటే లైన్‌లో నిల్చుని మాట కలిపాడు. మెట్ల దగ్గర కింద కూర్చొని.. ఏం పెద్దయ్యా.. ఆరోగ్యం బాగా ఉందా అని అడిగాడు. వైద్యులు బాగానే చూస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నాడు. అక్కడి నుంచి గైనిక్, జనరల్ తదితర విభాగాల్లోనూ కలియ తిరిగాడు. అయితే, గంట తర్వాత ఆస్పత్రిలో ఒక్కసారిగా హడావుడి మొదలైంది. వచ్చిన వ్యక్తి కలెక్టర్ అని తెలియడంతో వైద్యులు, సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. ఉరుకులు పరుగులు పెట్టారు. అప్పటి దాకా తమతో మాట్లాడిన వ్యక్తి కలెక్టర్ అని తెలిసి రోగులు, వారి బంధువులు అవాక్కయ్యారు.

నిజామాబాద్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం ఉదయం జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ జిల్లాకు బదిలీపై వచ్చి మూడు రోజులవుతోంది. తాను బస చేసిన ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి సైకిల్‌పై బయలుదేరి ఉదయం ఎనిమిది గంటలకల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. పార్కింగ్‌లో సైకిల్ స్టాండ్ వేసి మొదట ఆస్పత్రి ఆవరణలో జలధార కేంద్రానికి వెళ్లారు. లీటరు మంచినీరు రెండు రూపాయలకు విక్రయించడాన్ని గుర్తించారు. రూపాయికే విక్రయించాలి కదా అని అడగ్గా.. నిర్వాహకుడు రెండు రూపాయలే అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. అక్కడి నుంచి ఆస్పత్రిలోని ఓపీ విభాగం వద్ద రోగులతో పాటే లైన్‌లో నిల్చుని మాట కలిపారు. వారి ఆరోగ్య సమస్యలేంటో తెలుసుకున్న ఆయన.. వైద్యులు బాగానే చూస్తున్నారా.. సౌకర్యాలు సరిగా ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి గైనిక్, జనరల్ తదితర విభాగాల్లో కలియ తిరిగాడు. బాలింతలతో మాట్లాడారు. నాలుగైదు చోట్ల మెట్ల వద్ద, వార్డుల వద్ద కింద కూర్చొని రోగులతో మాట్లాడారు. ఓ రోగి బంధువును తనతో పాటు తీసుకుని వెళ్లి వార్డులను తనిఖీ చేశారు. జనరిక్ మందుల షాపులను పరిశీలించారు. వార్డు బాయ్‌లు, నర్సులు, సెక్యూరిటీ గార్డులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ శిబిరం వద్ద వివరాలు తెలుసుకున్నారు. అయితే.. గంట తర్వాత ఆస్పత్రిలో ఒక్కసారిగా హడావుడి మొదలైంది. కలెక్టర్ వచ్చాడని తెలియడంతో వైద్యులు, సిబ్బంది అలర్ట్ అయ్యారు. అప్పటి దాకా తమతో మాట్లాడిన వ్యక్తి కలెక్టర్ అని తెలిసి రోగులు, వారి బంధువులు సంభ్రామాశ్చర్యానికి లోనయ్యారు.

> **111 సిబ్బందికి మెమోలు**
>
> కలెక్టర్ మూడు గంటల పాటు తనిఖీలు నిర్వహించి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. విధుల్లో గైర్హాజరైన 111 మంది సిబ్బందికి మెమోలు జారీ చేశారు. జలధార కేంద్రాన్ని సీజ్ చేశారు.

## అందరూ నన్ను వాడుకొని వదిలేశారు!

**కేసీఆరే ఆశీర్వదించారు: ఎర్రబెల్లి**



**సాక్షి, జనగామ:** గతంలో అందరూ తనను వాడుకొని వదిలేశారని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వదించారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన రెండో విడత 'పల్లె ప్రగతి'అవగాహన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నాడు అసెంబ్లీలో తెలంగాణ వస్తే కరెంటు రాదని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.. నేడు సాధించుకున్న రాష్ట్రంలో కేసీఆర్ 24 గంటల కరెంటు అందిస్తూ మహాత్ముడు అయ్యాడని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.13 వేల కోట్లు ఖర్చు పెట్టి రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు నిర్మించిన పంచాయతీలకు రూ.84 కోట్లను విడుదల చేసిందని, టాయిలెట్లు నిర్మించుకున్న వారికి చెల్లించాల్సిన నిధులను పది రోజుల్లో చెల్లిస్తామన్నారు. గ్రామాల్లో చెత్త వేసే వారికి నోటీసులు ఇవ్వాలని, ఫైన్లు వేయకుండా నిర్లక్ష్యం వహించే సర్పంచ్, కార్యదర్శి పదవులను కత్తిరించే అవకాశం ఉందన్నారు. పది మండలాలకు కలిపి ఒక అధికారిని ఏర్పాటు చేశామని, నిర్లక్ష్యం ఎవరు చేసినా బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు.

## పుట్టిన రోజే.. ఆఖరి రోజు

**ట్రాక్టర్ బోల్తాపడి బీటెక్ విద్యార్థిని మృతి**



నవీన

**హుస్నాబాద్:** ట్రాక్టర్ బోల్తాపడి బీటెక్ విద్యార్థిని మృతి చెందింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన నవీన(20) వరంగల్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. శుక్రవారం ఆమె పుట్టిన రోజు కావడంతో గురువారం ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం పొలం పనుల్లో తండ్రికి సహాయ పడేందుకు వెళ్లింది. వరినారు చేరవేసేందుకు నవీన ట్రాక్టర్ వెనుక భాగంలో ఉన్న రోటవేటర్‌పై నారు వేసుకొని ట్రాక్టర్ నడుపుకుంటూ పొలం ఒడ్డు వద్దకు చేరుకుంది. ఒడ్డుపై ఉన్న ట్రాక్టర్‌ను కొంత వెనుకకు తీసుకురావాలని తండ్రి కోరగా, ఒక్కసారిగా ట్రాక్టర్ పొలంలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. నవీనపై ట్రాక్టర్ పడటంతో ఆమె బురదలో కూరుకుపోయి ఊపిరి ఆడక మృతి చెందింది.

## యువకుడి హత్య

**రామాయంపేట:** కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం బాగిర్తిపల్లికి చెందిన శేఖర్ (23) దారుణ హత్యకు గురయ్యాడు. గురువారం రాత్రి అతడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలిస్తున్న క్రమంలో రామాయంపేట శివారులో తారు రోడ్డు పక్కన అతని బైక్ పొదల్లో కనిపించింది. పక్కనే ఉన్న పాడుబడ్డ బావి సమీపంలో పరిశీలించగా.. శేఖర్‌ను హత్యచేసి బావిలో పడేసి నట్టు గురించారు. మృతదేహాన్ని బయటకు తీయించారు.

## రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

**నర్మెట:** ఓ రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన జనగామ జిల్లా నర్మెట తహసీల్ కార్యాలయం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. నర్మెట మండలం దొంగలచెలిమె తండాకు చెందిన భూక్యా బీక్య, భూక్యా లోక్య సోదరులు. గ్రామ పరిధిలో ఈ రెండు కుటుంబాలకు 86/ఆ లో 5.38 ఎకరాల భూమి ఉంది. రెండు దశాబ్దాల క్రితం బీక్య కుటుంబ సభ్యులు తమ వాటా భూమిని లోక్య కుటుంబానికి విక్రయించారు. అందులో 2.28 ఎకరాల భూమిని 2019 జూన్‌లో లోక్య కుమారుడు శ్రీరాములు తన భార్య ప్రమీల పేరున పట్టా చేయించాడు. 1–బీలోకి పేరు వచ్చినా ఇప్పటి వరకు అధికారులు పాసు పుస్తకం ఇవ్వలేదు. ఈ క్రమంలో భూమి విక్రయించిన వారు, అధికారులంతా కుమ్మక్కై తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ.. న్యాయం చేయాలని శ్రీరాములు కుటుంబ సభ్యులు పెట్రోల్ బాటిల్, పురుగుల మందు డబ్బా పట్టుకుని శుక్రవారం నర్మెట తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వారు ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు.

## పోలీసులు లంచం అడిగారని..

**కుటుంబం ఆత్మహత్యాయత్నం ● డబ్బులు అడిగినట్లు రుజువైతే చర్యలు: సీఐ**

**సుజాతనగర్:** భూమి ఫిర్యాదుకు సంబంధించిన కేసు విషయంలో పోలీసులు లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని సీతంపేట గ్రామానికి చెందిన సాదం కృష్ణయ్య, రామయ్య అన్నదమ్ములు. కృష్ణయ్యకున్న ఎకరం భూమిని రామయ్య ఇరవై ఏళ్ల క్రితం కొనుగోలు చేశాడు. ఆ భూమిని రామయ్య మరొకరికి అమ్మే క్రమంలో రెండు కుంటలు తక్కువగా ఉన్నట్లు గుర్తించాడు. ఈ విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. రామయ్య భార్య నాగమణి.. కృష్ణయ్య కొడుకు నర్సింహారావుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంతలోనే ఈ నెల 24న ఇరుపక్షాలు రాజీపడి ఫిర్యాదును వెనక్కు తీసుకున్నారు. అయితే.. ఈ విషయమై స్టేషన్‌కు రావాల్సిందిగా ఇరుపక్షాలకు పోలీసులు సూచించారు. కాగా, పోలీసులు రూ.5 వేలు డిమాండ్ చేశారని ఆరోపిస్తూ నర్సింహారావు, భార్య రజని, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడితో కలసి ప్రధాన రహదారిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించగా.. సమీపంలోని ఓ వ్యక్తి గమనించి అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, లంచం అడిగినట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ అశోక్ విలేకరులకు తెలిపారు.



పెట్రోల్ పోసుకుని రోడ్డుపై బైఠాయించిన నర్సింహారావు కుటుంబ సభ్యులు

# టెన్త్ మెమోలపై క్యూఆర్ కోడ్!

## నకిలీ మెమోల గుర్తింపునకు ప్రత్యేక విధానం

**సాక్షి, హైదరాబాద్:** పదో తరగతి నకిలీ మెమోలను అరికట్టేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా పది మెమోలపై ఇకపై క్యూఆర్ కోడ్ పొందుపరిచేందుకు చర్యలు చేపడుతోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధం అవుతోంది. 2004 నుంచి పదో తరగతి మెమోలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ప్రభుత్వ పరీక్షల విభాగం అంతకుముందు మెమోలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు కసరత్తు చేస్తోంది. అయితే ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల కోసం వెళ్లిన వారు అందజేసిన మెమోలు నకిలీవా? అసలైనవా? అని గుర్తించేందుకు ప్రత్యేక విధానాన్ని తీసుకువస్తోంది. ఇకపై విద్యార్థులకు ఇచ్చే మెమోలపై క్యూఆర్ కోడ్ ముద్రించే ఆలోచనకు వచ్చింది. తద్వారా నకిలీ మెమోలను అరికట్టవచ్చని భావిస్తోంది. అసలైన మెమోపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను రీడ్ చేస్తే సదరు అభ్యర్థికి సంబంధించిన సమగ్ర వివరాలు తెలుస్తాయని, అదే నకిలీ మెమోపై క్యూఆర్ కోడ్ ఉండదని, ఒకవేళ ఏదైనా ముద్రించినా ఆ వివరాలు రావని అధికారులు చెబుతున్నారు. తద్వారా పదో తరగతి మెమోలు నకిలీవి తయారు చేయకుండా నిరోధించవచ్చని భావిస్తోంది.

# సీటెట్ ఫలితాలు విడుదల

**సాక్షి, హైదరాబాద్:** ఈనెల 8న దేశవ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) ఫలితాలను శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విడుదల చేసింది. పరీక్షలు నిర్వహించిన 19 రోజుల్లోనే ఫలితాలను ప్రకటించడం విశేషం. ఈ పరీక్షలో ఐదు లక్షల మందికిపైగా అర్హత సాధించారు. అభ్యర్థుల సీటెట్ సర్టిఫికెట్లు, మార్కుల షీట్లను డిజీ లాకర్‌లో అందుబాటులో ఉంచుతామని సీబీఎస్ఈ తెలిపింది.

| పేపర్ | దరఖాస్తులు | పరీక్షకు హాజరు | అర్హులు |
|---|---|---|---|
| పేపర్–1 | 16,46,620 | 14,13,390 | 2,47,386 |
| పేపర్–2 | 11,85,500 | 9,91,755 | 2,94,899 |

# సాంకేతికత.. పేదల బతుకులు మార్చాలి

## 34వ ఇండియన్ ఇంజనీరింగ్ సదస్సులో గవర్నర్ తమిళిసై



**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుతం దేశంలో సాంకేతిక పురోభివృద్ధి వేగంగా దూసుకుపోతోందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. పేదల బతుకులు మార్చేందుకు, వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఈ సాంకేతికత దోహదం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ 34వ భారతీయ ఇంజనీరింగ్ కాంగ్రెస్ సమావేశాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో ఉపయోగించిన సాంకేతికత.. ఇంజనీరింగ్ అద్భుతమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎక్కువ శాతం దేశీయంగా రూపొందించిన సాంకేతికతనే వాడారని, ఇది చాలా గర్వకారణమని ప్రశంసించారు. ప్రాజెక్టును నిర్ణీత కాలంలో పూర్తి చేయడంతో ఇంజనీర్ల పాత్ర మెచ్చుకోదగ్గదన్నారు. వ్యర్థాల నిర్వహణలోనూ సాంకేతికతను ఉపయోగించాలని గవర్నర్ సూచించారు. ప్రపంచ అభివృద్ధి కోసం ఇంజనీర్లు చేస్తున్న కృషిని అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అద్భుతమైతే, మిషన్ భగీరథ తెలంగాణకే తలమానికమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కొనియాడారు. రూ.18 వేల కోట్లతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టామని, గృహ నిర్మాణం, రహదారుల విషయంలో ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ చైర్మన్ రామేశ్వర్‌రావుతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ హరిరామ్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే, రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

# ‘విద్యుత్’ విభజన పూర్తి

**ఉద్యోగులను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసిన డీఎం ధర్మాధికారి కమిటీ**

**సాక్షి, హైదరాబాద్:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య గత ఐదేళ్లుగా కొరకరాని కొయ్యగా మారిన విద్యుత్ ఉద్యోగుల విభజన వివాదానికి తెరపడింది. జస్టిస్ డీఎం ధర్మాధికారి ఏక సభ్య కమిషన్ రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ ఉద్యోగుల పంపకాలు జరుపుతూ సుప్రీం కోర్టుకు తుది నివేదికను సమర్పించింది. విద్యుత్ ఉద్యోగుల విభజనపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధ్యం కాకపోవడంతో, 2015 జూన్ 10న తెలంగాణ విద్యుత్ సంస్థలు ఏపీ స్థానికత కలిగిన 1,157 మంది ఉద్యోగులను ఏకపక్షంగా రిలీవ్ చేయడం, వారిని విధుల్లో చేర్చుకోవడానికి ఏపీ నిరాకరించడంతో ఈ వివాదం హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టుకు చేరింది. ఈ వివాద పరిష్కారానికి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ధర్మాధికారితో సుప్రీంకోర్టు గతేడాది నవంబర్ 28న ఏక సభ్య కమిషన్ నియమించింది. రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో ఏడాది కాలంలో 8 పర్యాయాలు సమావేశమైన కమిషన్ మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించలేకపోయింది. దీంతో స్వయంగా ఉద్యోగుల పంపకాలు జరుపుతూ తుది నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల విభజన కోసం జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా ఈ కేటాయింపులు జరిపింది. ఈ మార్గదర్శకాల ప్రకారం రెండు రాష్ట్రాల విద్యుత్ ఉద్యోగుల నుంచి ఆప్షన్లు స్వీకరించారు. తెలంగాణ నుంచి రిలీవైన 1,157 మంది ఉద్యోగుల్లో ఏపీకి ఆప్షన్లు ఇచ్చిన 613 మందితో పాటు ఆప్షన్లు ఇవ్వని 42 మంది కలిపి 655 మంది, రెండు రాష్ట్రాలకూ ఆప్షన్లు ఇచ్చిన 502 మందిని తెలంగాణకు కేటాయించింది. ఏపీ నుంచి స్వచ్ఛందంగా రిలీవై, తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 229 మంది సెల్ఫ్ రిలీవ్డ్ ఉద్యోగులను కూడా తెలంగాణకు కేటాయించింది. తుది నివేదిక అమలు చేయడానికి, తుది కేటాయింపులకనుగుణంగా ఉద్యోగులకు పోస్టింగులు ఇచ్చే ప్రక్రియ పూర్తి చేసేందుకు 4 నెలల గడువు విధించింది. ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 256 మంది తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపుతూ ఆప్షన్లు ఇచ్చారు. గతంలో జరిగిన సందర్భంగా వీరిలో సగం మందిని తీసుకోవడానికి తెలంగాణ ఒప్పుకున్నా, మిగిలిన వారిని తీసుకోవడానికి ఏపీ అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. తాజాగా, ఏపీ నుంచి తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చిన 256 మంది ఉద్యోగుల విషయంలో ధర్మాధికారి కమిషన్ నివేదికలో ఎలాంటి నిర్ణయాన్ని తెలపలేదు. దీంతో ఈ 256 మందిని ఏపీకే కేటాయించినట్లయిందని తెలంగాణ జెన్‌కో డైరెక్టర్ ఒకరు ‘సాక్షి’కి తెలిపారు.



సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలను అడ్డుకునేందుకు శుక్రవారం చార్మినార్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

# పీహెచ్‌డీ ప్రవేశాలకు కామన్ కేలండర్

**ఉన్నత విద్యా మండలి నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు కామన్ కేలండర్ విధానాన్ని అమలు చేయాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ప్రస్తుతం ఒక్కో యూనివర్సిటీలో ఒక్కో విధానం ఉన్నందున గందరగోళం నెలకొంటోందని, కామన్ విధానం ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాల్లో సమస్యలు తలెత్తకుండా చూడొచ్చని ఈ నిర్ణయం తీసుకుంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ పాలక మండలి సమావేశం జరిగింది. ఇటీవల ప్రకటించిన సెట్స్ తేదీలను ఆమోదించారు. జనవరి మొదటి వారం నుంచి యూనివర్సిటీల్లో స్టార్టప్ యాత్ర నిర్వహించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 22న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఉత్తమ స్టార్టప్‌లుగా నిలిచిన వాటికి అవార్డులు అందజేయనున్నారు.

- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన నాలుగు విమానాలు సాంకేతిక కారణాలతో రద్దయ్యాయి. అలాగే కొన్ని విమానాలు గంట నుంచి ఆరు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. శనివారం శంషాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, విశాఖపట్నం, మంగళూరు వెళాల్సిన 4 ఇండిగో విమానాలు రద్దయ్యాయి.






# ఏసీబీ దూకుడు!

- రెండున్నర రోజులకో కేసు నమోదు
- 149కి చేరిన ఏసీబీ కేసుల సంఖ్య
- అగ్రస్థానంలో రంగారెడ్డి, తర్వాత కరీంనగర్, వరంగల్
- పట్టుబడినవారిలో 35% రెవెన్యూ ఉద్యోగులే
- 65 కేసుల్లో నేర నిరూపణ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. లంచగొండుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. కానిస్టేబుల్ నుంచి అడిషనల్ ఎస్పీ, వీఆర్ఏ నుంచి తహసీల్దార్ వరకు ఏసీబీ ఎవరినీ వదల్లేదు. ఈ ఏడాది 149 కేసులలో అవినీతిపరులను జైలుకు పంపించింది. ఈ ఒక్క ఏడాదిలోనే సగటున ప్రతీ రెండున్నర రోజులకు ఓ అవినీతి కేసు నమోదైంది. అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ఏసీబీ ఎంత క్రియాశీలకంగా ఉందో దీన్నిబట్టి చెప్పొచ్చు. ఫిర్యాదు వచ్చినప్పటి నుంచి లంచం అడిగిన వ్యక్తి పట్టుబడేంతవరకూ పకడ్బందీగా వ్యవహరిస్తోంది. అసలు ఫిర్యాదుదారుడి ఆరోపణ నిజమో కాదో ధ్రువీకరించుకుంటుంది. తరువాత నిందితుడిపై కేసు నమోదు చేసేందుకు కావాల్సిన ఆధారాలు సిద్ధం చేసుకున్నాకే..రంగంలోకి దిగుతుంది. అందుకే, ఈ ఏడాది ఈఎస్ఐ మెడికల్ స్కాంలో అంత లోతుకు వెళ్లగలిగారు.

**ఎక్కువగా రెవెన్యూశాఖ ఉద్యోగులే..**

ఈ ఏడాది ఏసీబీకి చిక్కినవారిలో అధికంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు (దాదాపు 35%), అందులోనూ విలేజ్ రెవెన్యూ అధికారు(వీఆర్వో)లే అధికంగా ఉండటం గమనార్హం. కేశంపేటలో వీఆర్వో కోసం వల వేస్తే. .అప్పటి తహసీల్దార్ లావణ్య చిక్కడం గమనార్హం. ఆమె వద్ద ఏకంగా రూ.93 లక్షల నగదు లభించడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. తరువాత ఈఎస్ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్)లో ఈ ఏడాది వెలుగుచూసిన కుంభకోణం విలువ దాదాపు రూ.1000 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఆ కేసులోనే ఏకంగా 21 మందిని ఏసీబీ అరెస్టు చేయడం గమనార్హం. వీరితోపాటు జీఎస్టీ, అటవీ, వ్యవసాయ, పోలీసు, విద్య, ఆరోగ్య, మైనింగ్, ఆర్టీఏ, ఆర్ అండ్ బీ, కోర్టు, విద్యుత్తు, సొంత డిపార్ట్‌మెంట్ అధికారులనూ ఏసీబీ ఉపేక్షించలేదు.

**లంచం అడిగి..తీసుకోకపోయినా కేసులే!**

లంచాల కోసం వేధిస్తోన్న అధికారి నేరుగా డబ్బులు తీసుకుంటుండగానే పట్టుకోవడం అనేది ఒకనాటి పద్ధతి. కానీ, ఈ విషయంలో ఏసీబీ ఇప్పుడు రూటుమార్చింది. లంచం తీసుకోకపోయినా అడిగితేనే కేసులు పెడుతోంది. లంచం తీసుకునే అధికారికి ఆఖరు నిమిషంలో మనసు మారినా, బాధితుడిపై అనుమానం వచ్చినా లంచం తీసుకోడు. పాత విధానంలో అతన్ని పట్టుకోవడానికి పన్నిన పథకం వృథా అయ్యేది. ఇపుడు అలా కాదు. ముందు ఆడియో, వీడియో రికార్డింగులు చేసుకుంటున్నారు. ఆఖరినిమిషంలో సదరు అధికారి డబ్బు తీసుకోకపోయినా..క్రిమినల్ మిస్‌కండక్ట్ సెక్షన్ 7ఏ/2018 పీసీ సవరణ చట్టం ప్రకారం..కేసు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారు.

**ఫలించిన ఏసీబీ ప్రచారం..**

అవినీతి అధికారులు వేధిస్తే.. తమకు ఫిర్యాదు చేయాలంటూ నాలుగేళ్లుగా ఏసీబీ చేసిన ప్రచారం ప్రజలకు చేరింది. అందుకే, రోజూ తమ కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నాయని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాదిలో మొత్తంగా చూసుకుంటే వరంగల్ రీజియన్ (కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం)నుంచి అధికంగా ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయి. అత్యంత తక్కువగా హైదరాబాద్ నుంచి అందాయి. ఇదే పది జిల్లాల వారీగా చూసినపుడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి అధికంగా, తర్వాత కరీంనగర్, వరంగల్, ఖమ్మం నుంచి అందాయని అధికారులు తెలిపారు.











Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.